ఆంధ్రప్రభ

Estd 1938

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ పంచమి మ.3.50 వరకు, అనంతరం షష్ఠి; నక్షత్రం: పూర్వాభాద్ర రా.తె.5.18 వరకు, అనంతరం ఉత్తరాభాద్ర; అమృతకాలం: రా.7.15 నుండి 9.00 వరకు; వర్జ్యం: ఉ. 9.58 నుండి 11.43 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, తదుపరి మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ.3.00 నుండి 4.30 వరకు

సంపుటి: 63 • సంచిక: 363 • శుక్రవారం 11 జనవరి 2019 •విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

సీబీఐ డైరెక్టర్ వర్మపై వేటు



• ఎం.నాగేశ్వరరావుకు పగ్గాలు • భగ్గుమన్న విపక్షాలు

5 లో

చిరు వ్యాపారులకు పెద్ద ఊరట



• జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు • రూ. 20 లక్షల నుంచి 40 లక్షలకు పెంపు: ఆర్థికమంత్రి జైట్లీ

6 లో



వాళ్లిద్దరిదీ పవర్ గోల

• బాబు, జగన్‌లపై పవన్ విమర్శ • ఒకరు 3 దశాబ్దాలు ఏలతానంటారు.. • మరొకరు మళ్లీ రావాలంటారు...! • ఒత్తిళ్లను తట్టుకోలేరు గానీ... పగ్గాలు కావాలంటారు • నాకు సహనం పుష్కలం.. సంకల్పమే బలం • కమిటీల్లో అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం • కడప, గుంటూరు జిల్లాల సమీక్షా సమావేశాల్లో జనసేనాని పవన్‌కల్యాణ్

అమరావతి, ఆంధ్రప్రభ : అధికారం కోసం ఆలోచించే వారికి ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉండదని, ఇది మనకి చరిత్ర చెబుతున్న పాఠమని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మరోసారి సీఎం చేయండని చంద్రబాబు కోరుతుంటే, ఒక్క అవకాశం ఇవ్వాలని జగన్ అడగడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. పార్టీని రాష్ట్రంలో విస్తరించిన తర్వాతే పూర్తి స్థాయి కమిటీలు వేయాలన్న ఆలోచనతో ఇప్పటి వరకు కమిటీలు వేయలేదని, గత నాలుగేళ్లుగా పార్టీ కార్యకలాపాలు బలంగా జనంలోకి వెళ్లిన తరుణంలో సంక్రాంతి తర్వాత కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా గురువారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కడప, గుంటూరు జిల్లాల నాయకులు, కార్యకర్తలతో జనసేనాని విడివిడిగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన కోసం ఒక పక్క విపరీతమైన పోరాటం జరుగుతుంటే, ఆ పోరాటం తాలూకు ఒత్తిడిని తట్టుకునే నాయకుడు ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు కూడా లేరు. ఇందిరాగాంధీ లాంటి రాజకీయ సంకల్పం బలంగా ఉన్న నేతలు ఎలాంటి ఒత్తిడిని అయినా అవలీలగా తట్టుకునే వారు. ఆవిడపై

3వ పేజీలో...

పరిశ్రమతోనే సంపద

• నవ్యాంధ్రలో కొత్త పారిశ్రామిక విధానం • పరిశ్రమలకు ఊతం... ప్రభుత్వ అభిమతం! • ప్రగతి సాధనలో సమతుల్యత • వయాడక్ట్‌తో ప్రాజెక్టుల పరుగులు • రూ.22 వేల కోట్లతో జలధార కార్యక్రమం • జన్మభూమి వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశ్వ వాణిజ్యానికి వెల్‌కమ్!

• రాజధానిలో గ్యాలరీకి సీఎం శంకుస్థాపన • వారసత్వ సంపదను స్ఫురింపచేస్తున్న డిజైన్

2 లో

అమరావతి, ఆంధ్రప్రభ : భవిష్యత్ అవసరాలు, వినూత్న ఆవిష్కరణలు, జవాబుదారీతనం, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం వీటిని ఆలంబనగా చేసుకొని ప్రణాళికాబద్ధమైన పాలనకు తెరతీసినందునే ఆంధ్రప్రదేశ్ పలు రంగాలలో అగ్రగామిగా నిలిచిందని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ముఖ్యంగా జాతీయస్థాయిలో నవ్యాంధ్రప్రదేశ్ వ్యవసాయరంగంలో తొలి స్థానాన్ని ఆక్రమించిందని, ప్రకృతి సేద్యంతో సహా ఈ రంగంలో వినూత్న చర్యలు తీసుకున్న కారణంగానే ప్రథమ స్థానాన్ని చేరుకోగలిగామన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జన్మభూమి-మాఊరు' 6వ విడత కార్యక్రమంలో భాగంగా 9వ రోజు గురువారం సీఎం చంద్రబాబునాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలువురు అధికారులతో పాటు సాధారణ పౌరులతోనూ సీఎం ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కొన్ని ప్రశ్నలకు అప్పటికప్పుడు సమాధానాలు ఇచ్చారు. నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రకటించిన అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పలు ప్రాజెక్టులను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి

3వ పేజీలో...



రెండు దశల్లో మెట్రో

• తొలిదశలో విజయవాడలో... మలి దశలో రాజధానికి • ఫిబ్రవరికి మెట్రో తుది డీపీఆర్ • మొత్తం 73 కి.మీ. దూరం... 3 కారిడార్లు • ఎండీ రామకృష్ణారెడ్డి వెల్లడి

అమరావతి, ఆంధ్రప్రభ : విజయవాడ లైట్ మెట్రోలో కదలిక మొదలైంది.. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే ఒక మధ్యంతర నివేదికను అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ (ఎఎంఆర్‌సి)కు అందజేసింది. ఈ నివేదికలో కొన్ని మార్పులను అధికారులు సూచించారు. దీనికి అనుగుణంగా శిష్ట్రా సంస్థ

7వ పేజీలో...

పొత్తులకు సిద్ధం



• పాత మిత్రులకు స్వాగతం • తలుపులు తెరిచే ఉన్నాయ్... • వాజ్‌పేయి హయాంలోనే సంకీర్ణ సంస్కృతి • కాంగ్రెస్‌కు ప్రాంతీయ పార్టీలంటే గిట్టదు: ప్రధాని మోడీ

3 లో



శ్రీవారి సేవలో జగన్

• అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు • దర్శనానంతరం శారదాపీఠానికి రాక • ఆశీర్వదించిన స్వరూపానందస్వామి • ఏకాంతంగా కొద్దిసేపు చర్చలు • నేడు కడపకు పయనం

3 లో

గబ్బు సైట్లు!



• ప్రత్యర్థి పార్టీలపై బురద • నేతల వ్యక్తిగతంపై వక్రచూపు • సాంకేతిక పరిజ్ఞానం వెర్రితలలు • ప్రజాస్వామ్య వ్యవస్థకు చేటు • తప్పుడు అడ్రస్సులతో చలామణి • నకిలీ ఐపీ సంకేతాలతో ప్రత్యక్షం



(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతుండడంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ విస్తృత ప్రచార పోకడలపై దృష్టిపెట్టాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రచారంలో సోషల్ మీడియా ప్రాధాన్యత పెరిగింది. ప్రైంట్ మీడియా ద్వారా చేయలేని ఆరోపణలు, విమర్శల్ని కూడా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసుకునే వీలు చిక్కింది. తమ విజయాలు, మేనిఫెస్టోలోని అంశాలు, ఆశయాలు, ఆకాంక్షల కంటే కూడా ప్రత్యర్థులపై దుష్ప్రచారానికి ఇవి సోషల్ మీడియాను వేదిగ్గా ఎంచుకుంటున్నాయి. ఇందుకోసం ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకున్నాయి. నిపుణుల్ని ఉద్యోగులుగా నియమించుకున్నాయి. తప్పుడు అడ్రస్‌ల్తో నకిలీ ఐపి సంకేతాల్తో వెబ్‌సైట్లను ప్రారంభించాయి. కాంగ్రెస్ మూల స్థంభాలైన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూల నుంచి ఇందిర, రాజీవ్, సోనియా, ప్రస్తుత అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వరకు లక్ష్యంగా చేసుకుని ఫోటోషాప్‌లో సృష్టించిన నకిలీ ఫోటోలు, వీడియోలను విస్తృతంగా ప్రచారంలో పెట్టాయి. తద్వారా వారి వ్యక్తిత్వాన్ని కించపర్చడం ద్వారా ఆ పార్టీ పరపతిని ప్రజల్లో దిగజార్చే ప్రయత్నానికి శ్రీకారం చుట్టాయి. అలాగని ఈ విషయంలో కాంగ్రెస్ కూడా ఏం తక్కువ తినలేదు. అది కూడా పెద్ద సంఖ్యలోనే నకిలీ వెబ్‌సైట్లను ప్రారంభించింది. నకిలీ వార్తల్ని ప్రచారంలో పెట్టింది. మోడి అమిత్‌షా, రామ్‌మాధవ్, యడ్యూరప్ప, యోగి ఆదిత్యనాథ్ వంటి సీనియర్ నాయకులపై నకిలీ ఫోటోలు, వీడియోలు తయారు చేసి

3వ పేజీలో...



రూటు మారింది!



• చదువు అమెరికాలో... • జాబ్ కెనడా లేదా ఇంగ్లండ్‌లో • హెచ్ 1-బి వీసాల దెబ్బ • పెద్ద ఎత్తున ఇండియన్ల వలస • భారతీయుల సేవలకు ప్రాధాన్యం • ఫ్రాన్స్, ఐర్లండ్‌లలోనూ అవకాశాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1-బీ వీసాల మంజూరును కఠినతరం చేయడంతో భారతీయ నిపుణులు కెనడా, ఇంగ్లాండ్ వైపు దృష్టి సారించారు. ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పు రావడంతో అమెరికాలో ఉన్నత విద్య పూర్తి చేసుకుని ఆ దేశాల్లో ఉద్యోగాలకు వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత రెండేళ్ళుగా అమెరికా నుంచి కెనడా, ఇంగ్లాండ్ వెళ్ళి ఉద్యోగ అన్వేషణ చేయడంలో భారతీయులే ముందు వరుసలో నిలిచారు. హెచ్1-బీ వీసాల మంజూరులో కఠినతరం చేయడంతో భారతీయ విద్యార్థులకు ఇస్తున్న వీసాలను వినియోగించుకోకపోవడంతో అక్కడి విశ్వవిద్యాలయాల్లో సీట్లు భర్తీ కాకపోవడంతో యాజమాన్యాల్లో ఆందోళన మొదలైంది. భారత విద్యార్థులు కెనడా, ఇంగ్లాండ్ వైపు దృష్టిసారించడంతో అమెరికా



విశ్వవిద్యాలయాల యాజమాన్యాలు ట్రంప్‌ను కలిసి మొర పెట్టుకున్న సంగతి తెలిసిందే. అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించినప్పటికీ అక్కడ ఎంతోకాలం స్థిరపడే అవకాశం లేనందున కెనడా, ఇంగ్లాండ్ వైపు మొగ్గు చూపుతున్నట్టు ఇండీడ్ సంస్థ తన అధ్యయనంలో వెల్లడించింది. భారతీయ టెక్కీలకు ఇప్పటి వరకు అమెరికాలో గుర్తింపు, ప్రాధాన్యత ఇచ్చిన ఆ దేశ కంపెనీలు కూడా ఇప్పుడు హెచ్1-బీ వీసాల సమస్యతో కలవరం చెందుతున్నాయి. ప్రపంచ దిగ్గజాలైన 30 ఐటి కంపెనీల ప్రతినిధులు కూడా అధిక వేతనాల చెల్లింపు షరతులు, వీసాల మంజూరుపై అధ్యక్షుడు ట్రంప్‌ను కలిసి తమ అసంతృప్తిని వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ప్రస్తుతం కెనడా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో భారతీయ నిపుణులకు మంచి ప్రాధాన్యత ఇస్తున్నందున

7వ పేజీలో...



వరల్డ్ నెం.1 బాక్సర్ మేరికోమ్

• ఏఐబీఏ తాజా ర్యాంకుల వెల్లడి

10 లో

విశ్వ వాణిజ్యానికి 'వెల్‌కమ్'!

• రాజధానిలో వెల్‌కమ్ గ్యాలరీకి చంద్రబాబు శంకుస్థాపన • 5 ఎకరాల్లో రూ. 44 కోట్లతో నిర్మాణం • భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా డిజైన్



అమరావతి, ఆంధ్రప్రభ : ఏపీ, సింగపూర్ సంబంధాల్లో మరో కీలకఘట్టం ఆవిష్కృతమైంది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపుతెచ్చే వెల్‌కమ్ గ్యాలరీకి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. రాజధాని ప్రాంతంలోని లింగాయపాలెం అంకుర ప్రాంతంలో మొదటి దశలో భాగంగా 5 ఎకరాల్లో రూ. 44 కోట్లతో నిర్మించే వెల్‌కమ్ గ్యాలరీ వాణిజ్య అభివృద్ధి కేంద్రంగా విరాజిల్లనుంది. ప్రాచీన తెలుగు సంస్కృతి విశిష్టతను, తెలుగు జాతి వైభవాన్ని, స్మృతులను, గుర్తింపును వెల్‌కమ్ గ్యాలరీ ప్రతిబింబించనుంది. అమరావతి నగర గత వైభవాల వారసత్వ సంపదను స్ఫురణకు తేవడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిచ్చేలా గ్యాలరీ డిజైన్ రూపొందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔన్నత్యాన్ని ప్రజా సంస్కృతిని గుర్తుచేసేలా రాజధాని దగ్గర నమూనాను ప్రతిబింబించనుంది. కళలు, వినూత్న సాంకేతిక పరిష్కారాలకు కేంద్రం కానుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి సింగపూర్ స్ఫూర్తిదాయకమన్నారు. రాజధాని నిర్మాణమనే అద్భుత అవకాశం రావడం అరుదైన విషయంగా భావిస్తున్నామన్నారు. స్వల్ప వ్యవధిలో సింగపూర్ ఏ విధంగా అభివృద్ధి చెందిందో అందరికీ తెలిసిందేనన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు అంశాల్లో సింగపూర్ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకున్నామన్నారు. రాజధాని అభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వ సహకారం మరువలేనిదన్నారు. సింగపూర్ తరహా రాజధానిని అభివృద్ధి చేస్తానని గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. నైపుణ్యాభివృద్ధి, నిర్వహణ, సాంకేతిక రంగాల్లో సింగపూర్ సహకారానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. లీక్వాన్ యూనివర్సిటీ రేటింగ్‌లో ఏపీ అగ్రగామిగా ఉందన్నారు. వెల్‌కమ్ గ్యాలరీకి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ప్రపంచంలోనే అమరావతిని అద్భుత రాజధానిగా నిర్మిస్తున్నామన్నారు.

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యున్నత నగరం కావాలని ఆకాంక్షించారు. అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్స్ ఆధ్వర్యంలో చేపట్టిన వెల్‌కమ్ గ్యాలరీ గత వైభవానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు అద్దంపట్టేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. 75 రోజుల్లో అమరావతి వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణం పూర్తిచేయాలన్నారు. సింగపూర్ సహకారంతోనే రాజధానిలో తొలి అడుగు వేయగలిగామని, ఇంతటి మహా నగరాన్ని నిర్మించుకోగలుగుతున్నామన్నారు. రాష్ట్రం బాలారిష్టాల్లో ఉన్న సమయంలో సింగపూర్ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ఇవ్వడానికి సహకరించిందని, వారి మేలును మరువలేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సింగపూర్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఫిబ్రవరి నుండి పూర్తిస్థాయిలో విమాన సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రోజుకు రెండుమూడు పర్యాయాలు విమానాల రాకపోకలు సాగించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రం ఇప్పటికే అనేక రాష్ట్రాలకు నమూనాగా మారిందన్నారు. అతిత్వరలోనే ప్రపంచానికి నమూనా కానుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏపీని అవినీతి రహిత రాష్ట్రంగా చేశామని, ఇప్పటికే అవినీతి రహిత రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రపంచంలోనే మెరుగైన సాంకేతికత ద్వారా రాష్ట్రంలో పారదర్శక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రరాజధాని నిర్మాణానికి 33 వేల ఎకరాల భూములిచ్చిన రైతులను ఆయన అభినందించారు. కృష్ణా తీరాన, రాష్ట్ర నడిబొడ్డున రాజధానిని తీసుకురావడానికి భూములిచ్చిన రైతుల త్యాగాన్ని మరువలేనన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నీటి భద్రత కల్పించామని చెప్పారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో లక్షలాది ఎకరాలు సస్యశ్యామలం చేశామని, పంచనదుల మహాసంగమమే తన ప్రధాన ధ్యేయమని సీఎం అన్నారు.





బలమైన అనుబంధం : ఈశ్వరన్

నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వెల్‌కమ్ గ్యాలరీకి శంకుస్థాపన జరగడం ద్వారా ఏపీ. సింగపూర్‌ల సంబంధం మరింత పటిష్ఠమైందని సింగపూర్ కమ్యునికేషన్లు, సమాచార శాఖా మంత్రి ఈశ్వరన్ అన్నారు. ఏపీతో భంధం రోజురోజుకీ బలపడుతోందన్నారు. మొదటి దశలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని, అమరావతి నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. నవ్యాంధ్ర అభివృద్ధిలో భాగస్వాములవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆతిధ్యం బాగుందని, ఆయన విధానాలు నచ్చాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికోసం సీఎం పడుతున్న తపన చూసి సహకరించడానికి సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. ఈనేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడగ్గానే రాజధాని మాస్టర్ ప్లాన్‌కు సహకరించామన్నారు. అమరావతి నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. వెల్‌కమ్ గ్యాలరీ అమరావతికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకురానుందన్నారు. గ్యాలరీ ద్వారా పెట్టుబడులను ఆకర్షించవచ్చన్నారు. సింగపూర్, జపాన్, జర్మనీల నుండి వెల్‌కమ్ గ్యాలరీ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారన్నారు. ఇది ప్రారంభం మాత్రమేని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఈశ్వరన్ వెల్లడించారు. ఈ సందర్భంగా పలు దేశాలకు చెందిన కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందాలు జరిగాయి. ఈకార్యక్రమంలో మంత్రులు పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, నక్కా ఆనంద బాబు, ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఏడీసీ ఎండీ లక్ష్మీ పార్థసారధి, సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్, రెరా డైరెక్టర్లు చందు సాంబశివరావు, ముళ్ళపూడి రేణుక తదితరులు పాల్గొన్నారు.



నవ్యాంధ్రలో నైపుణ్య శిక్షణ భేష్!

• సింగపూర్ మంత్రి ఈశ్వరన్

అమరావతి, ఆంధ్రప్రభ : యువతకు ఉపాధి కల్పించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శాఖను ఏర్పాటు చేసి, ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా యువతకు వివిధ ట్రేడ్‌లలో శిక్షణను ఇప్పించి ఉపాధి కల్పించడం ఎంతైనా అభినందనీయమని సింగపూర్ ప్రభుత్వ వాణిజ్య, సమాచార శాఖా మంత్రి ఈశ్వరన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సింగపూర్ సింక్రోస్కిల్స్ సంస్థల ఆధ్వర్యంలో బ్రైడల్ ఫ్యాషన్ ఫోటోగ్రాఫిక్, మేకప్ ఆర్టిస్ట్ అండ్ అప్పేరల్ ఫ్యాషన్ డిజైనింగ్ విభాగంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసే కార్యక్రమంలో మంత్రి ఈశ్వరన్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. గురువారం విజయవాడలో కన్నుల పండువగా గ్రాడ్యుయేషన్ డే పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈశ్వరన్‌తో పాటు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖామంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిరువురు శిక్షణార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను నాలెడ్జ్ హబ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో స్కిల్ అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ కోర్సుల్లో 6నెలల పాటు 270 మందికి శిక్షణ ఇచ్చిందని, వీరందరికీ ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇంటర్నేషనల్ కోర్సుల్లో కూడా శిక్షణ ఇప్పించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని మంత్రి రవీంద్ర వివరించారు. వర్తమాన సంవత్సరంలో ఎనిమిది లక్షల మందికి నైపుణ్య శిక్షణను ఇచ్చి వారికి ఉపాధి అవకా శాలు కల్గించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ఈసందర్భంగా సర్టిఫికెట్లు అందుకున్న పలువురు మహిళలు, పెళ్ళి కుమార్తెలను అలంకరించే విధానంపై శిక్షణ పొందిన వైనాన్ని వివరిస్తూ తాజాగా ఈ విభాగంలో శిక్షణ పొందుతున్న వారిని అందంగా అలంకరించి ఆకట్టుకున్నారు. సర్టిఫికెట్లు పొందిన వారితో పాటు ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు వివిధ రాష్ట్రాల సంప్రదాయాలకు అనుగుణంగా ముస్తాబై ర్యాంప్ వాక్‌పై నడుస్తూ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నారు. విదేశాల్లో పెళ్ళి కుమార్తెల అలంకరణ ఎలా ఉంటుందో కూడా ప్రదర్శించి మంత్రులు ఈశ్వరన్, కొల్లు రవీంద్రతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరినీ ఆనందపరిచారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు


తిరుమల, ప్రభ న్యూస్ : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని పలువురు ప్రముఖులు గురువారం ఉదయం దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి, నగిరి ఎమ్మెల్యే రోజా, ఎమ్మెల్సీ వంతెన వెంకటసత్యనారాయణ తదితరులు ఉదయం విఐపి విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వీరికి ఆశీర్వచనం పలుకగా టిటిడి అధికారులు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

వెనుకబడిన జిల్లాల దిశదశ మార్చేస్తాం!

• పరిశ్రమల స్థాపన వేగవంతం • ఒక్కరోజే లక్ష కోట్ల పెట్టుబడులు • 1.26 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు • ఇళ్ల అర్జీలను తక్షణమే పరిష్కరించండి • టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరోజులోనే రూ.లక్ష కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను చేసుకుందని తద్వారా 1.26 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఆయన 9వ రోజు జన్మభూమి కార్యక్రమ నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. విశాఖలో డేటా సెంటర్ పార్కులు, సోలార్ పార్కులు రానున్నాయని తెలిపారు. రూ.30వేల కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్ పార్కులు, రూ.40 వేల కోట్లతో సోలార్ పార్కులు ఏర్పాటు కానున్నాయన్నారు. వర్జీనియాకు దీటుగా విశాఖ మారనుందన్నారు.

అదే విధంగా ప్రకాశం జిల్లాలో ఆసియా పల్ప్ అండ్ పేపర్ మిల్లు ఏర్పాటుకు తాజాగా ఒప్పందం చేసుకున్నామని, ఈ ఒప్పందం మేరకు రూ.24,500కోట్ల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. ఈ మిల్లు ఏర్పాటుతో ప్రత్యక్షంగా 4500 మందికి, పరోక్షంగా 12000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. జామాయిల్, సుబాబుల్ సాగుచేస్తున్న 50 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మరోవైపు రామాయపట్నం పోర్టుకు శ్రీకారం చుట్టామని, బావనపాడు పోర్టుకూడా అందుబాటులోకి రానుందని, దీంతో ఆంధ్రప్రదేశ్ ఒక లాజిస్టిక్ హబ్‌గా రూపాంతరం చెందనుందని చెప్పారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించామని, సంపద సృష్టికి ప్రయత్నాలను ముమ్మరం చేశామన్నారు. దీనిలో భాగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమలో పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఒకవైపు అభివృద్ధి చేస్తూనే, మరో వైపు ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న 6వ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమానికి ప్రజల నుండి మంచి స్పందన ఉందని, అన్ని వర్గాల ప్రజలు దీనిలో భాగస్వాములవుతున్నారని చెప్పారు. గ్రామ సభల్లో శ్వేతపత్రాలపై సమగ్రమైన చర్చ జరగాలని నిర్దేశించారు. పక్కా ఇళ్ళ కోసం ప్రజల నుంచి అనేక అర్జీలు వచ్చాయని వీటన్నింటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామ అభివృద్ధి ప్రణాళికలు అత్యంత కీలకమని, వీటిని పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. గ్రామ సభల్లో ఈ ప్రణాళికలపై విస్తృతంగా చర్చ జరగాలని చెప్పారు. జన్మభూమి కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలను జరపాలని, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు మహిళలు వేసే ముగ్గుల్లో ప్రతిభింబించేలా చూడాలన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, చంద్రన్న పెళ్ళి కానుక, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తదితర పథకాల సంబంధించిన ముగ్గులు ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమష్టి కృషితోనే సత్ఫలితాలు

• సక్రమ విధినిర్వహణతోనే గుర్తింపు • శాంతి భద్రతలు బాగుంటేనే ప్రగతి • ఏబీసీడీ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎస్ అనిల్‌చంద్ర పునేఠ

అమరావతి, ఆంధ్రప్రభ: శాంతి భద్రతలు బాగుంటేనే ప్రజలు ప్రశాంతంగా ఉంటారని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ చెప్పారు. ఇందుకు పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని చెబుతూ ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో వివిధ కేసుల్లో ప్రతిభ చూపిన నెల్లూరు, విజయవాడ, చిత్తూరు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం ఎబిసిడి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సానుకూల ధోరణితో సమిష్టిగా పని చేసినప్పుడు సత్ఫలితాలు సాధించవచ్చనడానికి ఏపీ పోలీసుల పనితీరే నిదర్శనమని ఆయన కొనియాడారు. గతంలో పంజాబ్ ఉగ్రవాద కార్యకలాపాలతో అల్లకల్లోలంగా ఉన్నప్పుడు వేలాది మంది ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లినట్లు చెప్పారు. ఆ విధంగా హైదరాబాద్‌లో వేల సిక్కు కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయని, ఇప్పుడక్కడ పరిస్థితి బాగుపడినా వెళ్లేందుకు ఎవరూ సిద్ధపడటం లేదని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారని సీఎస్ చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత పలువురు సీనియర్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ శాంతి భద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. నిరంతరం పోలీసులు అప్రమత్తంగా ఉంటే ఒక్క శాంతి భద్రతలే కాకుండా ట్రాఫిక్ కూడా మెరుగవుతుందన్నారు. ఏ ఒక్కరికైనా వ్యవస్థ క్రమంగా పని చేసినప్పుడే పేరు వస్తుందనే విషయం గుర్తుంచుకోవాలని చెప్పారు. ఇందుకు ప్రతి శాఖలో మానవ వనరుల అభివృద్ధి విభాగాల ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా సమగ్ర వ్యవస్థను రూపొందించుకొని అభివృద్ధికి బాటలు వేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

పోలీసుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఎబిసిడి అవార్డులు ఇవ్వడం స్ఫూర్తిదాయకమని సీఎస్ పునేఠ కొనియాడారు. అంతకు ముందు డీజీపీ ఆర్పీ ఠాకూర్ ఎబిసిడి అవార్డుల ప్రాధాన్యతను సీఎస్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీలు అమిత్‌గార్గ్, హరీష్ కుమార్ గుప్తా, కెఆర్ఎం కిషోర్ కుమార్, విజయవాడ పోలీసు కమిషనర్ ద్వారకా తిరుమల రావు, శాంతి భద్రతల విభాగం ఐజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

నెల్లూరు బస్టాండ్‌కు సమీపంలో రాజస్థాన్ వ్యాపారి మహేంద్రసింగ్ హత్య కేసును ఛేదించిన నెల్లూరు పోలీసులు మొదటి బహుమతి పొందారు. రాజస్థాన్ కట్టుబాట్ల నేపథ్యంలో అక్కడ జరిగిన కుట్రను ఛేదించి నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల్లో ఒకరు బెంగుళూరులో ప్రముఖ జర్నలిస్టు గౌరీలంకేష్ హంతకుల్లో ఒకరని అధికారులు తెలిపారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో నగల కోసం పేరం నాగమణి(57)ని హత్య కేసు ఛేదించిన సీసీఎస్ పోలీసులు రెండో బహుమతి పొందారు. హత్య ఆనవాళ్లు తెలియకుండా నిందితురాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ చెత్తకుండీలో దొరికిన చెప్పుల జత ఆధారంగా నిందితురాలిని గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ప్రైవేటు ట్రావెల్ బస్సులో పెద్ద మొత్తంలో బంగారం చోరీ చేసిన మహారాష్ట్ర గ్యాంగ్‌ను అరెస్టు చేసిన చిత్తూరు జిల్లా పోలీసులకు మూడో బహుమతి లభించింది.

విశాఖ నుంచి ప్రైవేటు ట్రావెల్స్ లో వెళుతున్న నగల వ్యాపారులను అనుసరించి చిత్తూరు జిల్లా బంగారుపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో 8 కేజీల బంగారు నగలను మహారాష్ట్ర ముఠా చోరీ చేసింది. టోల్‌గేట్ ప్లాజా సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా మహారాష్ట్రకు చెందిన అనుమానాస్పద వాహనం గుర్తించి నిందితులను అరెస్టు చేశారు. వీరిలో ఒక నిందితుడు విజయవాడలో జరిగిన బంగారం చోరీ కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు.



కాసుల వేట

• ప్రాజెక్టుల పూర్తికి రూ. 10 వేల కోట్ల రుణం • తిరిగి చెల్లింపులకు ఆదాయ మార్గాల అన్వేషణ

అమరావతి, ఆంధ్రప్రభ : స్వయం సంవృద్ధి దిశగా నీటి పారుదల శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటివరకూ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం తప్ప తిరిగి ఆదాయాన్ని పొందడం లేదు. అయితే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధుల మంజూరులో వివక్ష చూపడంతో ప్రాజెక్టుల నిర్మాణం కుంటుపడకుండా బ్యాంకుల నుండి రుణం తీసుకుని పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 10 ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణానికి రూ. 10 వేల కోట్లు రుణం తీసుకునేందుకు నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇప్పటికే రూ. 4 వేల కోట్లు రుణం తీసుకుని సుమారు రూ. 3 వేల కోట్ల వరకూ ఖర్చు చేయడం జరిగింది. అయితే, వీటిని పూర్తిచేయడానికి మరో రూ. 10 వేల కోట్లు అవసరం కావడంతో బ్యాంకుల నుండి రుణాలు తీసుకోవాలని నిర్ణయించారు. బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేందుకు నీటి పారుదల శాఖ ఆదాయ మార్గాలను అన్వేషిస్తుంది. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను ఏపీ వాటర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను ఏపీడబ్ల్యూఆర్‌సీకి అప్పగించారు. ఈ సంస్థ బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని ఆయా ప్రాజెక్టులకయ్యే వ్యయాన్ని భరించనుంది. ఇప్పటికే ఈఏడాది జనవరి నాటికి సోమశిల ప్రాజెక్టుకు రూ. 160.69 కోట్లు, వంశధార రెండో దశ బోడిపల్లి రాజగోపాలరావు ప్రాజెక్టుకు రూ. 203.28, గాలేరు-నగరి సుజల స్రవంతికి రూ. 342.39, నీలం సంజీవరెడ్డి ప్రాజెక్టుకు రూ. 112.79, హంద్రీ నీవా సుజల స్రవంతికి రూ. 1,101.77, వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 275.4, చింతపల్లి ఎత్తిపోతల పథకానికి రూ. 135.82, పురుషోత్తపట్నం కు రూ. 374.2, గోదావరి డెల్టా సిస్టమ్‌కు రూ. 186.96, కృష్ణా డెల్టా సిస్టమ్‌కు రూ. 300.98 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఈ పది ప్రాజెక్టుల నిర్మాణానికి ఇప్పటివరకూ రూ. 3,194.28 కోట్ల మేర వ్యయం చేశారు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా కోటి ఎకరాలను సాగులోకి తీసుకొచ్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.



అయితే, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించేందుకు నీటి పారుదల శాఖ ఆదాయ మార్గాలపై దృష్టిసారించింది. రాష్ట్రంలోని శ్రీశైలం, నాగార్జున సాగర్‌తోపాటు పట్టిసీమ వంటి ప్రాజెక్టుల నుండి వ్యవసాయ రంగానికి నీటి సరఫరా చేస్తున్నారు. అయితే, నీటి సంఘాలు శిస్తు వసూలుపై శ్రద్ధ చూపడం లేదు. కాగా, ఇప్పటి నుండి నీటి తీరువాను క్రమం తప్పకుండా వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అలాగే పట్టణాలు, గ్రామాలకు సరఫరాచేసే తాగు నీటిపై పన్నులు వసూలు చేయడంపై కూడా దృష్టి కేంద్రీకరించనున్నారు. అలాగే పరిశ్రమలకు వినియోగిస్తున్న నీరు, మినీ హైడల్ ప్రాజెక్టులు, హైడల్ ప్రాజెక్టులు, కాలువలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు తదితర ఆదాయ వనరులపై నీటి పారుదల శాఖ దృష్టి కేంద్రీకరించింది. వీటి ద్వారా వచ్చిన ఆదాయంతో బ్యాంకుల వద్ద తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించనున్నారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమయ్యే రూ. 10 వేల కోట్ల రుణాన్ని తక్కువ వడ్డీ ఇచ్చే బ్యాంకుల నుండి తీసుకునేందుకు రంగం సిద్ధమైంది.

అన్ని వాహనాలకు ఏపీ 39 సిరీస్

• ఉత్తర్వులు జారీ • నెలాఖరులోగా శ్రీకారానికి సన్నాహాలు • సాఫ్ట్‌వేర్ సిద్ధం చేస్తున్న రవాణాశాఖ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో నూతన వాహనాల రిజిస్ట్రేషన్స్‌కు ఒకే సిరీస్ నంబర్ కేటాయిస్తూ ప్రభుత్వం ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రవాణా వాహనాలకు జిల్లాల వారీగా సిరీస్ నంబర్లు ఉండేవి. దీంతో ఏ జిల్లాలో కొనుగోలు చేసిన వాహనాలను అదే జిల్లాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి రావడం వాహనదారులకు ఇబ్బందిగా మారేది. దీని వలన సమయం, డబ్బు వృధా అయ్యేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిరీస్‌కు మంత్రి అచ్చన్నాయుడు అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి చర్చించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని ఏ వాహనమైనా ఎక్కడి నుంచైనా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వెసులుబాటు కలిపించడంతో పాటు ఒకే సిరీస్ ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు. గతంలో దీనిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి వివిధ వర్గాల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సూచనలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వాహనాలకు ఏపీ39, ఆ తర్వాత నంబర్లను కేటాయిస్తారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వాహనాలకు 'జెడ్', పోలీసులకు 'పి', ట్రాక్టర్లు, ట్రాలీలు సహా అన్ని రకాల రవాణా వాహనాలకు 'టి, యు, వి, డబ్ల్యు, ఎక్స్, వై' సిరీస్‌ను కేటాయిస్తారు. సున్నాను పోలి ఉన్న నేపథ్యంలో 'ఓ' మినహా మిగిలిన అన్ని ఆంగ్ల అక్షర మాలను రవాణేతర వాహనాలకు కేటాయించనున్నారు. ప్రభుత్వపరంగా ఉత్తర్వులు జారీ కావడంతో ఒకే సిరీస్‌కు సంబంధించిన సాఫ్ట్ వేర్‌ను అభివృద్ధి చేసేందుకు రవాణా శాఖ అధికారులు నిర్ణయించారు. వీలైనంత తొందరగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి జనవరి ఆఖరు లేదా ఫిబ్రవరి మొదటి నుంచి కొత్త విధానంలో నంబర్లు కేటాయించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

దేశంలోనే ప్రథమం: మంత్రి అచ్చెన్నాయుడు



రాష్ట్ర రవాణాశాఖ తీసుకున్న నిర్ణయం దేశంలోనే ప్రథమమని రవాణాశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం వలన రవాణాశాఖకు అధిక ఆదాయం రావడంతో పాటు వాహనదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



శ్రీవారి సేవలో జగన్

తిరుమల, ప్రభన్యూస్: సుదీర్ఘ పాదయాత్ర ముగించుకుని ఇచ్ఛాపురం నుంచి తిరుమల చేరుకున్న జగన్ గురువారం శ్రీవార్ని దర్శించుకున్నారు. అలిపిరి నుంచి ఆయన కాలినడక మార్గంలో తిరుమలలోని జిఎన్‌సి టోల్‌గేట్ వరకు కేవలం మూడుగంటల్లోనే చేరుకున్నారు. అక్కడ్నుంచి వాహనంలో పద్మావతి నగర్‌లోని శ్రీకృష్ణ అతిధిభవనానికొచ్చిన జగన్‌కు టిటిడి డిప్యూటీ ఇఓ బాలాజీ, ఎఇఓ ధనుంజయ్‌లు స్వాగతం పలికారు. కొద్దిసేపు విరామానానంతరం సంప్రదాయ దుస్తులు ధరించి దివ్యదర్శనం క్యూలైన్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. మహాలఘు దర్శన సమయంలోనే శ్రీవారి సేవలో పాల్గొన్నారు. మెట్ల మార్గంలో జగన్‌ను వేలాదిమంది అనుచరులు, పార్టీ కార్యకర్తలు అనుసరించారు. ఎక్కడా ఆయన సేదదీరలేదు. నిరాటంకంగా నడక కొనసాగించారు. మధ్యలో దివ్యదర్శనం టోకెన్‌కేంద్రం వద్ద ఆయన స్వయంగా టోకెన్ స్వీకరించారు. ఆయన్తో పాటు నడిచొస్తున్న కార్యకర్తలు కూడా దివ్యదర్శనం టోకెన్లు పొందారు. శ్రీవారి దర్శనానంతరం జగన్‌కు రంగనాయకుల మండపం వద్ద వేదపండితులు ఆశీర్వచనం అందించారు. తీర్థప్రసాదాల్ని ఇచ్చారు. జగన్ రాక సందర్భంగా ఆలయం వద్ద కార్యకర్తలు, అభిమానుల ఉత్సాహం కనిపించింది. ఆయన్నుచూసేందుకు భక్తులు కూడా పోటీపడ్డారు. అందరికీ మోనంగానే ఆయన అభివాదం చేస్తూ ముందుకుసాగారు.





స్వరూపానందస్వామి ఆశీస్సులు

శ్రీవారి దర్శనానంతరం జగన్ నేరుగా గోగర్భం డ్యామ్ సమీపంలో ఉన్న విశాఖ శారదాపీఠానికి చేరుకున్నారు. అక్కడాయనకు పీఠానికి చెందిన వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి లోనికాహ్వానించారు. పీఠంలో స్వామి స్వరూపానంద సరస్వతిని జగన్ కలుసుకున్నారు. ఆయన ఆశీస్సులందుకున్నారు. అనంతరం ఇరువురు ఏకాంతంగా కొద్దిసేపు చర్చించారు. రాత్రికి అక్కడే జగన్ బస చేశారు. శుక్రవారం ఉదయం ఆయన కడప మీదుగా ఇడుపులపాయకు బయలుదేరి వెళ్తారు. జగన్ వెంట పార్టీకి చెందిన మాజీ ఎమ్‌పిలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు,భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులున్నారు.

గబ్బు సైట్లు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారంలోకి తెచ్చింది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ప్రత్యర్థులను ఆభాసుపాల్జేసే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఇటీవల ఆల్‌ఇండియా బిజెపి పేరిట ఫేస్‌బుక్‌లో ఓ పేజీని సృష్టించిన ఆకాష్‌సోని తప్పనిసరి పరిస్థితుల్లో దాన్ని మూసేయాల్సొచ్చింది. ఈ పేజీ నిండా కాంగ్రెస్ వ్యతిరేక అంశాలే. ఆ పార్టీని దేశద్రోహిగా, పాకిస్థాన్ అనుకూలవాదిగా చిత్రీకరించే కథనాలే వెల్లువెత్తాయి. సంఘపరివార్‌తో పాటు బిజెపి కార్యకర్తలు కూడా ఈ పేజీకి పాఠకులుగా మారారు. ఏకంగా పదిలక్షల మంది చదువరులు ఈ పేజీని అనుసరిస్తున్నారు. కాంగ్రెస్ నిర్వహించిన ఓ ర్యాలీలో ప్రదర్శించిన ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జెండాను ఏకంగా పాకిస్థాన్ జెండాగా పేర్కొంటూ ఇందులో ప్రచురించిన కథనం వివాదాలకు తావిచ్చింది. కాంగ్రెస్‌ను పాకిస్థాన్ అనుకూల పార్టీగా ముద్రేసేందుకు ఈ వెబ్‌సైట్ ప్రయత్నించడంతో ఆకాష్‌సోనిపై దాడి కూడా జరిగింది. ఆకాష్‌సోనికి ఆర్‌ఎస్‌ఎస్‌తో దీర్ఘకాల అనుబంధమున్నట్లు ఆ తర్వాత విచారణలో వెల్లడైంది. గతంలో ఇదే వెబ్‌సైట్‌లో జవహర్‌లాల్ నెహ్రూ అర్ధనగ్నంగా ఉన్న కొందరు విదేశీ మహిళల్తో సాన్నిహిత్యంగా ఉన్న ఫోటోను కూడా ప్రచురించింది. అప్పట్లో ఓ సారి వివాదం జరిగినా ఈ వెబ్‌సైట్ తీరు మార్చుకోలేదు. ఎన్నికల నేపథ్యంలో ఇది మరింతగా రెచ్చిపోయింది. అలాగే కాంగ్రెస్ అనుకూల నకిలీ వెబ్‌సైట్లు కూడా తక్కువ తినలేదు. వైరల్ ఇన్ ఇండియా వెబ్ సైట్ అయితే మాజీ ప్రధాని మన్మోహన్‌ను ప్రపంచంలోనే అత్యంత నిజాయితీగల నేతగా అమెరికాకు చెందిన ఓ అతిపెద్ద సర్వే సంస్థ నిగ్గుతేల్చిందంటూ వివారాలు ప్రచురించేసింది. అయితే సర్వే చేసిన సంస్థకు సంబంధించి ఎలాంటి వివరాలు ఇది పేర్కోలేదు. అసలీలాంటి సర్వే ఒకటి జరిగిందన్న దాఖలాలు కూడా ఎక్కడాలేవు.

తెలంగాణా ఎన్నికల్లో కూడా పదుల సంఖ్యలో నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొచ్చాయి. సైబర్ నేరాల నియంత్రణ విభాగం ఎప్పటికప్పుడు ఈ నకిలీల్ని గుర్తించే ప్రక్రియ చేపట్టింది. గుర్తించిన వాటిని తొలగించింది. అయినా ఇవి రోజు రోజుకు కొత్త ఐపి అడ్రస్‌ల్తో పుట్టుకొచ్చాయి. ఈ ఎన్నికల్లో కూడా అటు టిఆర్‌ఎస్, ఇటు ప్రజా కూటములే లక్ష్యంగా కొన్ని వెబ్‌సైట్లు నకిలీ వార్తల్ని విస్తృతంగానే ప్రచారం చేశాయి. కెటిఆర్, కవిత, హరీష్‌రావులపై కొన్ని వెబ్‌సైట్లు కథనాలు ప్రచురిస్తే మరికొన్ని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదండరామ్, కొండా సురేఖ, తదితరులపై నకిలీ వార్తలు గుప్పించాయి. ఈ కథనాల్లో ఎక్కువగా కుటుంబ వ్యవహారాలు, వ్యక్తిగత వివరాల్ని కూడా పొందుపర్చాయి. వీటి ప్రభావం ఏ మేరకు కనిపించకపోయినా ఎన్నికల సమయంలో పార్టీల కార్యకర్తల మనోబలాన్ని దెబ్బతీసే ప్రయత్నం మాత్రం విశృంఖులంగా సాగింది.

రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని అప్పుడే తెలుగులో కొన్ని వెబ్‌సైట్లు ఆవిర్భవించాయి. ఇవి ప్రధాన పార్టీల నాయకులపై బురదజల్లడం మొదలెట్టాయి. వ్యక్తిగత జీవితంలోకి తొంగిచూసి విమర్శలు గుప్పిస్తున్నాయి. వీటి నిర్వాహకులు కూడా అత్యంత సాంకేతిక నైపుణ్యం కలిగిన వ్యక్తులు. ఎప్పటికప్పుడు వీటి ఐపి అడ్రస్‌లను గుర్తించే ప్రక్రియను పోలీస్ యంత్రాంగం చేస్తున్నా అంతకుమించిన వేగంతో వీరు చిన్న చిన్న మార్పులు చేసి తిరిగి కంప్యూటర్ తెరపై ప్రత్యక్షం అవుతున్నారు. ఈ నకిలీ వార్తల వెబ్‌సైట్లను కట్టడి చేయాల్సిన అవసరాన్ని సామాజిక నిపుణులు నొక్కి చెబుతున్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థి బలహీనతలు, తమ బలాలపై ప్రచారం చేసుకోవడం వరకు సంప్రదా యం. అంతకుమించి నకిలీ ఫోటోలు, వీడియోలు సృష్టించి ప్రత్యర్థుల్ని నవ్వులు పాల్జేసే ప్రయత్నం ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికాదని వీరు సూచిస్తున్నారు. అందొచ్చిన సాంకేతిక పరిజ్ఞానం వెర్రి తలలేయకుండా మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సైబర్ నేరనిరోధక విభాగానికి వీరు సూచిస్తున్నారు.

28న జిల్లా కలెక్టర్ల సమావేశం

అమరావతి, ఆంధ్రప్రభ: ఈనెల 28 తేదీ సోమవారం జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహించ నున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూశాఖ) డాక్టర్‌మన్మోహన్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద ఉన్న ప్రజావేదికలో ఉదయం 9 గంటలకు ప్రారంభ మవుతుందని మన్మోహన్‌సింగ్ తెలిపారు.

మరో మూడు ఏఐఐఎంఎస్‌లు

కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ: దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన కేంద్ర కేబినెట్ కీలకమైన నిర్ణయం తీసుకుంది. దేశంలో మరో మూడు ఏఐఐఎంఎస్‌ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదంతెలిపింది. జమ్మూలోని సాంబ, కశ్మీర్‌లోని అవంతిపుర, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఒకటి చొప్పున ఈ ఏఐఐఎంఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ విజన్ సబ్‌కా సాత్.. సబ్ కా వికాస్‌కు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడించారు.



వాళ్లిద్దరిదీ పవర్ గోల!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తన సిద్ధాంతానికి అనుగుణంగా రాష్ట్రాన్ని విభజించేందుకు అంగీకరించలేదు.. అటువంటి నేతలు ఇప్పుడు కనుమరుగయ్యారని అన్నారు. 2003లో నేను రాజకీయాల్లోకి రావాలని నిర్ణయించుకున్నాను.. అప్పటి నుంచే ప్రపంచ,దేశ,రాష్ట్ర సమకాలీన రాజకీయ పరిస్థితుల్ని అధ్యయనం చేస్తూ వచ్చాను..దృఢమైన భావజాలంతోనే జనసేనకు రూపకల్పన చేశాను..2003 నుంచి డబ్బు ప్రభావిత రాజకీయాలు మన తెలుగు రాష్ట్రాల్లో పెరిగిపోయాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఏ జిల్లాలో చూసినా రాజకీయం కొన్ని కుటుంబాల చేతిలోనే ఉండిపోయాయని అన్నారు. ఈ కుటుంబాలు స్వలాభం కోసం రాజకీయాలు చేస్తూ ప్రజలను విస్మరిస్తున్నాయి.. మనం ఎదుటి వారి ని ప్రశ్నించాలంటే మనకు నైతిక బలం ఉండాలి.. ఆ నైతికబలం కోసమే 2014 సమయంలో రాష్ట్రంలో తెలుగుదేశానికి, కేంద్రంలో బీజేపీకి మద్దతు ఇచ్చానని చెప్పారు. 2014లో పరిమిత స్థానాల్లో పోటీ చేద్దామని తొలుత భావించాను..అయితే అలా పరిమిత స్థానాల్లో పోటీ చేయడం వల్ల పార్టీ బలపడదన్న ఆలోచనతో పోటీకి దూరంగా ఉండిపోయాను..ఫలితంగా జనసేన మద్దతు పలికిన తెలుగుదేశం,బీజేపీలు విజయం సాధించాయని పేర్కొన్నారు. టిడిపిలో వ్యక్తులెవర్నీ నేను వ్యక్తిగతంగా విమర్శించలేదు.. జనసేన ఐడియాలజీకి అనుగుణంగా ఒక ఫ్రేమ్ వర్క్‌లో మాత్రమే వారి గురించి మాట్లాడానని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిలా చంపేయండీ.. చింపేయండీ..వంటి మాటలను నేను ఉపయోగించలేదు..ఎప్పుడు విమర్శ చేసినా సంస్కారవంతంగానే జనసైనికులకు ఆదర్శవంతమైన భాషనే ఉపయోగించానని అన్నారు. మోడీని సపోర్టు చేయడానికి కారణం ఆయన ప్రధాని అయితే ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేస్తారన్న గట్టి నమ్మకమే..రెండు రాజకీయ పక్షాలతో దశ,దిశలేకుండా పోతున్న ఆంధ్రప్రదేశ్‌కు దిశానిర్దేశం చేయకపోతే తప్పు చేసిన వారమవుతామని భావించి తృతీయ పక్షంగా జనసేనను స్థాపించానని అన్నారు. వ్యవస్థను రాత్రికి రాత్రే మార్చలేమన్న విషయం నాకు తెలుసు..అందుకే ఓర్పు సహనంతో పని చేసుకుంటూ వెళ్తున్నాను.. ఎంత ఒత్తిడి ఉన్నా నేను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాను.అదే సమయంలో ఆ ఒత్తిడిని కార్యకర్తల మీద ఎట్టి పరిస్థితుల్లో రుద్దనని స్పష్టంచేశారు. జనసైనికులంతా నాయకులుగా మార్పు చెందాల్సిన అవసరం ఉందన్నారు. జనసేనకు యువత,మహిళలు అండగా ఉన్నారు వారి అండతో మనం ఈ ఎన్నికల్లో ముందుకు వెళ్లగలమన్న నమ్మకం ఉందన్నారు.

కడప జిల్లాకు సంబంధించి రాజంపేట,కడప పార్లమెంట్ స్థాయి కమిటీలు ఉంటాయన్నారు. డబ్బులు రాజకీయాలను శాసించలేవని పలు సందర్భాల్లో రుజువైందన్నారు. రాజకీయ పార్టీలు భావజాలంతో ఉన్నప్పుడు మాత్రమే చిరకాలం మనుగడ సాగిస్తాయి.. రాజకీయాల్లో ఆధిపత్యం కోసం కాకుండా వ్యవస్థలో మార్పు కోసం జనసైనికులు కృషి చేయాలన్నారు. జనసేనలో యువత రాజకీయ శక్తిగా మారడానికి కొంత సమయం పడుతుంది..వారిని రాజకీయ శక్తిగా మార్చే బాధ్యతను నేనే నిర్వర్తిస్తానని అన్నారు. ఐడియాలజీ,ప్రాక్టికాలిటీతో జనసేనని ముందుకు తీసుకెళ్తాను.. డబ్బు సంపాదించడానికి రాజకీయాల్లోకి రాలేదు..కెరీర్‌ఉన్నత స్థితిలో ఉన్న సమయంలోనే క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చానని స్పష్టంచేశారు. వ్యవస్థను బలపర్చడానికి వచ్చాను తప్ప నేను బలపడడానికి రాలేదన్నారు.

నాయకులను నమ్మి పార్టీ పెట్టలేదు...

మధ్యాహ్నం గుంటూరు జిల్లా నాయకులు,కార్యకర్తలతో జనసేనాని విడివిడిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పీఆర్పీ దెబ్బతిన్న తర్వాత ఓ పార్టీ స్థాపించి దాన్ని ఇంత దూరం నడిపించడం చాలా కష్టమైన వ్యవహారం..నేను నాయకులను నమ్మి పార్టీ పెట్టలేదు.. కేవలం అభిమానులు,సాధారణ కార్యకర్తలను నమ్మే జనసేన పార్టీని స్థాపించానని స్పష్టంచేశారు. మనది బలమైన శక్తితో కూడిన సమూహం..నదీ ప్రవాహంలో ఉన్న కరెంట్‌ను ఏ విధంగా అయితే పవర్‌ప్లాంట్ ద్వారా వెలికి తీస్తామో, అందరిలోని శక్తిని అలానే వ్యవస్థ రూపంలోకి తేవాలన్నారు. పొలిటికల్ ప్రాసెస్‌లో సహనం,.పట్టుదల కావాలి.. కానీ ప్రతిపక్ష నేత జగన్ 30 ఏళ్లు సీఎంగా ఉండాలని ఉంది అంటారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు మరో దశాబ్దం పాటు తానే ఉండాలంటారు.. ముందు సీఎం అవ్వాలంటే మూడు తరాలు బాగుండాలన్న ఆకాంక్ష ఉండాలన్నారు. 2019లో అద్భుతాలు చేస్తామో లేదోతెలియదు గానీ , బలంగా అయితే నిలబడతామని పేర్కొన్నారు.

గత నాలుగేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జనసేన పార్టీ కార్యకలాపాల కారణంగా పార్టీ బలంగా జనంలోకి వెళ్లిన తరుణంలో ఇప్పుడు కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. స్వచ్ఛందంగా కార్యకర్తలు ముందుకు వచ్చి పని చేస్తున్న ఏకైక పార్టీ జనసేన మాత్రమేనని అన్నారు. ఇది మనమంతా గర్వించదగ్గ విషయం.. జనసేన కార్యకలాపాల్లో పాల్గొంటున్న కార్యకర్తలు మద్యం బాటిళ్ల కోసమో, బిర్యానీ ప్యాకెట్ల కోసమో వచ్చే వారు కాదు..గుండెల నిండా అభిమానంతో స్వచ్ఛందంగా వచ్చి పని చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి చెందని కులాలను అభివృద్ధి చేయడానికి , అభివృద్ధి చెందిన కులాలను తిట్టనవసరం లేదు..సంకల్ప బలం ఉంటే వెనుకబడిన కులాలను కూడా అభివృద్ధిపథంలోకి తీసుకువెళ్లవచ్చు..కులాల మధ్య ఐక్యత లేకపోతే మన సమాజం అభివృద్ధి చెందదని పదేపదే చెబుతున్నాను..కులాల ఐక్యత పట్ల గట్టి విశ్వాసం ఉన్నందునే నేనే ఆ విషయాన్ని ప్రతి సభలో చెబుతున్నానని అన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి కావాలంటే కనీసం 30 ఏళ్లు పడుతుంది.. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, అమరావతి ముందుకు వెళ్లాలన్నా జనసేన పార్టీ ఆవశ్యకత ఉందన్నారు. ఈ సమీక్షా సమావేశాల్లో మాజీ స్పీకర్, పార్టీ ముఖ్యనేత నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, రాజకీయ వ్యవహారాల కన్వీనర్ మాదాసు గంగాధరమ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు తోట చంద్రశేఖర్, ముత్తంశెట్టి కృష్ణారావు,రాష్ట్ర కన్వీనర్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

పోత్తులకు సిద్ధం

- పాత మిత్రులకు స్వాగతం
- తలుపులు తెరిచే ఉన్నాయ్
- వాజ్‌పేయి హయాంలోనే సంకీర్ణ సంస్కృతి
- కాంగ్రెస్‌కు ప్రాంతీయ పార్టీలంటే గిట్టదు
- ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు



చెన్నై: 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోడీ పొత్తుల విషయమై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డీఏ పొత్తులు పెట్టుకునేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని, అలాంటి వారి కోసం బీజేపీ తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయని వ్యాఖ్యానించారు. పాత మిత్రులతో స్నేహం కొనసాగిస్తూ ముందుకు వెళ్తుందని అన్నారు. ఎన్‌డీఏను బలోపేతం చేసేందుకు గాను తమిళనాడులో పొత్తు పెట్టుకునేందుకు తాము రెడీ ఉన్నామంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. తమిళనాడులోని 5 జిల్లాల బీజేపీ బూత్ లెవల్ కార్యకర్తలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 కాలంలో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ తీసుకొచ్చిన 'విజయవంతమైన సంకీర్ణ రాజకీయాలు' గురించి గుర్తు చేశారు. దీని కోసం బీజేపీ ఎప్పటికీ సిద్ధంగా ఉందని వివరించారు. 20 ఏళ్ల క్రితమే వాజ్‌పాయ్ రాజకీయరంగంలో విజయవంతమైన సంకీర్ణ రాజకీయాల సంస్కృతిని తీసుకొచ్చారన్నారు. ఆయన ప్రాంతీయ ఆకాంక్షలకనుగుణంగా ముందుకు వెళ్లారని తెలిపారు. వాజ్‌పాయ్ చూపిన బాటలోనే బీజేపీ నడుస్తోందని అన్నారు. తమిళనాడులోని బీజేపీ కార్యకర్తలతో మోడీ నాల్గోసారి ఇంటరాక్షన్ నిర్వహించారు. పలువురు కార్యకర్తలు అడిగిన ప్రశ్నలకు మోడీ సమాధానాలు ఇచ్చారు. తమిళనాడులో ఏఐఏడీఎంకే, డీఎంకే, లేదా తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుందని వివరించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో ఆరు చిన్న చిన్న పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్లింది. వాటిలో డీఎండీకే, పీఎంకే, ఎండీఎంకే ఉన్నాయి. 39 సీట్లలో రెండు మాత్రమే గెలవగలిగింది. ఒకటి బీజేపీకి, మరొకటి పీఎంకేకు వచ్చింది. ఆ తరువాత బీజేపీ నుంచి ఆ ప్రాంతీయ పార్టీలు బయటికి వచ్చాయి. ఎన్‌డీఏను బలోపేతం చేయడం ఎంతో అవసరం అని, బీజేపీ పొత్తులు పెట్టుకుని భారీ మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి పాలన అందించాలని అన్నారు. కాంగ్రెస్‌కు ప్రాంతీయ పార్టీలంటే గిట్టవని, వాటిని నీచంగా చూస్తుందని, వాజ్‌పాయ్ గతంలో ఏం చేశారో కాంగ్రెస్ దానికి వ్యతిరేకం చేసిందని అన్నారు. కాంగ్రెస్ క్షేత్ర స్థాయిలోకి వెళ్లలేదని, ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకోలేదన్నారు. ఎలాగైనా తాము విజయం సాధించి పాలిస్తామనే ఓవర్ కాన్ఫిడెన్స్ కాంగ్రెస్ నాయకుల్లో బలంగా ఉందని తెలిపారు. ప్రజలతో మమేకమై పని చేయాలని, అప్పుడే విజయాలు వరిస్తాయన్నారు. ఎన్ని పార్టీలతో కూటమిగా ఏర్పడినా అంతిమంగా గెలుపు అందించేది ప్రజలే అని నొక్కి చెప్పారు. బలమైన పొత్తు అనేది సాధారణ ప్రజల్లో ఒకటి అని, వారితో కలిసి ముందుకు వెళ్లే విషయమై దృష్టి సారించాలని సూచించారు.

జగన్‌ది అధికార ఆరాటమే

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య

అమరావతి, ఆంధ్రప్రభ: జగన్‌కు అధికార ఆరాటం తప్ప ప్రజలకు మేలు చేసే మనస్సు లేదని, సీఎం చంద్రబాబు తన పాదయాత్రలో 1097మందికి రూ.25.14లక్షల వరకు సాయం చేయటం జరిగిందని, కానీ జగన్‌ని ఏమడిగినా కూడా అధికారంలోకి వచ్చాక చేస్తానని తప్పించుకుంటున్నారని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య విమర్శించారు. గురువారం విజయవాడ రాష్ట్ర అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ 62 ఏళ్ళ వయసులో ఎక్కడా విరామం లేకుండా సీఎం చంద్రబాబు 2817 కిలోమీటర్ల దూరం నడిస్తే, 45 ఏళ్లుండి వారానికి 3 రోజులు విశ్రాంతి తీసుకుంటూ, 341 రోజుల పాటు ముక్కుతూ.. మూలుగుతూ జగన్ 3648 కిలోమీటర్ల యాత్ర చేశారని ఎద్దేవా చేశారు. సాయం చేయడానికి మనసుండాలి తప్ప, అధికారంలోకి వచ్చాకే అంటూ తప్పించుకోవడం సరికాదన్నారు. వైసీపీ సభ్యురాలు రోజా మర్యాద, మంచితనం లేకుండా చంద్రబాబుని ఉద్దేశించి మాట్లాడితే తగిన విధంగా బుద్ధి చెబుతామని ఆనంద్‌సూర్య హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా పెళ్లయిన బ్రాహ్మణ యువతులకు కన్యాదానం పథకాన్ని ప్రకటించడం జరిగిందని, ఈ పథకంలో భాగంగా ఏపీలో అర్చకులుగా, పురోహితులుగా, వేదపండితులుగా విధులు నిర్వర్తిస్తున్న బ్రాహ్మణ యువకులను పెండ్లాడిన బ్రాహ్మణ యువతులకు రూ.75 వేలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



బాలయ్యతో కలిసి సినిమా చూసిన బాబు

ట్రెండ్‌సెట్ మాల్‌లో కథానాయకుడు బయోపిక్ వీక్షణం

అమరావతి, ఆంధ్రప్రభ: నట విఖ్యాత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన కథానాయకుడు చలనచిత్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీక్షించారు. గురువారం రాత్రి విజయవాడలోని క్యాపిటల్ సినిమాస్ (ట్రెండ్‌సెట్ మాల్)లో చిత్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణతో పాటు దర్శకుడు క్రిష్, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, బుద్దా వెంకన్న లతో కలిసి ఈ చిత్రాన్ని ఆయన వీక్షించారు. ముఖ్యమంత్రి కోసం కథానాయకుడు చిత్రయూనిట్ ప్రత్యేక షోను ఏర్పాటు చేసింది. ఈ సినిమాను ముఖ్యమంత్రికి చూపించేందుకు నందమూరి బాలకృష్ణ హైదరాబాద్ నుండి గన్నవరం వచ్చి రోడ్డు మార్గాన విజయవాడ చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన సాదరంగా చిత్రాన్ని చూసేందుకు ఆహ్వానించారు. ముఖ్యమంత్రితోపాటు కథానాయకుడు యూనిట్ చిత్రాన్ని వీక్షించేందుకు రావడంతో అభిమానులు ట్రెండ్ సెట్ కు పెద్ద సంఖ్యలో పొటెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబును, నటుడు బాలకృష్ణను చూసి కేరింతలతో ఉర్రూతలూగారు.

పరిశ్రమతోనే సంపద!

(మొదటిపేజీ తరువాయి)

వెసులుబాటు కలిగిందని వెల్లడించారు. వివిధ అనుమతులను మంజూరు చేయడంలో పారదర్శకతను తీసుకువచ్చిన కారణంగా పలు విదేశీ సంస్థలకు చెందిన ప్రాజెక్టులు కూడా ఆంధ్రప్రదేశ్‌లో త్వరితగతిన భారీ పెట్టుబడులతో పెద్దసంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే రీతిలో నిర్మాణానికి శ్రీకారం చుట్టాయని సీఎం చంద్రబాబు వివరించారు. వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధి విషయంలో సమతుల్యతను పాటిస్తున్న తమ ప్రభుత్వం సేవా రంగంలోనూ రాబడిని గణనీయగా పెంచుకునే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. సేవా రంగంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మరింత దృష్టి సారించాలని సీఎం పిలుపునిచ్చారు. రూ.100 కోట్లు కేటాయించి చిన్నపరిశ్రమలు కుంటుపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఆయా సంస్థలకు బ్యాంకుల నుండి రుణాలు అందేలా తాము కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. పరిశ్రమల ద్వారా అందివచ్చే సంపదే అసలైన దేశ సంపద అని, పన్నుల ద్వారా ప్రభుత్వానికి వస్తున్నది జాతీయ సంపద అని అదే స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నామని ఆయన ప్రకటించారు. దేశంలోని ప్రతీ పారిశ్రామికవేత్త కష్టపడటంతోపాటు మరో పది మందికి ఉపాధి కల్పించాలన్న తపనను ప్రదర్శిస్తున్నారని అటువంటి సంస్థలు, పారిశ్రామికవేత్తలకు అండగా ఉండాలన్నదే తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాల్లోని ఆంతర్యమన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, భారీ ఎత్తున ప్రోత్సాహకాలు, రాయితీలను కల్పించడంతో గత నాలుగేళ్ల కాలంలో నవ్యాంధ్రలోని పలు ప్రధాన పట్టణాలలో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయని చంద్రబాబు వివరించారు. నవ్యాంధ్రలోని 13 జిల్లాలు పారిశ్రామిక ప్రగతిని చవిచూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు.



ప్రభుత్వం నూతనంగా పారిశ్రామికరంగలో తీసుకువచ్చిన విధానాల ద్వారా సులభతర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ గత రెండేళ్లలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని వెల్లడించారు. ప్రభుత్వానికైనా, వ్యక్తికైనా సంకల్పం ఎంతో ముఖ్యమని, దానికి ప్రతిభను జోడిస్తే నిర్దేశిత లక్ష్యాన్ని సునాయసంగా అధిగమించగలమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ముఖ్యంగా యువతీయువకులకు ప్రతిభే గీటురాయి అని, సత్యానాదెల్ల తన ప్రతిభ ఆధారంగా అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపును సాధించి, యువతకు ఆదర్శకంగా ని లిచారని ఆయన గుర్తుచేశారు. ప్రపంచంలో ఐదు అత్యుత్తమ వాణిజ్యరాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి కావాలని ఆదిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలువురు యువతీ యువకులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానమిచ్చారు.

అభివృద్ధికి నిధులెలా ....?

లోటు బడ్జెట్‌తో ఏర్పడ్డ రాష్ట్రంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎక్కడివంటూ దివాకర్ అనే యువకుడు వేసిన ప్రశ్నకు సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. అది ''వయాడక్ట్ మంత్రం'' అని నవ్వుతూ సమాధానమిచ్చారు. మన్నం మాధవి అనే యువ పారిశ్రామికవేత్త ముఖ్యమంత్రిని ఒక కోరిక కోరారు.. తనకు ఆర్థిక సహాయం అక్కర్లేదని, తాను చిన్న వ్యాపారం చేస్తున్నానని, అందుకు అవసరమైన డ్రగ్ లైసెన్స్ వచ్చేలా చూడాలని కోరిన వెంటనే సీఎం స్పందించి, పరిశ్రమలశాఖ కమిషనర్‌ను ఆ సమస్యను పరిష్కరించాలని అప్పటికప్పుడు ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర సమాచారశాఖ ముఖ్యకార్యదర్శి రామాంజనేయులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 11 జనవరి 2019

ఉత్తరప్రదేశ్ లక్ష్యంగా పార్టీల వ్యూహాలు

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 80 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానమంత్రి పదవిని చేపట్టిన వారిలో అధిక సంఖ్యాకులు ఆ రాష్ట్రానికి చెందిన వారే, ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ గుజరాత్‌కు చెందిన వారైనా, వారణాసి నుంచి లోక్‌సభ సభ్యునిగా ప్రాతినిధ్యం వహిస్తున్న దృష్ట్యా సాంకేతికంగా ఆయన కూడా యూపీకి చెందిన వారే. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఎక్కడి నుంచి పోటీ చేస్తారో ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. కిందటిసారి దేశమంతటా మోడీ ప్రభంజనం వీచిన దృష్ట్యా ఆయన స్వరాష్ట్రంలోని వడోదరతో పాటు వారణాసి నుంచి పోటీ చేసి రెండు చోట్లా గెలుపొందారు. ఉత్తరప్రదేశ్ నుంచి ఎన్నికైన వారే ప్రధాని పదవిని చేపట్టే ఆనవాయితీ ఉన్నందున ఈసారి బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి , సమాజ్ వాదీపార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్‌తో పొత్తు కుదుర్చుకుని బరిలోకి దిగుతున్నాం. ఆమె ఎంతో కాలంగా ప్రధాని పదవిని ఆశిస్తున్నారు.ఇందు కోసం ఆమె ముందే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే, దేశ వ్యాప్తంగా బీజేపీకి ప్రత్యామ్నాయంగా మహాకూటమిని ఏర్పరిచేందుకు తెలుగుదేశం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించిన యత్నాలకు మద్దతు ఇచ్చినట్టే ఇచ్చి ఆమె చల్లగా జారుకున్నారు. తనతో పాటు అఖిలేష్ యాదవ్ కూడా కూటమికి దూరంగా ఉండేట్టు చేయగలిగారు.ఉత్తరప్రదేశ్‌లో ఈ రెండు పార్టీల పొత్తు గతంలో బాగాపని చేసినందున ఇప్పుడు కూడా అదే రీతిలో కలిసి పోటీ చేయాలని అవి నిర్ణయించుకోవడం తప్పు లేదు. సమాజ్ వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్‌కూ, మాయావతికీ గతంలో పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది.ఆయన కుమారుడు అఖిలేష్ యాదవ్ మాత్రం మాయావతితో జతకట్టడం యూపీ రాజకీయాల గురించి తెలుసున్న వారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. అఖిలేష్ యాదవ్ స్వంత నిర్ణయాలు తీసుకుంటుండటంతో ములాయం సింగ్ పార్టీకి దూరంగాఉంటున్నారు. ఆయనకు అత్యంత నమ్మకస్తుడైన పెద్ద సోదరుడు శివపాల్ సింగ్ యాదవ్‌కి తన ఆశీస్సులు అందజేస్తున్నారు. శివపాల్ ప్రగతి శీల సమాజ్ వాదీ లోహియా పార్టీని నెలకొల్పారు.ఆ పార్టీ తరఫున మొత్తం 80లోక్ సభ స్థానాలకూ పోటీ చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. శివపాల్ యాదవ్ సొంత కుంపటి పెట్టడానికి బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షాయే కారణమన్న వార్తలు నిరాధారం కాదు. ప్రతిపక్షాలను చీల్చడంలో అమిత్ షా ఆరితేరిన నాయకుడు. ప్రధాని మోడీ హావాభావలతో ప్రసంగాల ద్వారా ప్రజలను ఆకట్టుకోవడంలో నేర్పరి అయితే, తెరవెనుక రాజకీయాల్లో అమిత్ షా దిట్ట. గడిచిన లోక్ సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని 80 లోక్ సభ సీట్లలో 71సీట్లను బిజేపీకి సంపాదించి పెట్టడం వల్లనే గుజరాత్ లో ద్వితీయ శ్రేణి నాయకుడైన అమిత్ షాను మోడీ ఏకంగా పార్టీ జాతీయాధ్యక్షునిగా నియమించారు.అమిత్ షా రాజకీయాలు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుల వరకూ బాగానే పని చేశాయి.

ఇప్పుడు పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ ప్రసాద్ మౌర్యలు ఖాళీ చేసిన గోరఖ్‌పూర్,పూల్పూర్ లోక్‌సభస్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అమిత్ షా ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీజేపీ ఓటమి పాలైంది. అప్పటి నుంచి ఆయన ప్రభావం తగ్గడంప్రారంభమైంది.దానికి తోడు మహాకూటమి యత్నాలు ఫలించకుండాచేయడానికి ఆయన అఖిలేష్,మాయావతిలపై సీబీఐ కేసులు తిరుగతోడేట్టు తెరవెనుకచక్రం తిప్పారు.అమిత్ షాని ఉద్దేశించి అఖిలేష్ యాదవ్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. కమలనాథులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సమాజ్ వాదీ (ఎస్పీ), బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)ల పొత్తును విడదీయలేరనీ, వారికి (కమలనాథులకు) సీబీఐ ఉండగా,తమకు కూటమి ఉందని అఖిలేష్ చేసిన వ్యాఖ్య సవాల్ వంటిదే. తమను కమలనాథులు ఏమీ చేయలేరన్న ధీమా ఆయన ప్రకటనలో తొణికసలాడుతోంది. మాయావతి దళిత ఓటు బ్యాంకుపైనా, అఖిలేష్ వెనకబడిన తరగతుల మద్దతుపైనా ఆధారపడి పొత్తు కుదుర్చుకున్నారు.అయితే,వీరి ఎత్తుకు పై ఎత్తుగా అమిత్ షా రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న బ్రాహ్మణులను ఆకట్టుకునేందుకు అగ్రవర్ణాల్లో పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును పార్లమెంటు ఆమోదం పొందేట్టు తెరవెనక బాగోతం నడిపారు.పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలకు గాలం వేస్తున్నారు. ఒడిషా ముఖ్యమంత్రి, బిజూజనతాదళ్ (బీజేడీ) అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ మహాకూటమిలో చేరకుండా కేంద్రం నుంచిఒత్తిడి పెంచారు. ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో అమిత్ షా వ్యూహాలు ఫలించకపోయినా, కర్నాటకలో అమిత్ షా ఎత్తులు బెడిసి కొట్టినా, తెలంగాణలో ఒక్క అసెంబ్లీ సీటుతో బీజేపీ సరిపెట్టుకోవల్సి వచ్చినా, ఇప్పటికీ అమిత్ షాపైనే ఎక్కువ ఆధారపడుతున్నారు. రాజస్థాన్,మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ లలో పార్టీ ఓటమికి అమిత్ షా కట్టిన గ్రూపులు వికటించడమే కారణం. అయినప్పటికీ ప్రధానమంత్రి మోడీ మాత్రం వరుసగా పదిపదిహేనేళ్ళుగా అధికారంలో కొనసాగుతున్నందువల్లే ఆ మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వ వ్యతిరేకత వల్ల పార్టీ ఓడిపోయిందని అంటున్నారు. నిజానికి అమిత్ షా తంత్రాంగమే ఓటమికి కారణం. ఉత్తరప్రదేశ్‌లో ఈసారి అమిత్ షా ఎత్తులు పని చేయవు.అక్కడ అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అతి స్వల్ప కాలంలోనే ప్రజలకు దూరమయ్యారు. అయోధ్య,ఆగ్రాల పేర్లు మార్చడంతో సహా ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ పార్టీ పై ఆగ్రహాన్ని పెంచాయి. గోరక్షకుల దాడుల వల్ల దళితులు, సమాజంలో అట్టడుగు వర్గాలు దూరమయ్యారు. మరో వంక కాంగ్రెస్ కూడా ఉత్తరప్రదేశ్‌లో బలాన్ని పెంచుకుంది. అందుకే, తమ కూటమిలోకి కాంగ్రెస్ ని రానివ్వకుండా మాయావతి తలుపులు మూసేసినా వెరవకుండా తమ పార్టీ ఒంటరిగా, సొంతబలంపై పోటీ చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. ఉత్తరప్రదేశ్‌కు గతంలో ఎన్నడూ లేనంతగా వేల కోట్ల రూపాయిల విలువైన పథకాలనూ, ప్రాజెక్టులను మోడీ ప్రకటించారు. అగ్రవర్ణాల ఓట్లను కాంగ్రెస్ నుంచి కైవసం చేసు కోవడానికే ఈబీఎస్ రిజర్వేషన్లను పార్లమెంట చేతహడావుడిగా ఆమోదింపజేశారు. అఖిలేష్ యాదవ్ బాబాయ్ ప్రభావం ఏ మేరకు ఉంటుందో ఈ ఎన్నికల్లో తేలిపోతుంది. ప్రతిపక్షాల ఓట్లు చీలిపోవడం తమకే లాభమని కమలనాథులు గంపెడాశతో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ లక్ష్యంగా అన్ని పార్టీలూ తమ వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి.


ఫలిస్తున్న పరి'శ్రమ'

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ఉత్పాదక రంగం వృద్ధి గణనీయంగా పెరుగుతూ వస్తోంది. దేశ పారిశ్రామిక వృద్ధిని కూడా రాష్ట్ర పారిశ్రామిక వృద్ధి అధిగమించింది. సులభతర ప్రోత్సాహ పాలసీలను తీసుకురావడం ద్వారా 2 ,622 పెద్ద మరియు భారీ ప్రాజెక్టులను వివిధ రంగాల నుండి ఆకర్షించగలిగింది. ఫలితంగా నాలుగేళ్ల కాలవ్యవధిలో రూ. 15.48 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టుకోగలిగింది. విశాఖ కేంద్రంగా గత మూడేళ్లుగా వరుసగా జరుగుతున్న భాగస్వామ్య సదస్సుల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న ఇవన్నీ ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి. వీటన్నింటినీ ప్రభుత్వంలోని 18 రకాల శాఖలు, ఏజెన్సీలు పర్యవేక్షిస్తూ వాటి పురోభివృద్ధికి కృషిచేస్తున్నాయి. ఈ పరిశ్రమల పురోగతి, పెట్టుబడులు తదితర అంశాలను పర్యవేక్షించేందుకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా 810 పెద్ద మరియు భారీ ప్రాజెక్టులు రూ. 1.77 లక్షల కోట్ల పెట్టుబడులతో తమ సంస్థలను ఏర్పాటుచేసి ఉత్పత్తిని ప్రారంభిచేందుకు సన్నద్ధమౌతున్నాయి. దీనిద్వారా 2.51 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మరో 1,211 పెద్ద ప్రాజెక్టులు రూ. 5.27 లక్షల కోట్ల పెట్టుబడులతో తమ తమ సంస్థలను ఏర్పాటు చేస్తున్నాయి. ఇవన్నీ వివిధ దశల్లో నిర్మాణ పనులు వేగవంతంగా జరుపుకుంటున్నాయి. ఎంఎస్ఎంఈ రంగంలో 2014 జూన్ నుండి ఇప్పటి వరకూ 30,349 యూనిట్ల ఏర్పాటు ద్వారా 3.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఏపీలో ఇప్పటికే ఇసుజీ మోటార్స్, పెప్సీ, కేడ్‌బరీ, కెల్లాగ్స్, గ్రీన్‌ప్లే, గమేశా, సుజ్‌లాన్ ఎనర్జీ, కోల్గేట్ పామోలివ్, టాటా కెమికల్స్, బెర్జర్ పెంయిట్స్, అరబిందో ఫార్మా, లవురస్ ల్యాబ్స్, హాస్పిర హెల్త్ కేర్, డాక్టర్ రెడ్డీస్ లాబ్స్, లుపిన్, రెగ్జిమ్ వంటి సంస్థలు తమ వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించేదశలో ఉన్నాయి. సూర్యోదయ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన విధివిధానాలు, కార్యాచరణతో ముందుకెళ్లడం మూలంగానే ఇది సాధ్యపడింది. దీనికితోడు రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలు, పరిశ్రమల ఏర్పాటుకు ఇస్తున్న ప్రోత్సాహకాలను చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, యుఏఈ, యూకే వంటి దేశాల్లో రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేసిన కృషి ఫలించింది. ఇదే సమయంలో దేశంలోని అనేక సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది. ఇందుకోసం వరల్డ్ ఫుడ్ ఇండియా, టెక్స్‌టైల్స్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, ఇండియా కెమ్, ఏరో ఇండియా వంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా స్వదేశీ పెట్టుబడి దారులను ఆకర్షిస్తోంది. అలాగే అంతర్జాతీయ స్థాయిలో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌ను స్విట్జర్‌లాండ్‌లోనూ, రష్యాలో ఇన్నోప్రోమ్, తైవాన్‌లో ట్రైట్రానిక్స్, బయోయూఎస్ఏ, స్వీడన్‌లో మేక్ ఇన్ ఇండియా, జన్మనీలో మెస్సీ వంటి వాటి ద్వారా పెద్ద, భారీ పెట్టుబడి సంస్థలను ఆకర్షిచేందుకు ఏపీ ప్రభుత్వం రోడ్ షోలను నిర్వహించింది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం నూతన రాష్ట్రంలో పారిశ్రామిక రంగం అనేది బలహీనంగా ఉండేది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూర్చుకోవడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ తయారీ రంగం కంటే రాష్ట్రంలో తయారీ రంగం దాదాపు 10 ఏళ్లు వెనుకబడి ఉండటం గమనార్హం. అంతేకాకుండా ఉమ్మడి రాష్ట్రంలో దేశంలోనే అభివృద్ధి చెందిన ఐటీ రంగాన్ని పూర్తిగా కోల్పోవాల్సిన పరిస్థి తి ఏర్పడింది. రూ. 34 వేల కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోయేలా చేసింది. ఇది రాష్ట్ర ఆదాయంలో 48.19 శాతంగా ఉంది. అంతేకాకుండా ఉపాధి అవకాశలను కూడా భారీగా కోల్పోవాల్సి వచ్చింది.





వీటన్నింటికంటే ప్రధానంగా రాష్ట్ర విభజన అనంతరం విద్యుత్ రంగం కూడా సంక్షోభంలో ఉంది. ఇది పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. విద్యుత్ కోతలతో పారిశ్రామికరంగం నష్టాల్లోకి వెళ్లింది. వీటికారణంగా వోక్స్‌వాగన్, ప్రోటోన్ వంటి అనేక దిగ్గజ సంస్థలు వెనుదిరిగిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటితోపాటు 2010-11 నాటికి రాష్ట్రంలో రూ. 2,060 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహాలు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన పాలసీలు అందుబాటులో లేకుండా పోయాయి. అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోలేదు. అటువంటి ప్రతికూల పరిస్థితుల నుండి రాష్ట్రం జాతీయ స్థాయి అభివృద్ధితో పోటీపడుతూ పురోభివృద్ధి చెందుతోంది.



ఆటోమెబైల్ రంగంలో రూ. 24,600 కోట్ల పెట్టుబడులు

రాష్ట్రం ఏర్పడిన ఈ నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆటోమోబైల్ రంగంలో 3.7 బిలియన్ (రూ. 24, 600 కోట్లు)ల పెట్టుబడులను ఆకర్షించగలిగింది. వీటిలో కియా మోటార్స్, ఇసూజీ మోటార్స్, అపోలో టైర్స్, అశోక్ లేలాండ్, భారత్ ఫోర్జి, హీరో మోటార్స్ వంటి దిగ్గజ సంసథల పెట్టుబడులను ఆకర్షించగలిగింది. ఇసూజీ మోటార్స్‌కంపెనీ నెల్లూరులోని శ్రీసిటీలో రూ. 1,500 కోట్ల పెట్టుబడులతో తమ సంస్థ కార్యకలాపాలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. దీని ద్వారా 1,200 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 50 వేల వాహనాలను ఉత్పత్తి చేయనున్నారు. ఇసూజీ అనుబంధ సంస్థలైన ఎన్‌హెచ్కే స్ప్రింగ్స్, టాటా టోయో, ఏఎల్ఎఫ్ ఇంజనీరింగ్ వంటి ఇప్పటికే తమ పనులను ఆరంభించాయి. మహబాల్ మెటల్స్, వీల్స్ ఇండియా, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్ వంటి కంపెనీలను కూడా ఇసూజీ మోటార్స్ కంపెనీ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది రాష్ట్రప్రభుత్వం వెనుకబడిన జిల్లాల ఆల్ట్రా మెగా ఇంటిగ్రేటెడ్ ఆటోమెబైల్ పాలసీని తీసుకొచ్చింది. దీని ద్వారా ఒక బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులను ఆకర్షించగలిగింది. ఈపాలసీ ఎఫ్‌డీఐ పెట్టుబడులను ఆకర్షించే పాలసీగా దేశంలోనే గుర్తింపు పొందింది. కియా మోటార్స్ సంస్థ 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో అనంతపురంలో ఈ పాలసీ ద్వారానే ఏర్పాటవుతోంది. ఈ సంస్థ దాని అనుబంధ సంస్థలను కూడా ఏర్పాటుచేస్తోంది. ఈ సంస్థ ఏడాదికి 3 లక్షల వాహనాలను ఉత్పత్తి చేయనుంది. ఈ సంస్థ ఏర్పాటు ద్వారా 4 వేల మందికి ప్రత్యక్షంగానూ మరో 7 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జనవరి నెలాకరు నాటికి కియా మోటార్స్ తొలి వాహనం ఏపీ రోడ్లపై తిరగనుంది. ఆమేరకు కంపెనీ తన పనులను వేగవంతంచేస్తోంది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ మెబిలిటీ పాలసీని తీసుకొచ్చి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు ఆరంభించింది.

బడ్జెట్‌లో అధిక కేటాయింపులు

రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పేందుకు పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రోత్సాహాలకోసం 2009 నుండి 2014 మధ్య కాలంలో సగటున సగటున రూ. 312 కోట్ల వంతున నిధులు కేటాయిస్తే 2014-15 నాటి నుండి దానికి నాలుగు రెట్లు ఇప్పుడున్న రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకం రూ. 1,218 కోట్లకు చేరింది. 2014 జూన్ నుండి 2018 డిసెంబరు మధ్య కాలంలో రాష్ట్రప్రభుత్వం రూ. 3,675 కోట్లను కేటాయించి 28,083 సంస్థలకు పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేయడం జరిగింది. ఇందులో ఎంఎస్ఎంఈలకు సంబంధించి 26, 597 కంపెనీలకుగానూ రూ. 1,816 కోట్లు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఐటీ కంపెనీలకు సంబంధించి రాష్ట్రంలోని 68 ఐటీ కంపెనీలు, వాటి అనుబంధ సంస్థలకు రూ. 31.12 కోట్లను విడుదల చేయడం జరిగింది.

-టీవీ రమణారెడ్డి

సంజీవయ్యపై కవితల పోటీలు

నిస్వార్థ ప్రజాసేవకు నిలువెత్తు సాక్ష్యం- దామోదరం సంజీవయ్య (అవిభక్త తెలుగు రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి) స్మారక కథ, కవితల పోటీలకు కథలు, కవితలను ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఆహ్వానిస్తున్నాము.

కథకు: మొదటి, రెండవ, మూడవ నగదు బహుమతులు వరుసగా రూ.3000, రూ.2000, రూ.1000. **కవితకు:** రూ.2000, రూ.1116, రూ.1000.

చేతిరాతలో కథలు 5-7 పేజీలు, కవితలు 30 పంక్తులు మించకూడదు. జిరాక్స్ కాపీలు పంపవద్దు... **ఆఖరు తేదీ:** ఫిబ్రవరి 14.

పంపవలసిన చిరునామా: డి.ఎస్. సిద్ధార్థ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, ప్లాట్ నెంబర్ 105, మహాలక్ష్మి టవర్స్, దేవాపురం 5వ లైను, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం వెనుక, బృందావన్ గార్డెన్స్, గుంటూరు. 522006. మరిన్ని వివరాలకు ఫోన్: 8008189979కు సంప్రదించగలరు.

-ఎస్ఆర్ రావు, కర్నూలు

గంగ కాలువకు శీనన్న పేరు పెట్టాలి

తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించేందుకు, నెల్లూరు జిల్లా సస్యశ్యామలం అయ్యేందుకు ప్రణాళిక రూపొందించిన మాజీ రెవిన్యూ మంత్రి, దివంగత నల్లపురెడ్డి శ్రీనివాసుల రెడ్డి (శీనన్న) పేరును గూడూరు రెవిన్యూ డివిజన్ లో ఐదువేల ఎకరాకుపైగా నీరు అందిస్తున్న తెలుగు గంగ ఐదవ బ్రాంచి కాలువకు పెట్టాలి. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీరామారావుకు సముచితమైన సలహాలు ఇచ్చి తెలుగు గంగ ప్రాజెక్టును చేపట్టేట్టు చేసిన శ్రీనివాసులు రెడ్డి చేసిన కృషికి గుర్తింపుగా ఈ కాలువకు ఆయన పేరు పెట్టడం ఎంతో సముచితం. చెన్నైకి మంచినీరు కోసం ఈ కాలువను నిర్మించారు. ఇందుకోసం శ్రీనివాసులు రెడ్డి ఎంతో కృషి చేశారు. ఈ డివిజన్ లోరైతుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు అయ్యేందుకు శ్రీనివాసులు రెడ్డి ఎంతో కృషిచేశారు. ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించాలి.

-సుంకర మహేష్ బాబ్జి, విడవలూరు

గళఘోషం

పెన్షన్ సొమ్ము పెంచినందుకు కృతజ్ఞతలు

తెలంగాణలో వృద్ధులకు పెన్షన్‌ను వెయ్యి రూపాయిల నుంచి 2016కు పెంచడం, ఏప్రిల్ నుంచి కొత్త పెన్షన్లను అమలు జేయాలని నిర్ణయించడం ముదావహం. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాష్ట్రంలో సీనియర్ సిటిజన్లు అంతా పెద్ద కొడుకుగానే భావిస్తున్నారు. వికలాంగులు,చేనేత కార్మికులకు క్రమం తప్పకుండా ఆసరా పెన్షన్లు ఇస్తున్నందుకు వారంతా ప్రభుత్వానికి కృతజ్ఞులై ఉంటారు. నిరుద్యోగులైన యువతకు స్వయంఉపాధిని కల్పించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాల్సిందిగా కోరుచున్నాను.

-కే అరుణ్ రాజీవ్,బోడుప్పల్

సీబీఐలో రోజుకో రచ్చ!

కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) డైరక్టర్ గా అలోక్ వర్మను తిరిగి నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించడం, పదవీ బాధ్యతలను స్వీకరించిన 24 గంటలలోపే ఆయనను తొలగిస్తూ ఆ సంస్థ డైరక్టర్ ఎంపిక కమిటీ నిర్ణయం తీసుకోవడంతో ఆ సంస్థ వ్యవహారాలు మరోసారి రచ్చకెక్కాయి. దేశంలో అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సిబిఐ వ్యవహారాలు రోజుకో మలుపు తీసుకోవడంతో ఆ సంస్థపై నమ్మకం పూర్తిగా సడలిపోయే ప్రమాదం ఏర్పడింది.ఈ నేపథ్యంలో ఆ సంస్థ పూర్వాపరాల గురించి తెలుసుకోవడం సందర్భోచితమే.

బ్రిటిష్ వారి కాలంలో ఏర్పడిన సంస్థలు,వ్యవస్థలు, శిక్షణా సంస్థలను స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగిస్తున్నాం. స్వతంత్ర భారత దేశంలో కూడా వలస పాలన ఛాయలు కొనసాగుతున్నాయి. దేశ సమైక్యతను కాపాడే ఉద్యోగ స్వామ్యంలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీసు సర్వీసు (ఐపీఎస్) ముఖ్యమైనవి. బ్రిటిష్ వారి కాలంలో ఉన్న ఇండియన్ సివిల్ సర్వీసు (ఐసీఎస్) నే, ఐఏఎస్ గా మార్చారు.ఇండియన్ పోలీసు సర్వీసు ఆలిండియా సర్వీసులో భాగమే.1990వ దశకం తర్వాత ఆలిండియా సర్వీసులు ఐఏఎస్, ఐపీఎస్,ఇండియన్ ఫారిన్ సర్వీసు (ఐఎఫ్ఎస్) ల సేవలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలను కాపాడుకునేందుకు వినియోగించుకోవడం జరుగుతోంది. కారణం, రాజకీయ కార్యనిర్వాహక వర్గమైన ప్రధానమంత్రి, మంత్రివర్గం నిర్ణయాలలో ఏకత్వాన్ని చూడటం లేదు. సంకీర్ణ ప్రభుత్వాలు, మైనారిటీ ప్రభుత్వాల పాలనలో ఈసర్వీసులస్థితిలో దిగజారుడుతనం ప్రారంభమైంది.రాజకీయ నిర్వాహక వర్గం అసలైన ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గం మధ్య లింకు బాగా ఏర్పడింది. ఒకరి కొనసాగింపు మీద మరొకరు ఆధారపడటం మొదలైంది. ఈ రెండు కార్యనిర్వాహకవర్గాలు- బ్యూరో క్రసీ,పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ల మధ్య అవగాహన ఏర్పడి పరస్పరం లాభం కలిగే రీతిలో బ్యూరో క్రసీ ఒదిగి పని చేసి మంత్రుల ద్వారా ప్రయోజనాలు పొందే స్థాయికి వచ్చాయి.

బ్యూరోక్రసీ, ఉద్యోగ స్వామ్యం స్వంత నిర్ణయాలు చేయలేవు.రాజకీయ కార్యనిర్వాహక వర్గం ఆదేశాలను అధికారులు అమలుజేస్తారు. అందువల్ల రాజకీయ నిర్ణయానిదేపైచేయ. ఈ నేపథ్యంలో ఐపీఎస్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో పని చేయవలసి రావడంతో తటస్థంగా రాజకీయ ప్రమేయం లేకుండా పని చేసే తీరును మార్చేసుకున్నాయి. ఐఏఎస్‌లు, ఐపీఎస్ లు పదవీ విరమణ తర్వాత వచ్చే నియామకాలపై ముందే కన్ను వేసి స్వతంత్రంగా పని చేయకుండా, రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉంటే వారి ఆదేశాలకు అనుగుణంగా పని చేయడంలో ఆరితేరారు. ఐపీఎస్‌లు సర్వీసు పూర్తి అయ్యాక గవర్నర్ పదవులు,సలహాదారుల పదవులు,వివిధ సంస్థల చైర్మన్ల వంటి రాజకీయ పరమైన నియామకాలను ఆశిస్తున్నాయి. దాంతో ఇచ్చి పుచ్చుకునే ధోరణి మొదలైంది. బ్యూరోక్రసీ కూడా మంత్రులు, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రిల చేతులో పని చేసి ప్రయోజనాలు పొందుతున్నాయి. అదే తీరులో మితవాద పార్టీ అయిన బీజేపీ తరపున ముఖ్యమంత్రిగా వ్యవహరించిన నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత, ఆయనతో పాటు గుజరాత్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌లు పెద్ద ఎత్తున కేంద్రంలో చేరారు. దాంతో వారే విధాన నిర్ణయాల్లో ప్రధానమంత్రిని ప్రభావితం చేస్తున్నారు. ముఖ్యంగా ఐపీఎస్ లు సీబీఐ వంటి సంస్థల్లో అధికంగా గుజరాత్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. గుజరాత్ దేశంలో అంతర్భాగమే అయినప్పటికీ, కేంద్రంలో వచ్చి చేరిన ఐపీఎస్ అధికారుల పనుల్లో అక్కడి మాదిరిగానే వ్యవహరించడం దురదృష్టకరం.



ఆస్థానా



వర్మ

సీబీఐలో సంక్షోభానికి గుజరాత్ నుంచి వచ్చిన ఐపీఎస్ అధికారి రాకేష్ ఆస్థానాయే మూల కారణం. సీబీఐ డైరక్టర్ అలోక్ వర్మకూ, స్పెషల్ డైరక్టర్ రాకేష్ ఆస్థానాకూ మధ్య పొసగలేదు.ఇద్దరూ కలిసి సీబీఐని రచ్చకెక్కించారు.సమస్యలు వాటంతట అవి పరిష్కారం అవుతాయి. కాని మరి కొన్ని తటస్థంగా ఉంటాయి. మన దేశంలో బ్యూరోక్రసీ ఎప్పుడూ తటస్థంగానే ఉండేది. కానీ పరిస్థితుల అవగాహన పెరిగింది. దాంతో ప్రభుత్వ నిబంధనల్లో లొసుగులను గ్రహించిన వారు వాటిని తమ స్వార్థం కోసం వినియోగించుకుని వేల కోట్ల కాంట్రాక్టుల పేరు మీద లాభపడి ప్రభుత్వాలకు పన్నుచెల్లించకుం డా ఎగవేయడంతో సొంత ఆస్తులను అనూహ్యం గా పెంచుకుంటున్నారు. కొందరు ప్రభుత్వ ఆర్థిక సంస్థల్లో రుణాలు పొంది లాభపడుతున్నారు. తిరిగి వాటిని చెల్లించడం లేదు.అధికంగా ఆదా యం పొందిన వారిలో కొందరు ప్రభుత్వం కన్ను గప్పి విదేశీ బ్యాంకుల్లో దాచుకోవడం ప్రారంభిం చారు. ఈ నేపథ్యంలో సంస్కరణల పేరుతో ప్రారంభమైన సరళీకరణ, ప్రపంచీకరణ, మార్కెటీకరణ, వల్ల దేశం సరిహద్దులు దాటి వ్యాపారం, వాణిజ్యం విస్తరించింది. దాంట్లో విదేశీ ధనం వంద శాతం తిరిగి స్వదేశానికి వస్తుంది. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, ఆదాయం పన్నులు ఎగవేసి విదేశాల్లో నివాసం ఏర్పరుచుకుం టున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కు ఆ ఎగవేతలను వెలికితీసే బాధ్యతను అప్పగించారు. నల్లధనాన్ని వెలికితీసే పని ఆ సంస్థ చేస్తోంది. అయితే, సీబీఐలో పని చేసే అధికారులు, ఉన్నతాధికారులకు రాజకీయ వాదులతో సంబం ధాల వల్ల, వారి ప్రత్యర్థుల నివాసాలపై దాడులు చేసి వారిని కేసుల్లో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ స్థితిలో రాజకీయ నాయకులూ, బ్యూరోక్రాట్ల మధ్య ఉన్న సంబంధాలను గుర్తిం చి ఐపీఎస్ అధికారులు పని చేయాలి. కానీ, వారికి రాజకీయ నాయకులతో సంబంధాల వల్ల ఆ నాయకుల ప్రత్యర్థులపై దాడులు చేయడం ప్రారంభిస్తున్నారు. సీబీఐలో డైరక్టర్‌కూ, స్పెషల్ డైరక్టర్ కూ మధ్య నమ్మకం, విశ్వాసం సన్నగిలింది. వారికి ఉన్న రాజకీయ సంబంధాల నేపథ్యంలో పరస్పర ఆరోపణలు చేసుకోవడంతో వారి అక్రమ సంపాదన సంగతి బయటపడింది.

ఈ ఆరోపణలను తన దృష్టికి వచ్చిన వెంటనే ప్రధాన మంత్రి అదుపు చేసి ఉంటే పరిస్థితి ఇంతవరకూ వచ్చి ఉండేది కాదు. కానీ, మోడీ అలా చేయలేదు. దాంతో ఆస్తానా అలుసుగా తీసుకుని అలోక్ వర్మపై ఆరోపణలు చేసి మొత్తం సీబీఐని భ్రష్టు పట్టించారు.దాంతో సీబీఐ పరువు, ప్రతిష్మ నాశనం అయింది. కేంద్రం అలసత్వమే ఇందుకు కారణం. సీబీఐ అంటే దేశంలో అత్యున్నతమైన నేర పరిశోధనా సంస్థ, ఇందులో మచ్చలేని అధికారులకు పోస్టింగ్ ఇస్తారు.మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గుజరాత్‌లో తనకు సహకరించిన ఐపీఎస్ అధికారులను తీసుకుని వచ్చి కేంద్రంలో కీలకమైన పదవుల్లో నియమించారు.అలా వచ్చిన అధికారులే ఇప్పుడు ఈ సంక్షోభానికి కారకులు.

సీబీఐ గురించి టూకీగా....స్వాతంత్ర్యం రాక ముందే 1941లో సిబిఐని ఏర్పాటు చేసారు.అప్పట్లో దాని పేరు స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్ మెంట్.అప్పట్లో దీని కేంద్ర కార్యాలయం ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న లాహోర్‌లో ఉండేది. దానికి మొదటి ఎస్పీగా బుర్కాన్ ఆలీఖాన్ పని చేశారు. దేశ విభజన తర్వాత ఆయన పాకిస్తాన్ కు వెళ్ళిపోయారు. ఈ కేసులన్నింటినీ విచారించేందుకు న్యాయసలహాదారు రావు సాహెబ్ కరమ్ చంద్ జైను నియమించారు. విభజన తర్వాత కూడా ఆయనే కొనసాగారు. ఆ తర్వాత 1946లో హోం మంత్రిత్వ తీర్మానంతో బదిలీ అయింది. దాని పేరు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌గా మారింది. 1987లో సిబిఐలో అవినీతి విభాగం, ప్రత్యేక నేరాల విభాగం,ఆర్థిక నేరాల విభాగం అనే మూడు విభాగాలు ఏర్పడ్డాయి. సీబీఐ మొదటి డైరక్టర్‌గా 1963 నుంచి 1968 వరకూ డిపి కోహ్లీ పని చేశారు. ఆ తర్వాత కోహ్లీ ఆధ్వర్యంలోజాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఏ) ఏర్పడింది. సీబీఐ డైరక్టర్ రాష్ట్రాల డీజీపీ హోదాతో సమానం. రెండేళ్ళ పదవీ కాలానికి నియమితం అవుతారు సిబిఐ ఇంత వరకూ 314 కేసులను నమోదు చేసింది. వీటిలో ఎన్నింటిని పరిష్కరించారు. ఎంతమందికి శిక్షలు పడ్డాయి అనే వివరాలు లేవు. కాల క్రమంలో అవినీతిని అరికట్టే సంస్థ అవినీతి ఊబిలో కూరుకుని పోయింది. 2-జి స్కాం, బొగ్గు కుంభకోణం దర్యాప్తు సందర్భంగా సీబీఐ పేరు దేశమంతా మోగిపోయింది. విదేశాలకు పారిపోయిన మాల్యా, నీరవ్ మోడీ, చోక్సీ వంటి వారి కేసుల దర్యాప్తు బాధ్యతను సిబిఐ ప్రస్తుతం చేపట్టింది. యూపీఏ హయాంలో కుంభకోణాలు అధికంగా వెలుగు చూశాయి. వీటి వల్లే ఆ కూటమిని ప్రజలు దూరంగా ఉంచారు. మోడీనేతృత్వంలోని ఎన్‌డిఏ కూటమి అందుకు భిన్నం కాదని తాజా కుంభకోణాలు రుజువు చేస్తున్నాయి. పైగా, సీబీఐ డైరక్టర్లే పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో మోడీ జమానాలో సీబీఐ ప్రతిష్మ పాతాళానికి దిగజారింది.

-కె.ఆనయ్య, 8008359912

వర్మపై వేటు



ఫైర్ సర్వీస్ విభాగానికి డీజీగా అలోక్‌వర్మ

◆ ఎం.నాగేశ్వర్ రావుకు సీబీఐ పగ్గాలు ◆ త్రిసభ్య కమిటీలో వర్మవైపు నిలిచిన ఖర్గే ◆ సీవీసీ ఆరోపణలపై వివరణ అడగాలని డిమాండ్ ◆ తొలగించాల్సిందేనన్న మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ ◆ రెండు గంటలకు పైగా హైపవర్ కమిటీ భేటీ ◆ 50 ఏళ్ల సీబీఐ చరిత్రలో తొలిసారి ◆ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న వర్మ ◆ తొలగింపుపై భగ్గుమన్న విపక్షాలు

న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను తొలగిస్తూ ప్రధాని మోడీ నేతృత్వం వహిస్తున్న త్రిసభ్య కమిటీ సంచలన నిర్ణయం తీసుకుంది. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్ వర్మను నియమిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై కమిటీ గురువారం లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ఆయన నివాసంలో రెండో సారి సమావేశం అయ్యింది. సుమారు రెండు గంటల పాటు ఈ మీటింగ్ కొనసాగింది. సెంట్రల్ విజిలెన్స్ కమిటీ రిపోర్టులో పొందుపర్చిన ఆరోపణలపైనే హైపవర్ కమిటీ మొగ్గు చూపింది. 1979 బ్యాచ్ ఏజీఎంయూటీ ఐపీఎస్ కేడర్ అధికారి వర్మపై వచ్చిన ఆరోపణలన్నీ వాస్తవమే అని, అందుకే అతన్ని సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది. జనవరి 31తో వర్మ పదవీ కాలం ముగియనున్న సమయంలో త్రిసభ్య కమిటీ తీసుకున్న నిర్ణయం సంచలనమైంది. 24 గంటల్లోనే హైపవర్ కమిటీ రెండు సార్లు సమావేశమైంది. 55 ఏళ్ల సీబీఐ చరిత్రలో డైరెక్టర్ విషయంలో ఈ తరహా నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి. అలోక్ వర్మపై వచ్చిన ఆరోపణలపై ప్రాథమిక సాక్షాధారాలు ఉన్నట్టు హైపవర్ కమిటీ తెలిపింది. అలోక్ వర్మ తొలగింపును ప్రధాని నరేంద్ర మోడీ, జస్టిస్ ఏకే సిక్రీ సమర్థించగా, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. మోయిన్ ఖురేషీ కేసు, ఐఆర్‌సీటీసీ స్కాంతో పాటు పలు కుంభకోణాల్లో విచారణ జరుపుతున్న 8 మంది అవినీతి అధికారులతో కాంప్రమైజ్ చేసినట్టు వర్మపై ఆరోపణలు ఉన్నాయి.

సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన తరువాత విధుల్లో చేరిన మరుసటి రోజే అలోక్ వర్మపై వేటు వేయడం గమనార్హం. మోడీ తప్పించేందుకు మొగ్గు చూపగా, వర్మ కేసులపై దర్యాప్తు చేయాలని జస్టిస్ ఏకే సిక్రీ, సీవీసీ ఆరోపణలపై వివరణ అడగాలని ఖర్గే కోరారు.

సీబీఐ డైరెక్టర్‌గా ఎం.నాగేశ్వర్‌రావు

సీబీఐ అడిషనల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం. నాగేశ్వర్ రావును సీబీఐ డైరెక్టర్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. నాగేశ్వర్ పనితీరుపై కేంద్రం సంతృప్తికరంగా ఉన్న నేపథ్యంలో అతనికే మళ్లీ పూర్తి స్థాయి బాధ్యతలు అందినట్టు తెలుస్తున్నది. అలోక్ వర్మను లాంగ్ లీవ్‌కు పంపిన తరువాత కేంద్రం ఎం.నాగేశ్వర్ రావుకు ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమించింది. 77 రోజుల పాటు ఆయన సీబీఐ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టి తనదైన శైలిలో కేసులు విచారణ చేపట్టారు. అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను బదలీ చేశారు.

సుప్రీం కోర్టు తీర్పులో భాగంగా అలోక్ వర్మపై ఒత్తిడి తీసుకొచ్చి పదవి నుంచి తప్పించి సెలవులపై పంపడాన్ని తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. సీబీఐ చీఫ్‌ను నియమించే, తొలగించే అధికారం త్రిసభ్య కమిటీకి ఉంటుంది. అలోక్ వర్మను కొనసాగించాలా..? వద్దా...? అనే నిర్ణయం కూడా హైపవర్ కమిటీకే ఉంటుంది. కమిటీ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, సుప్రీం సీజే రంజన్ గొగొయ్ తరపున జస్టిస్ ఏకే సిక్రి పాల్గొన్నారు. సీవీసీ నుంచి నివేదిక బుధవారం అందకపోవడంతో ఈ విషయమై స్పష్టత రాలేదని, అందుకే మరోమారు సమావేశమైనట్టు కమిటీ చెప్పుకొచ్చింది.

ఆస్తానా కేసు బాధ్యతలు మోహిత్ గుప్తాకు..

సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్తానాపై నమోదైన అభియోగాలను విచారించేందుకు ఎస్పీ ర్యాంకు ఐపీఎస్ అధికారి మోహిత్ గుప్తాను నియమించడం జరిగింది. 1979 బ్యాచ్ ఏజీఎంయూటీ కేడర్ ఐపీఎస్ అధికారి వి మురగేషన్‌ను యాంటీ కరప్షన్ యూనిట్ - 3కి జాయింట్ డైరెక్టర్‌గా నియమిస్తూ వర్మ నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎంకే సిన్హా తప్పుకున్న నేపథ్యంలో ఆస్తానా కేసు వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న తరుణ్ గౌబా, ముర్గేషన్, ఏడీ ఏకే శర్మ, ఎంకే సిన్హాను బదలీ చేశారు. వీరిని ఇన్‌చార్జ్ డైరెక్టర్ నాగేశ్వర్ రావు అపాయింట్ చేశారు. గుప్తా 2006 బ్యాచ్‌కు చెందిన ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఘాజియాబాద్ ఏజెన్సీకి నేతృత్వం వహిస్తున్నాడు. ఇతన్ని ఆస్తానా కేసులో విచారణ అధికారిగా నియమించారు. ఈయన ఈ కేసులో మూడో విచారణ అధికారి. వర్మపై వేటు వేసిన నేపథ్యంలో ఆయన చేసిన బదలీలు కొనసాగుతాయా..? లేదా..? అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

హెచ్ఆర్‌సీని ఆశ్రయిస్తాను

హైపవర్ కమిటీ వర్మను సీబీఐ డైరెక్టర్ నుంచి తొలగించి ఫైర్ సర్వీసెస్ అండ్ హోంగార్డు విభాగం డైరెక్టర్ జనరల్ బాధ్యతలను అప్పగించడంపై స్పందించారు. దీనిపై తాను మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని తెలిపారు. కమిటీ ముందుకు రావడానికి అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. తనను విచారించకుండానే సీవీసీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వేటు వేయడం సబబు కాదని తెలిపారు.

బదిలీలు రద్దు చేసిన వర్మ

సీబీఐ చీఫ్, డిప్యూటీ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్తానా మధ్య చెలరేగిన వివాదంలో ఇద్దరు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. 77 రోజులుగా డైరెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఎం. నాగేశ్వర్ రావు హయాంలో జరిగిన 12 మంది బదలీలను రద్దు చేస్తూ సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ డైరెక్టర్ హోదాలో ఉన్న నాగేశ్వర రావు, భారీ స్థాయిలో ఉన్నతాధికారులను బదలీ చేశారు. అలోక్ వర్మ కేసు వ్యవహారంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విచారణ పత్రాలతో పాటు ప్రభుత్వానికి సంబంధించి డాక్యుమెంట్లు సమావేశానికి ముందు అడిగినట్టు మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. కమిటీ ఎదుట హాజరై వివరణ ఇచ్చే అవకాశం అలోక్ వర్మకు ఇవ్వాలని కోరనున్నట్టు వివరించారు.



రాఫెల్ భయంతోనే వర్మ తొలగింపు : రాహుల్

రాఫెల్ కుంభకోణం ఎక్కడ బట్టబయలు అవుతుందో అని భయపడి సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తప్పించాని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. దీని కోసం వడి వడి అడుగులు ఎందుకు వేశారో తెలియజేయాలని రాహుల్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. అలోక్ వర్మను సెలక్షన్ కమిటీ ముందుకు ఎందుకు హాజరుకానివ్వడం లేదు..? ఆయన అభిప్రాయం తెలియజేయడానికి ఎందుకు నిరాకరిస్తోంది..? దీనికి కారణం ఒకటే సమధానం రాఫెల్ కుంభకోణం అని విమర్శించారు. రాఫెల్ కుంభకోణం విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. అవినీతి జరిగిందనేది దేశ ప్రజలందరికీ తెలుసు అని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రూ.30వేల కోట్ల ప్రజా ధనాన్ని మోడీ తన మిత్రుడు అనిల్ అంబానీకి ఇచ్చారని ఆరోపించారు. వర్మకు ఒక్క చాన్స్ కూడా ఇవ్వకుండా సీవీసీ రిపోర్టు ఆధారంగా తొలగించడం బాధాకరమన్నారు.

వర్మను తొలగించలేరు : సుబ్రమణ్య స్వామి

సెంట్రల్ విజిలెన్స్ కమిటీ రిపోర్టు ఆధారంగా సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తొలగించలేరని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి తెలిపారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేసి నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కొన్ని అనాలోచితమైన తప్పుడు సలహాల కారణంగా ఇది జరుగుతోందని అభిప్రాయపడ్డారు. వర్మను వెళ్లి కలిసినట్టు తెలిపారు. సీవీసీ ఇచ్చిన నివేదికలో అన్నీ అబద్దాలే అని అన్నారు. దీనిపై కూడా విచారణ జరిపించాల్సి అవసరం ఉందన్నారు. వర్మను తొలగిస్తే సమస్య జఠిలం అవుతుందే తప్ప పరిష్కారం కాదని తెలిపారు. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని మోడీని కోరుతున్నట్టు వివరించారు. కేసు విషయంలో వర్మను కలుకోలేదని, వ్యక్తిగతంగా భేటీ అయినట్టు తెలిపారు.


బదిలీల రిజర్వ్‌పై హైకోర్టులో పిటిషన్

పలువురు అధికారుల ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లను సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మ రిజర్వ్‌లో పెట్టడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ డీఎస్‌పీ దేవేందర్ కుమార్ గురువారం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ నజ్మి వాజ్రీ విచారిస్తారు. ఈ నెలాఖరులో అలోక్ వర్మ పదవి కాలంలో ముగియనుండటంతో వారంలోపు తమ నిర్ణయం వెల్లడించాలని ప్యానల్‌కు సుప్రీం కోర్టు సూచించింది. గతేడాది అక్టోబర్‌లో సీబీఐ వివాదం తారా స్థాయి చేరడంతో రాత్రికి రాత్రే కేంద్రం అలోక్ వర్మను సెలవులపై పంపి, రాకేష్‌పై అవినీతిపరమైన చార్జ్‌లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

సినీ పాలిటిక్స్



◆ సార్వత్రిక సంగ్రామంలోకి బయోపిక్ అస్త్రాలు ◆ నేడు తెరపైకి యూరి.. ద సర్జికల్ స్ట్రయిక్స్ ◆ టాక్ ఆఫ్ ద పాలిటిక్స్‌గా... ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్, ద తాష్కెంట్ ఫైల్స్, థాక్రే చిత్రాలు ◆ ఉత్కంఠ రేపుతున్న నరేంద్ర మోడీ చిత్రం




న్యూఢిల్లీ: రాజకీయ ప్రచార హోరు.. సినీస్టార్ల సందడితో ఎన్నికల సంవత్సరం మరింత ఉత్సాహంగా ప్రారంభం కాబోతున్నది. రాజకీయ నేపథ్యంతో కూడిన నాలుగు సిని మాలు సార్వత్రిక సంగ్రామానికి ఊపుతేనున్నాయి. వీటి తోపాటు మరో రెండు సినిమాలు కూడా బరిలోకి వచ్చే అవ కాశాలు కనిపిస్తున్నాయి. యూరి.. ద సర్జికల్ స్ట్రయిక్స్, ద యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్, ద తాష్కెంట్ ఫైల్స్, బాల్ థాక్రే అతి త్వరలో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించ బోతున్నాయి. ప్రధాన పార్టీల మధ్య జరిగే ఉత్కంఠ పోరు లో, ఈ సినిమాలు సరికొత్త ప్రచారసాధనాలుగా రంగంలో నిలవనున్నాయి. పై నాలుగు చిత్రాలకు తోడు మరో రెండు బయోపిక్‌ల విడుదలకు ఆయా నిర్మాణ సంస్థలు ప్రయ త్నాలు చేస్తున్నాయి. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవిత కథ ఆధారంగా తీసినది. ఇందులో బీజేపీ ఎంపీ పరేశ్‌రావల్, వివేక్ ఒబెరాయ్‌లు నటిస్తున్నారు. ఈ ఆరు సిని మాలు కూడా అగ్ర కథానాయకులు నటించి భారీ బడ్జెట్ చిత్రాలు కావడం, ఇతివృత్తాలు, నేపథ్యం జాతీయస్థాయికి సంబంధించిన కావడంతో సహజంగానే దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఏప్రిల్ చివర్లో లేదా మే నెలలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున సమాజాం లోని అన్ని వర్గాలను ఇవి ఏమేరకు ప్రభావితం చేస్తాయన్నది ఆసక్తిగా మారింది. సంపన్న, మధ్యతరగతి, విద్యా వంతులు, మేధావులు వీటిని ఏవిధంగా చూస్తారు? ఎన్ని కల్లో ఏ పార్టీకి లాభం? ఎవరికి నష్టం? అనే అంచనాలపై రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి. సృజనాత్మక ఆలోచనలు, సైద్ధాంతిక విధానాలు ఆధారంగా ప్రముఖ స్టార్లతో సంచనాలు సృష్టించేందుకు వస్తున్న చిత్రాలుగా సినీరంగం పేర్కొంటున్నది.




యూరి

రోన్నీ స్క్రూవాలా నిర్మించిన ఈ చిత్రం ఈ శుక్రవారం థియేటర్లకు చేరనుంది. విక్కీ కౌశల్ హీరోగా నటించారు. 2016 సెప్టెంబర్‌లో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా భారత బలగాలు జరిగిన సాహసోపేత మెరుపు దాడులు ఇతివృత్తమే యూరి. నాటి దాడుల్లో మన సైనికులు పాక్ భూభాగంలోని నాలుగు ఆర్మీ లాంచ్‌ప్యాడ్లను ధ్వంసం చేశారు.

యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్



ఈ చిత్రం.. మాజీ ప్రధాని మన్మోహన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కించారు. మన్మోహన్‌కు మీడియా సలహాదారుగా పనిచేసిన సంజయ్ బారు రచించిన పుస్తకం ఆధారంగా ఈ సినిమా నిర్మించబడింది. గాంధీ కుంటుబం నీడలో మన్మోహన్‌కు ఎదురైన అనుభవాలను ఇందులో ప్రధానంగా చూపించబోతున్నట్లు సమాచారం. దీనిపై బీజేపీ విమర్శలు ఎక్కుబెట్టింది. ఇదంతా ప్రేరేపిత కట్టుకథగా పేర్కొంది. 2019 ఎన్నికల సందర్భంలో తమకు వ్యతిరేకంగా దుష్ప్రచారం కోసమే ఈ సినిమా విడుదల చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.



ద తాష్కెంట్ ఫైల్స్

రాజకీయ చదరంగంలో సత్తా చాటేందుకు సిద్ధమైన మరో సంచలన వివాదాస్పద చిత్రం ద తాష్కెంట్ ఫైల్స్. దేశ రెండవ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి మరణంపై నెలకొన్న సందేహాలు, దానిచుట్టూ అల్లుకున్న ఆనాటి పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా రూపొందించారు. బీజేపీ మద్దతుదారు వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వం వహించిన తాష్కెంట్ ఫైల్స్ ఇంకా నిర్మాణదశలోనే ఉంది. ఫిబ్రవరి ఆఖరివారం లేదా మార్చి మొదటి వారంలో వెండితెరపైకి రానుంది.

థాక్రే

శివసేన పార్టీ వ్యవస్థాపకుడు బాల్ థాక్రే జీవితకథ ఇది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్‌రౌత్ ఈ చిత్రానికి రచయిత, నిర్మాతగా వ్యవహ రిసున్నారు. మరాఠా పులి థాక్రే పాత్రను ప్రముఖ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖి పోషించాడు. ఈనెల 25న థాక్రే జయంతి రోజున విడుదల కాబోతున్నది.



◆ ఈ చిత్రాలను విడుదలను కొందరు ఆక్షేపిస్తున్నారు.. వివాదాస్పదమైన, రాజకీయాలతో ముడిపడివున్న చిత్రాలను కేంద్ర సెన్సార్ బోర్డు నిలిపివేయాలని కోర్టులకెక్కుతున్నారు. పరోక్షంగా ఎన్నికలను ప్రభావితం చేసే చర్యలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరొకవర్గం మాత్రం వీళ్ల అభ్యంతరాలను కొట్టిపారేస్తున్నాయి. సినిమాను సినిమాగానే చూడాలని సూక్తులు వల్లెవేస్తున్నాయి.

◆ థాక్రే సినిమాలో వివాద అంశాలు.. కొత్త అంశాలు లేవు. బాలాసాహెబ్ జీవితం తెరిచిన పుస్తకం. దీనిపై ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తంచేస్తే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి వుండదు. సెన్సార్ బోర్డు వాస్తవిక పరిస్థితిని అర్థంచేసుకోవాలి. కొన్ని అంశాలు అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. థాక్రే సినిమాను నిషేధించడం అన్న ప్రశ్నే లేదు. ఈ సాహసానికి ఎవరూ ఒడిగట్టలేరు **- సంజయ్‌రౌత్**

◆ ఎనిమిదో తరగతి వరకూ హిందీ తప్పనిసరి చేయాలని కమి టీ సూచించినట్లు వస్తున్న వార్తలను కండిస్తున్నట్లు తెలిపిన ఆయన హిందీ బోధనను తప్పనిసరి చేయాలని ఈ కమిటీ సిఫారసు చేయలేదన్నారు. ఈ మేరకు ప్రకాష్ జవదేకర్ ఓ ట్వీట్ చేశారు.


జనసేన సంక్రాంతి సంబరాలు

◆ 13న పెదరావూరు భోగి వేడుకల్లో పవన్‌కల్యాణ్ ◆ సంక్రాంతి శోభకు హాజరు ◆ సాంస్కృతిక విభాగానికి శ్రీకారం

అమరావతి, ఆంధ్రప్రభ: తెలుగు ప్రజల సంస్కృతి సంప్ర దాయాల్లో అగ్రస్థానం ఉన్న సంక్రాంతి సంబరాల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్‌కల్యాణ్ పాలుపంచుకోనున్నారు. ఈనెల 13న భోగి పండుగతో ఈ సంబరాలు ఆరంభమవుతాయి. తెనాలి సమీపంలోని పెదరావూరు వ్యవసాయ క్షేత్రంలో ఈ సంబరాలు జరగనున్నాయి. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఈ సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతాయి. తొలుత భోగి మంటల వేడుకల్లో పవన్‌కల్యాణ్ పాల్గొంటారు. ధాన్యం ఇంటికి చేరే సమయంలో ఈ పండుగ మనమంతా జరుపుకుంటామన్న సంగతి తెలిసిందే. అలాంటి ధాన్యాన్ని మనకు ఇచ్చే రైతులతో ఇష్టాగోష్టిగా పవన్ కల్యాణ్ గడుపుతారు. ఈ కార్యక్రమానికి డెల్టాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు వస్తున్నారు. అనంతరం స్థానిక ప్రజలతో పవన్ కల్యాణ్ సమావేశం అవుతారు. తర్వాత ఆడపడుచులు నిర్వహించే సంక్రాంతి శోభలో పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సాంస్కృతిక విభాగం ప్రారంభంతో పాటు జనసేన కళాకారులు రూపొందించిన ఆడియో,వీడియోలను జనసేనాని ఆవిష్కరిస్తారు. రాత్రి 8 గంటలకు ఈ సంబరాలు ముగుస్తాయి. సంక్రాంతి సంబరాల ఏర్పాట్లను పార్టీ ముఖ్య నేతలు పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ స్పీకర్, జనసేన ముఖ్య నేత నాదెండ్ల మనోహర్, ముఖ్యనాయకులు, మాజీ మంత్రులు బాలరాజు, రావెల కిషోర్‌బాబు, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు తోట చంద్రశేఖర్, ముత్తంశెట్టి కృష్ణారావు, రాష్ట్ర కన్వీనర్ చింతల పార్థసారధి, రాష్ట్ర కో కన్వీనర్ ప్రభు తదితరులతో పాటు కృష్ణా జిల్లాకు చెందిన పార్టీ సమన్వయకర్తలు, సహ సమన్వయకర్తలు, ముఖ్య నేతలు పాల్గొంటారని పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు.

10 శాతం రిజర్వేషన్ల బిల్లుపై


సుప్రీంలో పిటిషన్



న్యూఢిల్లీ: అగ్రకులాల్లో ఆర్థికంగా వెను కబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణకై లోక్‌సభ, రాజ్యసభల్లో ఆమోదం పొందిన రిజర్వేషన్ల బిల్లుపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన పరిమితిని మించడంతోపాటు ఇదివరకు ఎప్పుడూ లేని విధంగా కేవలం రెండు రోజుల చర్చ ద్వారా బిల్లుకు రెండు సభలు ఆమోదం తెలపడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని యూత్ ఫర్ ఈక్విటీ అనే స్వచ్ఛంద సంస్థ తన పిటి షన్‌లో పేర్కొంది. ఆర్థిక పరిస్థితిని బట్టి రిజ ర్వేషన్లు కల్పించడం కుదరదని, 1992లో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకించింది. ఆర్థిక పరిస్థితి ఆధారంగా జనరల్ కేటగిరి వారికి రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగంలోని సమానత్వపు ప్రాథమిక హక్కుకు విఘా తమని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది.

జుట్టుకి తెల్ల రంగేసుకొని అయ్యప్ప గుడిలోకి !

తిరువనంతపురం: వృద్ధ మహిళగా కన్పించేందుకు జుట్టుకు రంగు వేసుకొని మంగళవారం శబరిమళ ఆలయంలోకి ప్రవేశించినట్లు కొల్లంకి చెందిన మంజు(36) అనే దళిత మహిళ తెలిపింది. మహిళ ఫెడరేషన్ కార్యకర్త అయిన ఆమె ఈ మేరకు తన ఫేస్ బుక్ ఖాతాలో తెలిపింది. జుట్టకు రంగేసుకొని ఆలయంలోని 18 మెట్ల ద్వారా దర్శనానికి వెళ్లానని, ఇకపై కూడా ఆలయంలోకి వెళ్తానని ఆమె తెలిపింది. ఆలయంలోకి ప్రవేశించినట్లు ఆధారాలుగా కొన్ని ఫొటోలను, వీడియో ఫుటేజిలను కూడా ఆమె బయటపెట్టింది. ఆ ఫొటోలలో నల్లదుస్తుల్లో తలపై ఇరుముడితో ఆమె ఆలయ పరిసరాల్లో ఉన్నట్లు కన్పిస్తోంది. దమ్ముంటే ఆలయ సంప్రోక్షణ చెయ్యాలంటూ ఆమె తన ఫేస్ బుక్ ద్వారా ఆలయ పూజారికి సవాల్ విసిరింది. గతేడాది అక్టోబర్‌లో శబరిమల ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన 20 మంది మహిళల్లో మంజు కూడా ఒకరు. దీంతో ఆందోళనకారులు మంజు ఇంటిపై దాడి చేశారు. అయితే తనకు తానుగా ఆలయంలోకి ప్రవేశం చానని ముంజు చెప్పడంతో అధికారులు సీసీ పుటేజీపరిశీలిస్తున్నారు.



లోక్‌సభ ఎన్నికలకు కమలదళం రెడీ

◆ నేటి నుంచి బీజేపీ జాతీయ మండలి సమావేశాలు ◆ మోడీ నాయకత్వంలో ఎన్నికల్లో పోరాటంపై తీర్మానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : లోక్‌సభ ఎన్నికలకు ముందుకు బీజేపీ జాతీయ మండలి సమావేశాలు నేటి నుంచి ప్రారంభ మవుతున్నాయి. గురువారం ఆలా నుంచి రెండు రోజుల పాటు రాంలీలా మైదానంలో ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్య మంత్రులు, పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకులు ఈ సమావేశాల్లో పాల్గొం టున్నారు. ఈ సమావేశాల్లో 12వేల మంది బీజేపీ నాయకులు పాల్గొంటున్నారు. రెండు రోజుల పాటు ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశాల్లో పాల్గొంటుం డడంతో తాత్కాలికంగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేస్తున్నారు. పిఎం వోలో ఉండే అన్ని రకాల వసతులను ఇక్కడ సిద్ధం చేస్తున్నట్లు పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు.

అలాగే అమిత్‌షా కోసం, సీఎంల కోసం కూడా ప్రత్యేక తాత్కాలిక కార్యా లయాలను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ మండలి సమా వేశాలను పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రారంభించనున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ముగింపు ప్రసంగం చేయనున్నారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపైనే ప్రధానంగా చర్చించనున్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను పల్లె పల్లెలో ప్రచారం చేయడం, లబ్దిదారులను నేరుగా కలుసుకుని వారి మద్దతు కోరేందుకు ప్రచార వ్యూహాలను ఖరారు చేయనున్నారు. అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్ల బిల్లు, ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పరిరక్షణ, జీఎస్టీ పన్నుల తగ్గింపు తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం చేయనున్నారు. దేశ భద్రతకు, ఆర్థిక వ్యవస్థ భద్రతకు విఘాతం కలగకుండా ఉండాలంటే మళ్లీ బీజేపీ అధికారంలోకి రావాలన్నదే నినాదంతో ముందుకు వెళ్లేలా జాతీయ మండలి తీర్మానించనుంది. వీటితో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ వచ్చే లోక్‌సభ ఎన్నికలో పోరాటం చేయాలని బీజేపీ జాతీయ మండలి నిర్ణయం తీసుకోనుంది. ఎన్నికల కోసం పార్టీ అనుబంధ విభాగాలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. ఇప్పటికే యువమోర్చా, కిసాన్‌మోర్చా, మైనార్టీ మోర్చా, మహిళా మోర్చా, గిరిజన మోర్చా తదితర విభాగాలు భారీ ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. మోర్చాలు నిర్వహించే బహిరంగసభలలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ హాజరుకానున్నారు. కీలకమైన ఈసమావేశాల్లో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ బీజేపీ నేతలు దత్తాత్రేయ, లక్ష్మణ్, కిషన్‌రెడ్డి పలువురు నేతలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.



చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట!



- జీఎస్టీ మినహాయింపు పరిమితి రెట్టింపు
- రూ. 20 లక్షల నుంచి రూ. 40 లక్షలకు పెంపు
- ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి
- ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ

న్యూఢిల్లీ : దేశంలోని చిరు వ్యాపారులకు ప్రభుత్వం ఊరట కల్పించింది. జీఎస్టి కౌన్సిల్ గురువారం నాడు చిన్న వ్యాపారులకు జీఎస్టి పరిమితిని రెట్టింపు చేసింది. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు చెందిన చిరు వ్యాపారులకు ఏడాదికి రూ.20 లక్షల వరకు టర్నోవర్‌పై జీఎస్టి పన్ను మినహాయింపు ఇచ్చింది. అదే దేశవ్యాప్తంగా ఉండే చిరువ్యాపారులకు రూ.40 లక్షల వరకు ఈ మినహాయింపు వర్తిస్తుందని ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం నాడు ఇక్కడ మీడియాతో చెప్పారు. జీఎస్టి కాంపన్‌సేషన్ స్కీం కింద చిన్న వ్యాపారులు.. వారి టర్నోవర్‌ను రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచింది. వారికి జీఎస్టిలో ఒక శాతం పన్ను మినహాయింపు ఇస్తుంది. సవరించిన కొత్త జీఎస్టి వ్యవస్థ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుంది.

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జీఎస్టి పన్ను మినహాయింపును రూ.40 లక్షల పెంచినందుకు ప్రభుత్వానికి ఏడాదికి రూ. 5,200 కోట్ల రెవెన్యూ నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు. అలాగే సర్వీస్ ప్రొవైడర్స్ టర్నోవర్ రూ.50 లక్షలు దాటితే వారు కూడా జీఎస్టి కాంపన్‌సేషన్ స్కీం కింది 6 శాతం పన్ను చెల్లిస్తే చాలని జైట్లీ అన్నారు. కాంపన్‌సెషన్ కింద ఇచ్చే రాయితీల వల్ల ప్రభుత్వ రెవెన్యూపై రూ.3,000 కోట్ల ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. గురువారం జరిగిన జీఎస్టి కౌన్సిల్ 32వ సమావేశం లో తీసు కున్న నిర్ణయాల వల్ల సూక్ష్మ, చిన్న మధ్య తరహా రంగాలకు భారీ ఊరట లభిస్తుందని ఆర్థికమంత్రి జైట్లీ ట్వీట్ చేశారు.



ప్రభుత్వం తాజాగా తీసుకొన్న నిర్ణయం వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపా రులకు ఊరట లభిస్తుంది. కేరళ విషయానికి వస్తే ఇటీవల కాలంలో వరదల కారణంగా అతలాకు తల మైంది. దీంతో ఒక శాతం విపత్తు సెస్ విధించుకోవడానికి అనుమ తించింది. కేరళ నుంచి అంతం ఠ్రాల్లో జరిగే వ్యాపారా లకు వచ్చే రెండు సంవత్సరాల పాటు ఈ సెస్ విధించుకొనే వెసులుబాటు లభిస్తుంది. రియల్ ఎస్టేట్, లాటరీ విషయానికి వస్తే కౌన్సిల్ ఏడు గురు సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుం టుంది. కౌన్సిల్ సమావేశంలో దీనిపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది.

రియల్ ఎస్టేట్ రంగంపై జీఎస్టి ఎంత విధించాలనే అంశంపై సమావేశంలో వివిధ రకాల అభిప్రాయాలు రావడంతో ఏడుగురు సభ్యుల గల మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు జైట్లీ చెప్పారు. లాటరీపై కూడా సభ్యులు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయని తెలిపారు. కాంపన్‌సెషన్ స్కీం కింద ఫైల్ చేయాలను కునే వ్యాపారులు ఏడాదికి ఒకసారి రిటర్న్ ఫైల్ చేస్తే చాలని అయితే పన్నులు మాత్రం ప్రతి త్రైమాసి కం చెల్లించాలని అన్నారు. అలాంటి వారికి అకౌంటింగ్ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ ఉచితంగా ఇస్తామన్నారు. ఏడాదికి రూ.1.5 కోట్ల టర్నోవర్ గల వ్యాపారులు ఈ సదుపాయా న్ని వినియోగించుకోవ చ్చునని తెలిపారు. ప్రభుత్వా నికి జీఎస్టి ద్వారా వచ్చే రెవెన్యూ సంఘటితరం గంతో పాటు పెద్ద కంపెనీల నుంచి ఎక్కువ మొత్తంలో వస్తుందన్నారు. ప్రభుత్వం చిన్న మధ్య తరహా రంగాలకు చెందిన కంపెనీలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయాలు తీసుకుందన్నారు. ప్రతి వ్యాపారి ముందు పలు ఆప్షన్‌లున్నాయి. సేవలరంగానికి చెందిన వారైతే ఏడాదికి ఆరు శాతం (కంపౌండింగ్) చక్రవడ్డీ కడితే సరిపోతుందని,, అదే తయారీరంగానికి చెందిన వారైతే ఏడాదికి రూ.1.5 కోట్ల టర్నోవర్‌పై ఒక శాతం కౌంపండింగ్ వడ్డీ గిట్టుబాటు అవుతుందన్నారు. అలాగే వ్యాపారాలపై రూ.40 లక్షల టర్నోవర్‌పై పన్ను మినహాయింపు ఎలానూ ఉందని జైట్లీ వివరించారు. వ్యాపారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని లబ్ధి పొంద వచ్చునన్నారు.

రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే మాట్లాడుతూ ప్రస్తుతం జీఎస్టీ పన్ను మినహాయింపు రూ.20 లక్షల వరకు ఉన్నా 10.93 లక్షల మంది పన్ను చెల్లిస్తున్నారని, వారిలో చాలా మంది రూ.20 లక్షల కంటే తక్కువ టర్నోవర్ వారే పన్ను చెల్లిస్తున్నారన్నారు. ప్రస్తుతం వస్తు సేవల పన్ను కింది సుమారు 1.17 కోట్ల మంది వ్యాపారులు రిజిష్టర్ చేసుకున్నారన్నారు. వారిలో 18 లక్షల మంది కాంపన్‌సెషన్ స్కీంకు బదిలీ అయ్యారని ,తరచూ పన్ను చెల్లించాల్సిన వారు నెల వారి ప్రాతిపదికన చెల్లించా ల్సి ఉంటుందని, అలాగే సప్లయిర్స్ ప్రతి త్రైమాసానికి ఒకసారి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు పూర్తిస్థాయి రికార్డు నిర్వహిం చాల్సిన అవసరం లేదని పాండే తెలిపారు.

మారుతి సుజుకి
కార్ల ధరకు రెక్కలు
రూ.10వేల వరకు పెంపు




న్యూఢిల్లీ: మారుతి సుజుకి ఇండియా గురువారం నుంచి ఎంపిక చేసిన మోడల్స్‌పై రూ. 10వేల వరకు ధరలను పెంచింది. సవరించిన ధరలు తక్షణమే అమ ల్లోకి వచ్చాయి. పెరిగిపోతున్న కమాడిటి ధరలు, డాలర్ మారకం తో రూపాయి బలహీనపడ్డంతో ధరలు పెంచాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. కంపెనీకి చెందిన వివిధ రకాల మోడల్స్‌పై రూ.10వేల వరకు పెంపు ఉంటుందని మారుతి సుజుకి ఒక ప్రకటనలో పేర్కొంది. ఇటీవల మార్కెట్లో విడుదల చేసిన ఎర్టిగా ధరను మాత్రం పెంచలేదు. మారుతి మోడల్స్ విషయానికి వస్తే ఎంట్రీ లెవెల్ ఆల్టో 800 నుంచి ప్రీమియం క్రాస్‌వోర్ ఎస్-క్రాస్ వరకు వాహనాలను విక్రయిస్తోంది. వాటి ధరలు రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షల వరకు ఉన్నాయి. ఇదిలా ఉండగా కంపెనీ డిసెంబర్‌లోనే ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. అయితే ఎంత మేరకు ధరలు పెంచేది మాత్రం పేర్కొనలేదు. కాగా గురువారం నాడు దీనిపై స్పష్టత ఇచ్చింది. మారుతి సుజుకితో పాటు టయోటా కిర్లోస్కర్, యుటిలిటి వాహనాల తయారీ కంపెనీ ఇసుజి మోటార్స్ కూడా జనవరి నుంచి ధరలను పెంచుతున్నట్లు గతంలోనే ప్రకటించాయి.

బంధన్ బ్యాంకు
లాభం రూ. 331 కోట్లు

న్యూఢిల్లీ : ప్రైవేట్ బ్యాంకు బంధన్ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 10.3 శాతం వృద్ధితో రూ.331.25 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.300.04 కోట్లు ఆర్జించినట్లు బ్యాంకు ఒక ప్రకటనలో వెల్లడించింది. మొత్తం ఆదాయం విషయానికి వస్తే రూ.1,883.65 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,336.42 కోట్లని వెల్లడించింది. బ్యాంకు నిరర్థక ఆస్తులు కూడా పెరిగి 2.41 శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 1.67 శాతమని తెలిపింది. నికర ఎన్‌పీఏ 0.80 శాతానికి చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 0.70 శాతమని వెల్లడించింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఐ) 53.5 శాతం పెరిగి రూ.1,124 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.732 కోట్లని పేర్కొంది.

హోండా నుంచి
న్యూ సిటీ వేరియెంట్

ధర రూ. 12.75 లక్షలు



న్యూఢిల్లీ: హోండాకార్స్ ఇండియా బుధవారం నాడు కొత్త వెరియెంట్ మిడ్‌సైజ్ సెడాన్ సిటిని మార్కెట్లో విడుదల చేసిది. దీని ధర రూ.12.75 లక్షలు (ఎక్స్‌షోరూం ఢిల్లీ)గానిర్ణయించింది. కొత్త కారు విషయానికి వస్తే జెడ్ఎక్స్ ఎంటీ 1.5 లీటర్ పెట్రోల్ పవర్‌ట్రెయిన్ ఇంజిన్‌ను బిగించారు. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు... అదనపు ఫీచర్ల విషయానికి వస్తే పార్కింగ్ సెన్సార్లు అందిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో హోండా సెడాన్ ఆటోమెటిక్ వెర్షన్ మాత్రం విక్రయిస్తోంది. కస్టమర్ల నుంచి మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, పెట్రోల్ వెరియెంట్‌కు డిమాండ్ రావడంతో మోడల్‌ను మార్చాల్సి వస్తోందని వివరణ ఇచ్చింది. దీంతో పాటు ఆకర్షణీయమైన కొత్త కలర్స్‌తో పాటు స్టాండర్డ్ అప్లికేషన్స్ ఉదాహరణకు రెయిర్ పార్కింగ్ సెన్సార్లు అందిస్తున్నట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ రాజేశ్ గోయెల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మోడల్‌కు ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆటోమెటిక్ హెడ్‌లైట్స్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్ తదితర ఫీచర్లను అందిస్తున్నామని ప్రకటనలో వివరించింది. హోండా సిటిని భారత్ మార్కెట్లో మొట్టమొదటిసారి జనవరి 1998 విడుదల చేయగా. ఇప్పటి వరకు 7.5 లక్షల యూనిట్లను విక్రయించింది.

లక్ష మంది చిరు వ్యాపారులకు
ఆర్థిక సాయం 'ఆయ్ ఫైనాన్స్'
- సంస్థ ఎండి సంజయ్ శర్మ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : క్యాపిటల్ జి ద్వారా బలపరచిన ఫిన్ టెక్ లెండర్ అయిన ఆయ్‌ఫైనాన్స్ లక్షమైక్రో బిజినెస్లకు వర్కింగ్ క్యాపిటల్ రుణాలను అందించి వారి వ్యాపారాన్ని అభివృద్ధిలోకి తీసుకువచ్చామని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ శర్మ చెప్పారు. తమ సంస్థ లక్షమంది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం అందించే దిశగా పనిచేస్తూ త్వరలో ఆ లక్ష్యాన్ని చేరుకోనున్నామని చెప్పారు. నూతనమైన క్లస్టర్ ఆధారిత అండర్‌రైటింగ్‌ను ఉపయోగించి ఇటువంటి పరివర్తన రుణాలు, సూక్ష్మరంగ సంస్థలలో వృద్ధి కల్పిస్తున్నామని ఆయన అన్నారు. దేశంలో 57 మిలియన్లసూక్ష్మ, చిన్నతరహా వ్యాపార సంస్థలు ఉండగా, అవి 16 ట్రిలియన్ డాలర్ల నిధుల కొరతవల్ల అభివృద్ధిని సాధించ లేకపోతున్నాయని చెప్పారు.

ఇలాంటి సంస్థలకు ఆర్థిక సాయం అందించి వాటి వర్కింగ్ క్యాపిటల్ సమస్యను తీర్చగలుగుతున్నామని సంజయ్ శర్మ చెప్పారు.ఆర్థికంగా మినహాయించిన చిన్న, సూక్ష్మ వ్యాపార సంస్థలను వ్యవస్థీకృత ఫైనాన్స్‌లోకి తీసుకురావాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు. ఇప్పటికే లక్ష చిన్న వ్యాపారులను అధికారిక ఆర్థిక వ్యవస్థ జాబితాలోకి తీసుకువస్తున్నామని శర్మ చెప్పారు. చిరు వ్యాపారులు తమ ఉద్యోగుల వేతనాల్లో ఉపాధి, అభివృద్ధిలో స్థిరమైన వనరులు పొందుతారని, ఇది సమాజం ఆర్థికంగా మెరుగుపడేందుకు కొంత మేరకు దోహద పడుతుందని అన్నారు.

జోరుకు విరామం

- 106 పాయింట్లు పతనం
- గ్లోబల్ మార్కెట్ల ప్రభావం

ముంబై : వరుసగా గత నాలుగు రోజుల నుంచి లాభాలతో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు గురువారం నాడు బ్రేక్‌పడింది. పెద్ద కంపెనీల ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు మార్కెట్లకు దూరంగా ఉన్నారు. దీంతో పాటు బ్యాంకింగ్ షేర్లు పెద్దెత్తున విక్రయించారు. గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు రాకపోవడంతో పాటు డాలర్ మారకంతో రూపాయి బలహీనపడ్డం తదితర అంశాలు కలిసి మార్కెట్లను కిందికి లాగాయి. ట్రేడింగ్ ముగిసే నాటికి బీఎస్ఈ 106.41 పాయింట్లు క్షీణించి 36,106.50 వద్ద, నిఫ్టీ 33.55 పాయింట్లు నష్టపోయి 10,821.60 వద్ద ముగిశాయి. బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్ల అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ప్రధానంగా ఇండస్‌ఇండ్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ షేర్లు 2.36 శాతం వరకు నష్టపోయాయి. వీటితో పాటు ఓఎన్‌జీసీ, మారుతి సుజుకి, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, హీరోమోటో, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.31 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. టీసీఎస్ షేర్లు ఫ్లాట్‌గా ముగిశాయి. ఫలితాలు సాయంత్రం విడుదల కానున్నాయి. వీటికి వ్యతిరేకంగా టాటామోటార్స్, ఎన్‌టీపీసీ, ఇన్ఫోసిస్, ఎస్‌బ్యాంకు, ఎంఅండ్ఎం, ఎల్అండ్‌టి, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్ షేర్లు అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి 1.34 శాతం వరకు లాభపడ్డాయి. ఇదిలా ఉండగా బుధవారం నాడు విదేశీ సం స్థా గ త మదుపరులు రూ.276.14 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.439.67 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. డాలర్ మారకంతో రూపాయి 10 పైసలు క్షీణించి 70.56 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ అయ్యాయి. అమెరికా - చైనాల వాణిజ్య చర్చలపై ఆశలు ఆవిరయ్యాయి. దీంతో పాటు ముడిచమురు ధర పీపా 60 డాలర్ల మార్కుకు చేరింది. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే ఆసియాతో పాటు ఐరోపా మార్కెట్లకు రెండు నష్టాలతో ముగిశాయి.



దుమ్మురేపిన టీసీఎస్!

- క్యూ3 లాభం రూ. 8,105 కోట్లు
- రెవెన్యూ రూ. 37,338 కోట్లు
- మధ్యంతర డివిడెండ్ షేరు పై రూ. 4



ముంబై : ఐటి దిగ్గజం టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రికార్డుస్థాయిలో లాభాలు ఆర్జించింది. ఏడాది ప్రాతి పదికన చూస్తే క్యూ3 నికరలాభంలో ఏకంగా 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరలాభం రూ.6,531 కోట్లు సాధించింది. త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే నికరలాభంలో 2.58 శాతం వృద్ధి కనిపించింది. రెవె న్యూ విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన 20.8 శాతం వృద్ధితో రూ.37,338 కోట్లకు ఎగబాకింది. 2018 సంవత్సరాన్ని బలమైన రెవెన్యూ సాధిం చి సాగనంపామని, డిసెంబర్ త్రైమాసికంలో రెవెన్యూ 12.1 శాతం సాధించామని.. గత 14 త్రైమా సికాల్లో ఇదే అత్యధికమని టీసీఎస్ మేనేజింగ్ డైరె క్టర్, సీఈవో రాజేశ్ గోపీనాథన్ చెప్పారు. ప్రపంచంలోని అన్నీ కీలక మార్కెట్లో మంచి పురోగతిని సాధించామని, క్లయింట్ల సంఖ్య పెరిగిందని, ఐటి పరిశ్రమ డిజిటల్‌కు మారుతుందని అన్నారు. కంపెనీ చేతిలో బలమైన ఆర్డర్ పుస్తకం ఉందని, అన్నీ రకాల కస్టమర్ల నుంచి ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయని సీఈవో వివరించారు. ఇదిలా ఉండగా కంపెనీ బోర్డు మధ్యంతర డివిడెండ్ షేరుపై రూ.4గా ప్రకటించింది.

రెవెన్యూ విషయానికి వస్తే త్రైమాసికం ప్రాతిపదికన చూస్తే 1.8 శాతం, ఏడాది ప్రాతిపదికన 12.1 శాతం సాధించామని, నిర్వహణ మార్జిన్ 0.4 శాతం పెరిగి ఏడాది ప్రాతిపదికన 25.6 శాతానికి చేరిందని, ఎర్నింగ్ ఫర్ షేర్ (ఈపీఎస్) విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన క్యూ3లో 26.6 శాతం పెరిగి రూ.21.60కి ఎగబాకిందని కంపెనీ ప్రకటనలో పేర్కొంది. రెవెన్యూ విషయానికి వస్తే డిజిటల్ వాటా 30.1 శాతం కాగా.. ఏడాది ప్రాతిపదికన 52.7 శాతానికి చేరింది. కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి రామకృష్ణన్ మాట్లాడుతూ డిసెంబర్ త్రైమాసికంలో పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నా.. ఉదాహరణకు రూపాయి బలహీనపడ్డా.. కొన్ని పెద్ద మార్కెట్లలో వ్యా పారాలు ఖరీదైన వ్యవహారం గా మారినా టీసీఎస్ వాటిని తట్టుకొని నిలబడి మంచి లాభాలను ఆర్జించగలిగిం దన్నారు.

భవిష్యత్ కోసం పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి రాబోయే త్రైమాసికంలో మరిన్ని లాభాలను ఆర్జిస్తా మని ఆయన ధీమా వ్యక్తం చేశారు.డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికరంగా 6,827 మందిని ఉద్యోగంలోకి తీసుకుంది. దీంతో కంపెనీలో ఉద్యోగుల సంఖ్య 4,17,929కి చేరింది. కంపెనీ నుంచి వలస రేటు గత 12 నెలల కాలంలో 11.2 శాతంగా తేలింది. బీఎస్ఈ లోగురువారం టీసీఎస్ షేరు 0.21 శాతం క్షీణించి రూ.1,883 వద్ద ముగిసింది.

విరాట్‌కోహ్లీ బ్రాండ్ విలువ
170.9 మిలియన్ డాలర్లు

- తర్వాతి స్థానం దీపిక పదుకొనే 102 మిలియన్ డాలర్లు



ముంబై: భారత్ క్రికెట్ స్కిప్పర్ విరాట్ కోహ్లీ దేశంలోనే అత్యంత విలువైన సెలెబ్రిటి బ్రాండ్ జాబితాలో అగ్రస్థానం దక్కించుకున్నారు. వరుసగా రెండో సంవత్సరం ఆయన నెంబర్ వన్ స్థానంలో నిలిచారు. 2017తో పోల్చుకుంటే ఆయన బ్రాండ్ విలువ 18 శాతం పెరిగి 2018 నాటికి 170.9 మిలియన్ డాలర్లకు ఎగబాకింది. గ్లోబల్ వ్యాల్యుయేషన్ కార్పొరేట్ ఫైనాన్స్ అడ్వయిజర్స్ డఫ్ అండ్ పెల్ప్స్ గురువారం విడుదల చేసిన తాజా ఎడిషన్‌లో ఈ విషయాన్ని పేర్కొంది.


కోహ్లీ తర్వాతి స్థానం బాలీవుడ్ నటి దీపికా పదుకొనే .. 2017 తో పోల్చుకుంటే ఒక ర్యాంకు పైకెగిసింది. ఆమె బ్రాండ్ విలువ 102.5 మిలియన్ డాలర్లు. నవంబర్ 2018 వరకు ఆమె 21 బ్రాండ్‌లకు ప్రచారం చేశారు. వీరిద్దరు సెలెబ్రిటిలు మాత్రమే 100 మిలియన్ డాలర్ల క్లబ్‌లో నిలిచారు. దేశంలోని టాప్ 20 సెలెబ్రిటి బ్రాండ్ విలువ 877 మిలియన్ డాలర్లుగా తేలింది. వారిలో టాప్ 10 సెలెబ్రిటిల వాటా మొత్తం విలువలో 75 శాతం ఆక్రమించారు. విరాట్‌తో పాటు దీపిక ఇద్దరు తమ ఎండార్స్‌మెంట్‌లు .. ఈక్విటీ ం ా ప ం ల్లో తీ సుకుం టారు. దీంతో దీర్ఘకాలం పాటు ఆ బ్రాం డ్ లో కొనసాగడానికి అవకాశం ఉంటుంది. బ్రాండ్‌కు విలువ పెరిగితే దీంతో పాటు షేరు విలువ పెరుగుతుంది అలాగే కంపెనీ పనితీరు కూడా మెరుగుపడుతుందని డఫ్ అండ్ పెల్ప్ పేర్కొంది. సెలెబ్రిటి ఎండార్స్‌మెంట్ మార్కెట్ విషయానికి వస్తే ఈ మార్కెట్ పరిపక్వం చెందింది. ప్రొడక్టు ఎండార్స్‌మెంట్ నుంచి భాగస్వామ్యం వరకు వినూత్నమైన రీతిలో ఉదాహరణకు ఈక్విటీ డీల్స్‌తో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యం వరకు తమకు అనుకూలమైన రూట్లలో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అయితే ఈ-కామర్స్, రిటైల్, ఎఫ్ఎంసీజీ, స్మార్ట్‌ఫోన్స్‌కంపెనీలు మాత్రం మిల్లీనీయల్ సెలెబ్రిటిలు.. అంటే యువ సెలెబ్రిటిల వైపు చూస్తున్నాయని, యువతను దృష్టిలో ఉంచుకొని వీరిని ఎండార్స్ చేసుకుంటున్నాయని డఫ్ అండ్ ఫల్ప్స్ మేనేజింగ్ డైరెక్టర్, ఆసియా పసిఫిక్ లీడర్.. వ్యాల్యుయేషన్ సర్వీసెస్ వరుణ్‌గుప్తా చెప్పారు.



బాలీవుడ్ సెలెబ్రిటిలు అక్షయ్‌కుమార్, రణవీర్‌సింగ్‌లు కూడా తమ ర్యాంకు నుంచి ఒక మెట్టుపైకి ఎగబాకారు. వరుసగా మూడు, నాలుగవ స్థానం ఆక్రమించారు. వారి బ్రాండ్ విలువ వరుసగా 67.3 మిలియన్ డాలర్లు, 63 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. షారూఖ్‌ఖాన్ రెండవ స్థానం నుంచి ఐదవ స్థానానికి పడిపోయారు. ఆయన బ్రాండ్ విలువ 60.7 మిలియన్ డాలర్లకు దిగివచ్చింది. అయితే టాప్ 20 సెలెబ్రిటిల జాబితాలో బాలీవుడ్ నటులదే హవా కనిపిస్తోంది. క్రీడాకారుల విషయానికి వస్తే విరాట్‌కోహ్లీ, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ దోనీ, పీవీ సింధుల మొత్తం ఎండార్స్‌మెంట్ కలిపితే 241 మిలియన్ డాలర్లకు చేరుతుంది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 27 శాతం పెరిగింది. ఈ ఏడాది విరాట్ కోహ్లీ ఆయన భార్య అనుష్కశర్మ జంట కలిసి యువతను ఆకర్షించేందుకు సుమారు 40 బ్రాండ్‌లకు ప్రచారం చేస్తున్నారు. వాటిలో కొన్ని హెడ్ అండ్ షోల్డర్స్, మాన్యవార్, పెప్సీ, సెల్కాన్, బూస్ట్ ఆడి, ఫాస్ట్‌ట్రాక్, జియోనీ, వ్రాంగ్, పోలారైడ్ లాంటి కొన్ని ప్రొడక్టులను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

ప్రభుత్వానికి ఆర్‌బీఐ జవాబుదారీ

- బిమల్ జలాన్



న్యూఢిల్లీ : రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రభుత్వానికి జవాబుదారి ... ప్రభుత్వ తయారు చేసిన నిబంధనల ఫ్రేంవర్కు పరిధి లోనే ఆర్‌బీఐ పనిచేయాల్సి ఉంటుందని మాజీ రిజర్వుబ్యాంకు గవర్నర్ బిమల్ జలాన్ అభిప్రాయపడ్డారు. కాగా జలాన్ విషయానికి వస్తే ఇటీవల కాలంలో రిజర్వుబ్యాంకుకు ... ప్రభుత్వానికి మధ్య మిగులు నిధులపై ఏర్పడిన వివాదం పరిష్కరించడానికి ఆర్‌బీఐ బోర్డు బిమల్ జలాన్ నేతృత్వంలో ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసి ఈ సమస్యకు పరిష్కారం కొనుగొనాలని ప్యానెల్ చైర్మ న్‌గా నియమించింది. ప్రభుత్వానికి ఆర్‌బీఐకి మధ్య గత కొన్ని నెలల పాటు జరిగిన మిగులు నిధుల బదిలీతో పాటు ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తికి ప్రభుత్వం భంగం కలిగిస్తోం దన్న వాదనపై ఆర్‌బీఐకి.. ఆర్థికమంత్రిత్వశాఖకు మధ్య ఘర్షణ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఉర్జిత్‌పటేల్ డిసెంబర్ 10వ తేదీన గవర్నర్ పదవికి రాజీనామా చేసి వెళ్లిపో యారు. అటు తర్వాత ఆయన స్థానంలో ఆర్థికమంత్రి త్వశాఖలో పనిచేసిన శక్తికాంతదాస్‌ను గవర్నర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆర్‌బీఐకి .. మోడీ సర్కార్‌కు ఘర్షణ ఏర్పడి పెద్ద అగాథం ఏర్పడింది. దీని ప్రధాన కారణం రిజర్వుబ్యాంకు బాండ్ల ద్వారా.. కరెన్సీ ట్రేడింగ్ ద్వారా పెద్దమొత్తంలో లాభాలను ఆర్జిస్తోంది. ఆ లాభంలో కొంత వాటా తమకు ఇవ్వాలని ప్రభుత్వం పట్టుబడుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఆర్‌బీఐ బోర్డు ఒక ప్యానెల్‌ను ఏర్పాటు చేసి ఆర్‌బీఐ వద్ద ఎంత మేరకు నిల్వలు ఉంచుకోవచ్చు. ప్రభుత్వానికి ఎంత మొత్తం బదిలీ చేయవచ్చో జలాన్ ప్యానెల్ అధ్యయనం చేస్తోంది.బిమల్ జలాన్ విషయానికి వస్తే ఆయన ఆర్‌బీఐ గవర్నర్‌గా 1997 నుంచి 2003 వరకు పనిచేశారు. అయితే తన కమిటి ఎలాంటి సిఫారసులు చేయబోతోంది వివరించడానికి నిరాకరించారు. అయితే ప్రభుత్వానికి.. ఆర్‌బీఐ మధ్య ఎలాంటి సంబంధాలు ఉండాలనే అంశాలపై స్పష్టత ఇచ్చారు. ద్రవ్యపరపతి విధానం ప్రకారం చూస్తే ఆర్‌బీఐ ప్రభుత్వానికి జవాబుదారి అని స్పష్టం చేశారు. ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తిపై ప్రభుత్వానికి ఆర్‌బీఐకి మధ్య అభిప్రా యభేదాలు ఉండవచ్చు. అయితే ఇక్కడ మోడీ ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం కానీయండి.. లేదా వాస్తవ పరి స్థితులకు అనుకూలంగా కూడా వ్యవహరించి ఉండవచ్చు. మరో పక్క ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తి గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం ఆమోదించిన విధానపరమైన ఫ్రేంవర్కుకు ప్రకా రమే ఆర్‌బీఐ వ్యవహరించాల్సి ఉంటుందని ఆయన మరో మారు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్‌బీఐకి కొత్త గవర్నర్ వచ్చారు. ఆయన గతంలో ప్రభుత్వంలో పనిచేసిన వారే. ఆయన నేతృత్వంలో ఆర్‌బీఐ చక్కగా పనిచేస్తుందని ఆశిస్తున్నానన్నారు. అభిప్రాయభేదాలుండటంలో తప్పేమీలేదని, అయితే వీటిని దేశ ప్రయోజనాల కోసం సామరస్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. అయితే జలాన్ వ్యాఖ్యలపై ఆర్‌బీఐ నుంచి తక్షణమే ఎలాంటిస్పందన లేదు. కాగా డిసెంబర్ 12వ తేదీన ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే దాస్ ప్రభుత్వంతో కొన్ని విధాన పరమైన అంశాలపై సంప్రదింపులు జరిపారు. దాస్ నేతృత్వంలో ఆర్‌బీఐ మార్చి చివరి నాటికి ప్రభుత్వానికి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు మధ్యంతర డివిడెండ్‌ను బదిలీ చేసే అవకాశాలున్నాయని ఇటీవల మీడియాలో వార్తలువచ్చాయి. కాగా దాస్ బాధ్యతలు చేపట్టిన వెంటనే సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపార సంస్థలకు రుణాలు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. ఇవన్నీ గమనిస్తే.. ఆర్‌బీఐ గవర్నర్ ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

నేడు తూ.గో.జిల్లాలో లోకేష్ పర్యటన



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖామంత్రి నారా లోకేష్ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించి పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల్లో జరిగే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల్లో పాల్గొనున్నారు. శుక్రవారం ఉదయం రాజమండ్రి విమానాశ్రయం నుంచి పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చేరుకొని అక్కడ కాపు భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా అక్కడ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అనంతరం పెద్దాపురంలో వ్యవసాయ కార్యాలయం, బీసీ సంక్షేమ హాస్టల్‌కు శంకుస్థాపన చేసి ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించిన తరువాత అక్కడ ప్రజలతో మాట్లాడనున్నారు. మధ్యాహ్నం ఉప్పాడ జంక్షన్‌లో అన్న క్యాంటీన్, పట్టణ నీటి పథకం తదితర కార్యక్రమాలను ప్రారంభించి జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొనున్నారు. అనంతరం రాజమండ్రికి చేరుకొని సిటీ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభించనున్నారు.

ఈబీసీ రిజర్వేషన్లను స్వాగతించండి



అమరావతి, ఆంధ్రప్రభ: అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా అన్ని పార్టీల నాయకులు బాధ్యత వహించాలని ఏపీ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సెక్రటరీ జనరల్ కె.శ్రీనివాస్ స్పష్టంచేశారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ అగ్రవర్ణ పేదలకు 10శాతం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడంపై ఏపీ విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. రాజ్యాంగ పరంగా మొట్ట మొదటి సారిగా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు అనుకూలంగా తీసుకొన్న నిర్ణయం కావున న్యాయపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా ఆఫలాల అందేలా చూడాలన్నారు. 70సంవత్సరాలుగా అగ్రవర్ణ పేదలు విద్య, ఉద్యోగాల్లో అనేక విధాలుగా నష్టపోయారని, ఇప్పటికే ఈబిల్లును న్యాయపరంగా ఏవిధంగా అడ్డుకోవాలనే దృక్పథంతో అనేక పార్టీలు చూస్తున్నాయని మండిపడ్డారు. గత కొన్ని దశాబ్దాలుగా దళితులకు, వెనుకబడిన తరగతుల వాళ్లకు ఇచ్చిన రిజర్వేషన్లకు అగ్రవర్ణాలు అనేక రకాలుగా సహకరించారని తెలిపారు. దీనిలో భాగంగానే అగ్రవర్ణ పేదలకోసం మొట్ట మొదటిసారిగా రాజ్యాంగంలోని 15,16 అధికరణలను సవరించడాన్ని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాల వాళ్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఏపీ విద్యుత్ ఓసీ సంక్షేమ సంఘ సభ్యులు రామకృష్ణతదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు వెయిటింగ్ డీఎస్పీలకు పోస్టింగ్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఆరుగురు వెయిటింగ్ డీఎస్పీలకు పోస్టింగ్ ఇచ్చారు. డీజీపీ ఆర్పీ ఠాకూర్ గురువారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేశారు. విశాఖపట్టణం 16వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎ. పురుషోత్తం, కర్నూలు రెండో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్‌గా కె.బాబా ఫక్రుద్దీన్, కంప్యూటర్స్ విభాగం డీఎస్పీగా టిపి విఠలేశ్వర్, విశాఖ క్రైమ్స్ డీఎస్పీగా ఎం.రామకృష్ణరాజు, సీఐడీ డీఎస్పీగా ఇ.నాగేంద్రుడు, కడప ట్రాఫిక్ డీఎస్పీగా పి.శ్రీకాంత్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

రెండు దశల్లో మెట్రో

(మొదటిపేజీ తరువాయి)

తుది నివేదికను తయారు చేసే పనిలో నిమగ్నమైంది. మరో నెలరోజుల్లో పూర్తిస్థాయి నివేదికను అమరావతి మెట్రోరైల్ కార్పొరేషన్‌కు అందజేయనుంది. 73కి.మి మేర 3 కారిడార్‌లలో ఏర్పాటు చేయనున్న ఈ మెట్రో ప్రాజెక్ట్‌ను రెండు దశల్లో నిర్మించాలని అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నాయి. మొదటి దశలో విజయవాడ నగరంలో ప్రారంభించి 2వ దశలో నవ్యాంధ్ర రాజధాని అమరావతికి అనుసంధానం చేసే విధంగా వ్యూహరచన చేస్తున్నారు. గురువారం ఈ మేరకు అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ ఎం.డి రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి మాసాంతానికి మెట్రో ప్రాజెక్టు తుది డీపిఆర్ ను శిష్టా కన్సార్టియం ఇవ్వనుందని తెలిపారు. 73 కి.మీ. మేర చేపట్టనున్న ఈ ప్రాజెక్టును ఆర్థిక భారం దృష్ట్యా 2దశల్లో నిర్మించాలని భావిస్తున్నామని వెల్లడించారు. శిష్టా సంస్థ నివేదిక అందజేసిన వెంటనే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి ఆయన ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మొదటి దశలో విజయవాడ బిఆర్టిఎస్ నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు, 2వ దశలో దీనిని రాజధాని అమరావతికి అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

● ఎమ్మెల్యే అనగాని

అమరావతి, ఆంధ్రప్రభ: గత నాలుగున్నరేళ్లలో దాదాపు రూ.40 వేల కోట్లను బీసీల సంక్షేమానికి వ్యయం చేసిన టీడీపీ ప్రభుత్వం వారి సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని టీడీపీ శాసన సభ్యుడు అనగాని సత్యప్రసాద్ గురువారం తెలియజేశారు. బీసీలను అన్ని విధాల అణిచివేతకు గురిచేసిన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే పయనిస్తున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్ బీసీ వర్గాలను ప్రక్కదోవ పట్టించేందుకు, వారిమధ్య చిచ్చుపెట్టి లబ్దిపొందేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి బీసీలు అండగా ఉండటం జరుగుతోందని, 2014-15లో బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.12,716 కోట్లు ఖర్చు చేసిన టీడీపీ ప్రభుత్వం 2018-19లో ఆ నిధులను రూ.25,904 కోట్లకు పెంచడం జరిగిందని గుర్తు చేశారు. బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్‌టీఆర్ తెదేపాను స్థాపించడం జరిగిందని, ఆయన ఆశయాలను, ఆకాంక్షలను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల పక్షపాతిగా వ్యవహరిస్తూ అన్ని రంగాల్లో వారికి ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతోందని తెలిపారు.

జగన్ కేసుల దర్యాప్తులో సీబీఐ వైఫల్యం

● ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య



అమరావతి, ఆంధ్రప్రభ : అవినీతిలో అంతర్జాతీయ నేరస్థుడిగా పేరుగాంచిన జగన్ అవినీతి, అక్రమార్జనకు సంబంధించిన కేసుల విచారణలో సీబీఐ విఫలమైందని ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య ఆరోపించారు. గురువారం విజయవాడ రాష్ట్ర అతిథిగృహంలో మీడియాతో మాట్లాడుతూ తండ్రి అధికారంతో దోచుకున్న లక్షల కోట్ల ప్రజాధనాన్ని విదేశాలకు తరలించిన జగన్ సీఎం చంద్రబాబు అవినీతి ఆరోపణలు చేయటం వింతగా ఉందన్నారు. జగన్ తన అవినీతి సొమ్మును విదేశాలకు తరలించి, దాన్ని తిరిగి తన సంస్థల్లోకి మళ్లించిన వైనాన్ని సీబీఐ గతంలో తన ఛార్జిషీట్లలో పేర్కొందని, దానికి సంబంధించిన సమాచారాన్ని ఎందుకు సంపాదించలేకపోయిందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. జగన్ కేసుల్లో ప్రధానమైన మనీలాండరింగ్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదని, లెటర్ ఆఫ్ రెగోలేటరీలో భాగంగా మారిషస్, లక్సెంబర్గ్, ఐర్లాండ్ సహా 6 దేశాల్లో దాచిన సొమ్ము తాలూకా వివరాల సేకరణలో సీబీఐ సాధించిన పురోగతి ఏమిటో జగన్ కేసు విచారిస్తున్న న్యాయస్థానాలకు ఎందుకు తెలియజేయడం లేదని ప్రశ్నించారు. సీబీఐ, ఈడీ సంస్థలు ఆదిశగా పనిచేయకపోవడం అనుమానాలకు తావిస్తుందని, ఒక ఎంపీ స్థాయిలో ఉన్న వ్యక్తి దేశంలో ఎవరూ చేయని విధంగా విదేశాలకు అక్రమార్జనను తరలించి విలాసంగా తిరగడం వెనుక ఎవరున్నారో బయట పెట్టాలన్నారు. దాదాపు రూ.43వేల కోట్ల ప్రజా ధనాన్ని అక్రమంగా కొట్టేశారని అధికారికంగానే నిరూపితమైందని, దీనిలో భాగంగానే 11ఛార్జిషీట్లు నమోదు చేయటం జరిగిందన్నారు. పాదయాత్రల పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి యత్నించిన జగన్ తన అవినీతి, దోపిడీ గురించి చెప్పకుండా సీఎం చంద్రబాబుపై బురదజల్లాలని చూస్తున్నారని, తనకు ఉన్న ఆస్తులను కూడా తనవని చెప్పుకోలేని దీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంపై, సీఎం చంద్రబాబుపై మోడీ, జగన్ కక్ష కట్టారని, అందులో భాగంగానే రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తూ ప్రజల్ని ఏమార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు.

రూటు మారింది!


(మొదటిపేజీ తరువాయి)

ఆ దేశాల వైపు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా టెక్నాలజీ, పరిశోధనలు, ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్ ఎనలిస్టు తదితర ఉద్యోగాల్లో ఆ దేశాల్లో మంచి డిమాండ్‌తో పాటు ఆకర్షణీయమైన వేతనాలు కూడా ఇస్తున్నారు. దీంతో భారతీయ నిపుణులు, ఉన్నత విద్యకు కూడా ఆ దేశాల వైపు పరుగులు తీస్తున్నారు. కెనడా, ఇంగ్లాండ్ దేశాలు ఇమ్మిగ్రేషన్ విధానాల్లో బ్రెగ్జిట్‌ను అనుసరించడంతో అంతర్జాతీయంగా ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి ఆ దేశాలు అనువైన కేంద్రాలుగా అవతరిస్తున్నాయి. కెనడా ప్రభుత్వం ఓపెన్ ఇమ్మిగ్రేషన్ పాలసీ అమలు చేయడంతో భారతీయ విద్యార్థులకు ఓ మంచి అవకాశంగా దొరికింది. ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ, గ్లోబల్ స్కిల్స్, వీసా ప్రోగ్రామ్‌ల ద్వారా విదేశీ నిపుణులకు అవకాశం కల్పిస్తోంది. సాంకేతిక నైపుణ్యం, శాస్త్రీయ పరిశోధనలో మేధోసంపత్తి కలిగిన భారతీయులకు కెనడా సంస్థలు ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ దేశానికి పెద్దఎత్తున వలసలు ప్రారంభమయ్యాయి. గత రెండేళ్ళలోనే అమెరికా నుంచి కెనడాకు భారీ ఎత్తున వలసలు వెళ్ళారు. ఆగస్టు 2016 నుంచి జులై 2018 వరకు అమెరికాలో ఉద్యోగాలు వెతుక్కునే భారతీయులు 60 నుంచి 50 శాతానికి తగ్గిపోగా, కెనడాలో 6 నుంచి 13 శాతానికి ఉద్యోగాల అన్వేషణ పెరిగిందని ఇండీడ్ సంస్థ తన అధ్యయనంలో పేర్కొంది.

అలాగే ఇంగ్లాండ్‌లో కూడా గ్లోబల్ టెక్, బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్‌లో మంచి అవకాశాలు వస్తున్నాయి. 2015 నుంచి భారతీయుల దరఖాస్తులు 8 నుంచి 10 శాతానికి పెరడంతో ఎక్కువ మంది ఇంగ్లాండ్‌లో స్థిర పడుతున్నారు. ఆ తర్వాత ఫ్రాన్స్, పోలాండ్, ఐర్లాండ్ దేశాల్లో కూడా మన టెక్కీలు, నిపుణులు, పరిశోధకులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. కెనడాలో టెక్నాలజీ రంగం పురోగతి చెందుతుండడంతో టెక్కీలకు డిమాండ్ పెరిగింది. దీనికి తోడు ఇమ్మిగ్రేషన్ పాలసీని సడలించడంతో అమెరికాలో ఉన్నత విద్య పూర్తిచేసి వెళ్ళేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కెనడాలో బిజినెస్ ఎనలిస్టు, మెకానికల్, సాఫ్ట్‌వేర్, సివిల్ ఇంజనీర్లకు, సాఫ్ట్‌వేర్, వెబ్, జావా డవలపర్స్, ప్రాజెక్టు మేనేజర్, డాటా సైంటిస్ట్, డాటా అనలిస్ట్‌లకు మంచి డిమాండ్ ఉన్నది. అలాగే ఇంగ్లాండ్‌లో శాస్త్ర పరిశోధకులు, సాప్ కన్సల్టెంట్, ఐవోఎస్, అండ్రాయిడ్, జావా డవలపర్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ అనలిస్టు, రిసెర్చ్ అసోసియేట్, ఫిజీషియన్, ఆర్కిటెక్ట్స్‌కు మంచి డిమాండ్ ఉందని ఇండీడ్ అధ్యయనం వెల్లడించింది.

ఇన్నాళ్ళుగా అమెరికాపైనే ఆధార పడిన భారతీయ నిపుణులు ఆ దేశ ఆంక్షలతో ప్రపంచ మార్కెట్‌పై అన్వేషణ ప్రారంభించి విజయం సాధిస్తున్నారు. గత నాలుగేళ్ళుగా ఆస్ట్రేలియాపై దృష్టిసారించగా, ఇప్పుడు కెనడా, ఇంగ్లాండ్ బాట పట్టారు. ముఖ్యంగా 2017 నుంచి అమెరికా నుంచి కెనడా, ఇంగ్లాండ్‌కు పెద్దఎత్తున తరలిపోవడంతో భారతీయులకు ఆ రెండు దేశాలు ప్రత్యామ్నాయ ఉద్యోగ కేంద్రాలుగా నిలిచాయని ఇండీడ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శశికుమార్ పేర్కొన్నారు.

సేవల రంగంలో ముందంజ



● మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక వ్యవస్థ ● జన్మభూమి టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : తమ ప్రభుత్వం 2015 నుండి వృద్ధిరేటులో జాతీయ సగటుకంటే అధికంగా నమోదు చేసిందని, అదే సమయంలో సేవల రంగంలోనూ జాతీయ సగటుకంటే ముందున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం ప్రజా వేదిక నుండి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, విశాఖ-చెన్నై కారిడార్‌కు నాలుగు పారిశ్రామిక రహదారులు వస్తాయన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చెందాలన్నది తన ఆకాంక్ష అని, ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలను మరింత విశేషంగా ప్రోత్సహిస్తోందని సీఎం స్పష్టం చేశారు. తన భార్య కూడా ఒక మహిళా పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేస్తూ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్‌లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ఈ సంరద్భంగా సీఎం హామీ ఇచ్చారు. మహిళలు చట్టసభల్లో, ఇతర సమావేశాల్లో తక్కువ సంఖ్యలో కనిపిస్తుంటారని, అయితే పారిశ్రామిక రంగంలో మాత్రం మహిళల భాగస్వామ్యం అధికంగా కనిపించడం ముదావహమన్నారు.

వ్యవస్థల్లోని లోపాలను ప్రభుత్వం సరిదిద్దగలదని, కానీ వ్యక్తుల్లో ఉన్న లోపాలను తమంతట తామే సరిదిద్దుకోవాలని, తప్పు చేస్తే నష్టపోతామని గుర్తెరిగి నీతి, నిజాయితీతో వ్యాపారాలు చేసుకుంటూ సాగే వారిని విజయం ఎప్పుడు వరిస్తూనే ఉంటుందని సీఎం చంద్రబాబు అన్నారు. పారిశ్రామికంగా రాణించడం ప్రతిభ ఉన్నవారికే సాధ్యమవుతుందన్నారు. వారసత్వ ప్రతిభతో వ్యాపారంలో రాణించడం అంత సులభం కాదని సీఎం స్పష్టం చేశారు.

మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ ఇవ్వాల్సిందే

అమరావతి, ఆంధ్రప్రభ: జీపీఎఫ్ పొందడం మున్సిపల్ టీచర్ల హక్కు అని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామకృష్ణ, రవి సిద్ధార్థలు స్పష్టం చేశారు. గురువారం గుంటూరులో వారు మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీతాలను చెల్లించడంతోపాటు జీపీఎఫ్ ఖాతాలను కూడా ఓపెన్ చేయాలని జీఓనెం.300ను 02.05.2009న ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటికే జీపీఎఫ్‌ను గత ఐదు సంవత్సరాలుగా అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇదే విధానం రాష్ట్ర వ్యాప్తంగా దశల అమలు చేయాల్సి ఉండగా, మున్సిపల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉద్యోగులు కాదంటూ వారికి జీపీఎఫ్ బదులు పీఎఫ్ సౌకర్యం కల్పిస్తే సరిపోతుందని కొందరు వాదిస్తూ కుట్రలు చేస్తుండటాన్ని ఎంటీఎఫ్‌ఏపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ కూడా జీపీఎఫ్ అమలుకు హామీ ఇచ్చిన నేపథ్యంలో తక్షణమే ప్రభుత్వ ఉత్తర్వులను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తూ జీపీఎఫ్ ఖాతాలను ఓపెన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు జీతాలివ్వండి

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి తక్షణమే జీతాలను చెల్లించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం డిమాండ్ చేశారు. జీతాల జారీకి గిరిజన సంక్షేమ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఖజానా శాఖ అధికారులు స్పందించడం లేదని, దీనితో గత రెండు నెలలుగా జీతాలులేక దాదాపు 6 వేల మందికిపైగా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సంక్రాంతి పండగ కూడా సమీపిస్తున్న నేపథ్యంలో తక్షణమే ప్రభుత్వం స్పందించి వారికి జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రధాని, హోం మంత్రితో గవర్నర్ భేటీ

ఉభయ రాష్ట్రాలలోని తాజా పరిస్థితులపై చర్చ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ ప్రధానమంత్రి నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. గురువారం లోక్‌కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసానికి వెళ్లిన గవర్నర్ నరసింహన్ ప్రధానమంత్రి తో సమావేశమయ్యారు. ఏపీ, తెలంగాణలోని తాజా రాజకీయ పరిస్థితులపై సుమారు అరగంటపాటు చర్చలు జరిపినట్లు తెలిసింది. అనంతరం హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఉభయ రాష్ట్రాలలోని తాజా పరిస్థితులపై నివేదిక అందజేశారు. ఇటీవల జరిగిన హైకోర్టు విభజన ప్రక్రియ తదితర అంశాలను ఆయనకు వివరించినట్లు సమాచారం. విభజన చట్టంలో అమలు చేయాల్సిన అంశాల పురోగతి అంశాలపై చర్చ జరిగిందని తెలిసింది. అలాగే రెండు రాష్ట్రాలలోని తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం అనంతరం గవర్నర్ హైదరాబాద్ కు తిరుగపయనమయ్యారు.

సిబ్బంది గృహాలకు సకల సౌకర్యాలు

● ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి రాజధానిలో ఉద్యోగుల గృహాలను అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని ఉద్యోగుల గృహ సముదాయాలు, అసెంబ్లీ, సచివాలయం శాఖాధిపతుల కార్యాలయాలు నిర్మిస్తున్న ప్రాంతాలను సందర్శించడానికి ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, దీనిలో భాగంగానే గురువారం 10బస్సుల్లో దాదాపు 600మంది ఉద్యోగులు రాజధాని ప్రాంతాన్ని సందర్శించారని తెలిపారు. మహిళలు ఈనిర్మాణాల గురించి ప్రస్తావిస్తూ కార్పొరేటర్ సెక్టార్‌లో ఉన్న గేటెడ్ కమ్యునిటీలో కూడా లేని సౌకర్యాలు ఉద్యోగులకు కల్పించారనే సంతోషాన్ని వెలిబుచ్చారని తెలియజేశారు. అంతేకాకుండా గతంలో ఉద్యోగులు ఇచ్చిన సలహాలను కూడా సానుకూలంగా తీసుకొని కింది స్థాయి ఉద్యోగులైన డ్రైవర్లు, నాల్గవ తరగతి ఉద్యోగులకు కూడా 900 చదరపు అడుగుల్లో 3పడకల గదులతో నిర్మాణాలు చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. సందర్శనకు వచ్చిన ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగులు కూడా నిర్మాణాలను పరిశీలించారని వెలుతురు పుష్కలంగా ఉండే విధంగా, చిన్న పిల్లలకు ఆటల సౌకర్యం దగ్గర నుండి వృద్ధులు సేదతీరడానికి కట్టిన స్థలాల వరకు అన్నీ చక్కగా చేసి ఉన్నారని ప్రశంసించారన్నారు.

ఏపీ అభ్యంతరాలను వెల్లడించాం



● రాష్ట్రాలను సంప్రదించకుండా కౌన్సిల్ మీటింగ్ అజెండా ● జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో యనమల అసంతృప్తి ● ఐజీఎస్టీ బకాయిలను తక్షణమే చెల్లించాలన్న మంత్రి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : రాష్ట్రాలను సంప్రదించకుండా జీఎస్టీ కౌన్సిల్ సమావేశ అజెండా రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 32వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఏపీ అభ్యంతరాలను యనమల సమావేశంలో వివరించారు. పన్నుల్లో మినహాయింపులు, పన్ను రేటు తగ్గింపుపై రాష్ట్రాలకు చాలా సమస్యలున్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ చాలా అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగలేదని యనమల అన్నారు. చాలా రాష్ట్రాలు తమ సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినప్పటికీ చర్చ జరగలేదని తెలిపారు. రాష్ట్రాల అభ్యర్థనలను దృష్టిలో పెట్టుకుని కౌన్సిల్ అజెండా రూపొందించాలని సమావేశంలో డిమాండ్ చేశారు. యనమల వాదనను కర్ణాటక, కేరళ, ఢిల్లీ ఆర్థిక మంత్రులు సమర్థించారు. రూ. 1 కోటి టర్నోవర్ లిమిట్‌ను కోటిన్నరకు పెంచాలన్న ప్రతిపాదనకు కూడా పలురాష్ట్రాలు మద్దతిచ్చాయి. అలాగే జీఎస్టీ రిటర్నులు ఏడా దికోసారి ఉండేలా, పేమెంట్స్ త్రైమాసికంగా ఉండే లా మార్పులు చేయాలన్న ప్రతిపాదనకు కూడా విస్తృత మద్దతు లభించింది. తద్వారా చిన్న వ్యాపా రులకు పన్ను చెల్లింపుల భారం, సమస్యల్ని తగ్గించ వచ్చునని సూచించారు. రాష్ట్రాల ఆదాయానికి నష్టం కలుగుతున్నప్పటికీ. సూక్ష్మ, మధ్య తరహా పరి శ్రమలకు లాభం చేకూర్చే థ్రెష్ హోల్డ్ లిమిట్‌ను రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదనకు ఆంధ్ర ప్రదేశ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సర్వీస్ సెక్టార్‌లో టర్నోవర్ పరిధిని రూ. 20 లక్షల నుంచి రూ. 50 లక్షలకు పెంచడాన్ని కూడా ఏపీ మంత్రి యనమల రామకృష్ణుడు సమర్థించారు. దీని ద్వారా అనేక చిన్న సర్వీస్ ప్రొవైడర్లకు లబ్ది చేకూరుతుందని, రాష్ట్రాల ఆదాయం తగ్గినా వారి ప్రయోజనం కోసం అంగీకరిస్తున్నామని ఆయన వెల్ల డించారు. ఐజీఎస్టీ చెల్లింపుల్లో పెండింగ్‌లో ఉన్న సుమారు 7,000 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశా రు. ఏపీకి తక్షణమే రూ. 100 కోట్లను కేంద్ర ప్రభుత్వం చెల్లి స్తుందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు యోధుడు శివారెడ్డి కన్నుమూత



కడప, ప్రభ న్యూస్ బ్యూరో : కమ్యూనిస్టు ఉద్యమ యోధుడు..సాయుధ పోరాటంలో ప్రాణాలకు తెగించి పోరాడిన ధీరుడు, కమ్యూనిస్టులపై కఠిన నిషేధ సమయంలో సుమారు నాలుగేళ్ళ పాటు అజ్ఞాతంలో కొండలు, గుట్టల్లో గడిపిన ఉద్యమనేత, ఉమ్మడి కమలాపురం, పులివెందుల మొదటి ఎమ్మెల్యే నర్రెడ్డి శివరామిరెడ్డి గురువారం సాయంత్రం కన్నుమూశారు. కమ్యూనిస్టు పార్టీకి 27 ఏళ్ళ పాటు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎన్నో పోరాటాలు, రచనలు చేసి ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 97 ఏళ్ల వయసు కలిగిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ మృతి చెందారు. పలకలు లేని సమయంలో ఇసుకమీద అక్షరాలు నేర్చి రచనలు ఎన్నో చేసిన ఆయన కమ్యూనిస్టు ఉద్యమనేతగా ప్రజల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. తాడిత పీడిత జనుల కోసం జరిగిన పోరాటంలో ఆస్తులు పోగొట్టుకున్నారు. సాయుధ పోరాటంలో తన భార్య మెడలో వున్న తాళిబొట్టు మినహా 22 తులాల బంగారాన్ని కూడా ఆమె ఉద్యమానికి విరాళంగా సమర్పించారు. జిల్లా కమ్యూనిస్టు చరిత్రలో చెరగని జ్ఞాపకాలు వుంచి మృతి చెందిన శివరామిరెడ్డి మరణం తీరని లోటని కమ్యూనిస్టులతో పాటు రాజకీయ పార్టీలు,ప్రజలు నివాళులు అర్పిస్తున్నారు.

27 ఏళ్ళు కమ్యూనిస్టు కార్యదర్శిగా

మాజీ ఎమ్మెల్యే ఎన్.శివరామిరెడ్డి 1956 నుంచి 1986 వరకు 27 ఏళ్ళ పాటు జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నో పోరాటాలు చేశారు. 1952 మొదటి జనరల్ ఎన్నికల్లో కమలాపురం, పులివెందుల ఉమ్మడి నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1922 ఫిబ్రవరి 25న వీరపునాయునిపల్లె మండలం గడ్డంవారిపల్లెలో జన్మించిన ఈయన ఇసుకపై ఓనామాలు దిద్దారు. 1939 నుంచి 1943 వరకు అనంతపురం ఆర్ట్సు కాలేజీలో డిగ్రీ చేశారు. 1943 నుంచ 1945 వరకు మద్రాసు లా కాలేజీలో బిఎల్ పూర్తి చేశారు. ఆ తర్వాత కూడా కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి 1947 లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

శివరామిరెడ్డి మృతికి సీపీఐ సంతాపం

మాజీ శాసనసభ్యుడు, సీపీఐ సీనియర్ నాయకుడు నర్రెడ్డి శివరామిరెడ్డి మృతి పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాయలసీమలో ముఖ్యంగా కడప జిల్లాలో పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన అటు పిమ్మట కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై వాటి ప్రచారానికి విశేష కృషి సలిపారన్నారు. శివరామిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని అంటూ ఆయన కుటుంబ సభ్యులకు రామకృష్ణతో పాటు సీపీఐ సీనియర్ నేత జి. ఓబులేసు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రహదారి భద్రత... నిరంతర అప్రమత్తత

• రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం
• గతంతో పోలిస్తే 11.76 శాతం తగ్గుదల
• మరింత తగ్గించేందుకు కార్యాచరణ



ఫైల్ ఫొటో

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రభుత్వ శాఖల సమన్వయం రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తోంది. పోలీసు, రవాణా అధికారులు ఇతర శాఖలను సమన్వయం చేసుకొని చేపడుతున్న చర్యలతో రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించగలిగారు. 2017తో పోల్చితే 2018లో రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య 11.76 శాతం తగ్గింది. రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య 9.09 తగ్గగా.. క్షతగాత్రులవుతున్న వారి సంఖ్య 15.23 శాతం తగ్గింది. తూర్పు గోదావరి, విజయవాడ సిటీ, విశాఖపట్టణం సిటీల్లో అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా.. గుంటూరు రూరల్, ఉభయ గోదావరి జిల్లాల్లో మృత్యువాత పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. గత వారం గుంటూరు జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అధికారులు మరోసారి అప్రమత్తమయ్యారు. గత ఏడాది చర్యలను కొనసాగిస్తూనే మరింత కట్టుదిట్టంగా వ్యవహరించేందుకు పోలీసు, రవాణాశాఖలు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల తగ్గింపును ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుంది. 2016 డిసెంబర్‌లో చిత్తూరు జిల్లా ఏర్పేడు రోడ్డు ప్రమాదం తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా రహదారి భద్రతపై దృష్టిసారించారు. గత రెండేళ్లుగా నిరంతరం అధికారులను అప్రమత్తం చేస్తూ రోడ్డు ప్రమాదాల తగ్గింపునకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతి నెలా నాలుగో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోడ్డు భద్రతపై రవాణా, పోలీసు, ఆర్ అండ్ బి అధికారులతో సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు కారణంగా అధికారులు పేర్కొంటున్న రహదార్ల మరమ్మతులు, రహదారి జంక్షన్లలో లైటింగ్, సూచిక బోర్డుల ఏర్పాటును యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించారు. ఇదే సమయంలో నిరంతర తనిఖీలకు సీఎం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. తరుచూ నిర్వహించే జిల్లా కలెక్టర్ల సదస్సుల్లో సైతం రహదారి భద్రతపై సీఎం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పొచ్చు. రహదారి భద్రతపై గత డీజీపీ డాక్టర్ మాలకొండయ్య, ప్రస్తుత డీజీపీ ఆర్పీ ఠాకూర్ కూడా ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని జిల్లాల్లో హెల్మెట్ల వాడకాన్ని నిర్బంధం చేయడంతో పాటు విద్యార్థులు, మహిళలను భాగస్వాములను చేసి అవగాహనా సదస్సులు నిర్వహించారు. జిల్లా బోర్డర్లలో ప్రత్యేక పోలీసు బృందా లను ఏర్పాటు చేసి లారీల తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా తెల్లవారుజామున వెళ్లే లారీ డ్రైవర్లను ఆపేసి విశ్రాంతి తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. డ్రైవర్ల నిద్రమత్తును వదిలించేందుకు ముఖం కడుక్కొనేందుకు నీళ్లు సరఫరా, ఆ తర్వాత తాగేందుకు టీ ఇవ్వడం పోలీసులు విధిగా చేపట్టారు. ఇప్పటికీ ఇదే విధానం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రోడ్డు సేఫ్టీ వాహనాలు కొను గోలు చేసి అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో గస్తీని ముమ్మరం చేశారు. ఓ వైపు పోలీసు శాఖ చేపట్టిన చర్యలను సమన్వయం చేసుకుంటూనే రవాణా శాఖ కూడా ప్రత్యేకంగా రహదారి భద్రతపై దృష్టిపెట్టింది. నిరంతరం వాహనాలు తనిఖీ నిర్వహించడం, వేగ నిరోధానికి స్పీడ్ గన్ల వినియోగం, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్‌ల వంటి విస్తృత ప్రచారం నిర్వహించింది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా కాలేజీలు, విద్యా సంస్థలు, వివిధ ప్రాంతాల్లో లైసెన్స్ మేళాలు నిర్వహించి లైసెన్స్‌లను ప్రోత్సహిస్తోంది. రవాణా శాఖ నిబంధనల ఉల్లంఘనలపై పెద్ద ఎత్తున కేసులు నమోదు చేసి రూ.85.86 కోట్ల జరిమానా వసూలు చేశారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారి పట్ల పోలీసు, రవాణా శాఖ లు కఠిన వైఖరి తీసుకోవడంతో పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. ఇదే విధానంతో 2019లో కూడా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అధికారులు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు.

సంవత్సరం	జరిగిన ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2017	20605	7381	25341
2018	18181	6766	21480

పగలే వెన్నెల... పయనమే చల్లగా!



- ఆర్టీసీలో కనువిందు చేయనున్న 'వెన్నెల' కొత్త ఏసీ బస్సులు • మొత్తం 84 ఏసీ బస్సుల కొనుగోలు • త్వరలో అమరావతి రోడ్లపైకి12 వెన్నెల బస్సులు పరుగులు
- ప్రైవేట్‌కు ధీటుగా వేసవికి అందుబాటులోకి రానున్న సర్వీసులు

అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీయస్ఆర్టీసీ అతిత్వరలో అత్యాధునిక వసతులున్న వెన్నెల బస్సులతోపాటు మరో రెండు రకాల ప్రత్యేక ఏసీ బస్సులను కొనుగోలు చేయబోతోంది. మిగతా బస్సులకు భిన్నంగా అత్యాధునిక వసతులుండే ఈ బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ యాజమాన్యం గతంలోనే చర్యలు తీసుకుంది. ఇప్పటికే కొన్ని బస్సులు వచ్చాయి. మరికొన్ని త్వరలోనే రాబోతున్నాయి. రానున్న వేసవికి ఈ నూతన ఏసీ బస్సులు ప్రయాణీకులకు మరింత చేరువ కనువిందు చేయబోతున్నాయి. ప్రైవేట్ సర్వీసులకు ధీటుగా ,పోటీగా నిలిపేందుకు 2018-19 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం కొత్తగా వెన్నెలతోపాటు మూడు రకాల బస్సులను కొనుగోలు చేయనున్నది. ఏసీ సీటర్ విభాగానికి సంబంధించి 48 ఇంద్ర బస్సులు, అమరావతి నాలుగు బస్సులు మొత్తం 52 బస్సులు కొనుగోలు చేయనున్నది. అదే విధంగా ఏసీ సీటర్ ప్లస్ స్లీపర్ విభాగంలో నైట్ రైడర్ పేరుతో మొత్తం 12 బస్సులను కొనుగోలు చేస్తున్నారు. ఏసీ స్లీపర్ విభాగంలో మరో 12 వెన్నెల బస్సులు వచ్చే వేసవికల్లా అమరావతి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. కాగా వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులకు సంబంధించి ఇప్పటికే 10 బస్సులు సంస్థ గూటికి చేరాయి. త్వరలో మరో 10 వెన్నెల బస్సులు రాబోతున్నాయి. ఈ పది వెన్నెల బస్సులలో విజయవాడ - బెంగుళూరు మార్గంలో రెండు నడపనున్నారు. విశాఖపట్నం - హైదరాబాద్ మధ్య రెండు, తిరుపతి - హైదరాబాద్ మార్గంలో రెండు, విజయవాడ -చెన్నై మార్గంలో మరో రెండు వెన్నెల బస్సులు నడపాలని భావిస్తున్నారు. ఏసీ స్లీపర్ బస్సుల్లో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఒక్కో సీటు వరుసలో 30 బెర్తులుంటాయి. ఈ బెర్తుల ఎంతో సౌకర్యవంతంగా విశాలంగా ఉంటాయి. మెరుగైన ఎయిర్ సస్పెన్షన్ విధానం కలిగి ఉండడం వల్ల రోడ్లపైన గతుకులు, గుంతలు ఉన్నా కానీ తక్కువ కుదుపుతో ప్రయాణం ఎంతో హాయిగా సాగుతుంది. బెర్తు పక్కనే ప్రయాణీకుని లగేజీ క్యారియర్‌ఏర్పాటు చేశారు. మొబైల్, లాప్‌టాప్ చార్జింగ్‌లకు ప్రత్యేకసౌకర్యం ఏర్పాటు చేశారు. ఇంద్ర,గరుడ,అమరావతి బస్సులలో ఉన్న మంచినీటి బాటిల్స్ సౌకర్యం ఇందులో కూడా ఉంటుంది. కొత్త బెడ్ షీట్లు, కప్పుకునేందుకు రగ్గులు అందుబాటులో ఉంచుతారు. టూ ఫ్లస్ వన్ తరహా బెర్తులను ఏర్పాటు చేస్తారు. ప్రయాణీకుల లగేజీ భద్రత కోసం ఎంతో విశాలమైన లగేజీ బూత్ వంటిసదుపాయాన్ని కూడా ఈ బస్సుల్లో ఏర్పాటు చేయడం గమనార్హం. కార్గో పార్శిల్లకు కూడా ఈ లగేజీ బూత్‌లు అనువుగా ఉండడంతో ఇటు ప్రయాణీకుల సౌకర్యం, అటు వాణిజ్య రాబడికి కూడా ఎంతో ఉపయుక్తంగా ఉంటాయంటున్నారు. అదే విధంగా ఏసీ స్లీటర్ బస్సులు కూడా కొన్ని ప్రత్యేకతలు కలిగి ఉన్నాయి. ఇందులో కొన్ని సీట్లను కూర్చుని ప్రయాణించే విధంగాను, మరికొన్ని పడుకుని ప్రయాణించేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ రకానికి సంబంధించిమొత్తం 12 బస్సులను కొనుగోలు చేస్తున్నారు.ఇందుకు సంబంధించి ఆరు బస్సుల్లో 15 అప్పర్ బెర్తులతోపాటు 33 సీట్లు ఉంటాయి. ఇంకో ఆరు బస్సుల్లో 15 అప్పర్ బెర్తులతోపాటు ఆరు లోయర్ బెర్తులు, 22 సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు. రానున్న వేసవి కల్లా వీటిని రంగంలోకి దింపి, మంచి ఆదాయం గడించాలని ఆర్టీసీ భావిస్తోంది. ప్రైవేట్‌కు ధీటుగా ఈ బస్సులుంటాయని సంబంధిత అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

వైకాపాకివే చివరి ఎన్నికలు!

- మోడీతో కలసి జగన్ కాశీ యాత్ర చేసుకోవాలి : మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



అమరావతి, ఆంధ్రప్రభ: మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్ నాటకాన్ని ముగించిన జగన్, ఇక కాశీయాత్ర చేసుకోవాలని, అక్కడ జగన్ స్నేహితుడు నరేంద్ర మోడీ కూడా తోడవుతారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎద్దేవా చేశారు. స్థానిక జలవనరుల శాఖా కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉమా జగన్‌పై మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా జగన్ చేసిన వ్యాఖ్యలు సత్యదూరమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఒక వైపు, జగన్ అవినీతి,మోడీ కుమ్మక్కు రాజకీయాలు మరో వైపు ఉంటాయని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామన్నారు. వైసీపీకి 2019 ఎన్నికలే చివరి ఎన్నికలు కాబోతున్నాయని జోస్యం చెప్పారు. పార్టీలకతీతంగా గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుంటే,జగన్ అబద్ధాల ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కళ్లకు కనిపిస్తున్న అభివృద్ధిపై ఒక్క మాటైనా మాట్లాడలేదంటే ప్రజలను మోసం చేసే ఉద్దేశంతో జగన్ ఉన్నట్లు అర్థమవుతోందని విమర్శించారు. జగన్ ప్రసంగంలో నిరాశ,నిస్పృహ తనకు స్పష్టంగా కనిపించిందని అన్నారు.

జగన్, మోడీ,కేసీఆర్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పాదయాత్రకు ముగింపు కాదని, వైకాపాకే ముగింపు పలికే యాత్రని ఎద్దేవా చేశారు. స్వాతంత్య్రం కోసం మంది పవిత్రమైన పాదయాత్రలు చేస్తే జగన్ వాటిని అపహాస్యం చేసే విధంగా మార్నింగ్, ఈవినింగ్ వాక్ చేశారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్య్రానికి ముందే రైతుకు గిట్టుబాటు ధర కోసం శ్రీకాకుళం జిల్లాలో పెద్ద ఎత్తున పాదయాత్రలు చేస్తే కనీసం జగన్ నోట ఆయన గురించి ఒక్క మాట రాలేదన్నారు. ఈ పాదయాత్రతో జగన్ సాధించిందేమైనా ఉందంటే అది కోడికత్తి నాటకమేనని అన్నారు. కోడికత్తి నాటకంలోని వాస్తవాలు జగన్ అంతరాత్మకు తెలుసు అన్నారు. రూ. 40వేల కోట్లతో అమరావతి రాజధాని నిర్మాణ పనులు జరుగుతుంటే ఒక్క ఇటుక కూడా పెట్టలేదని విమర్శిస్తున్నారని, ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టుకు రూ.10,444 కోట్లు ఖర్చు చేస్తే రూ.25వేల కోట్ల అవినీతి జరిగిందని జగన్ పొంతనలేని విమర్శలు చేస్తున్నారని అన్నారు. డీపీఆర్-2ను ఆమోదించకుండా టెక్నికల్ అడ్వయిజరీ కమిటీకి అడ్డుపడుతూ కేంద్రం మరింత ఆలస్యం చేస్తున్నా జగన్ నోరు మెదపడం లేదన్నారు. రుణమాఫీ కింద డబ్బులు రైతులకు ఇస్తుంటే రుణమాఫీ జరగలేదని అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. సాదయాత్ర చేస్తూనే పక్కనే ఉన్న తుఫాన్ బాధితులను కూడా పరామర్శించలేదన్నారు. కేంద్రం పరంగారాకి రూ.75వేల కోట్లు ఇవ్వాలని జేసీ చెప్పినా దానిపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. ప్రజలే జగన్‌కు బుద్ధి చెబుతారని మంత్రి ఉమా ధ్వజమెత్తారు.

30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 30వ తేది నుండి జరగనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌కేటాయింపులపై ఓటాన్ అకౌంట్ సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమౌతోంది. ఈ సమావేశాలను 5రోజుల పాటు జరిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈసమావేశాల చివరి రోజున ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది.

పీఏసీఎస్ ఉద్యోగుల వేతన సవరణకు తక్షణ చర్యలు

- సీఎంకు సీపీఎం కార్యదర్శి మధు లేఖ



అమరావతి, ఆంధ్రప్రభ : పీఏసీఎస్ ఉద్యోగుల వేతనసవరణ గడువు ముగిసి నాలుగున్నర సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ ప్రాథమిక సహకార పరపతి సంఘాలలో పనిచేసే ఉద్యోగులు వేతన సవరణకు నోచుకోలేదని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఒక లేఖ రాశారు. ఈ ఉద్యోగుల(పీఏసీఎస్) వేతనాలను 50శాతం పెంచి, రూ. 5 లక్షల గ్రాట్యుయిటీని కూడా చెల్లించాలని, జిల్లాకో ఆపరేటివ్ బ్యాంకుల్లో 5వ క్యాడర్ పోస్టుల్లో 50 శాతం పిఏసీఎస్ ఉద్యోగులతో సీనియార్టీ ఆధారంగా భర్తీ చేయాలని కోరారు. పిఏసీఎస్ ఉద్యోగులకు కూడా వేతన సవరణ కమిటీ ప్రతిపాదించిన విధంగా పదవీ విరమణ వయస్సును 60కు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖలోని అన్ని పాఠశాలలకు గాంధీజీ విగ్రహాలు

- తొలిసారిగా భీమిలి నియోజకవర్గంలో 287 మహాత్ముడి విగ్రహాలు ఏర్పాటు
- చదువులోని ఆనందాన్ని పొందితేనే ఉన్నత శిఖరాలు : మంత్రి గంటా

విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గాంధీజీ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర మానవ వనరులశాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఇక్కడ వుడా చిల్డ్రన్స్ థియేటర్‌లో భీమిలి నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలలకు మహాత్మాగాంధీ విగ్రహాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంటా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మహాత్మాగాంధీ విగ్రహాలను ప్రతిష్టించడం వల్ల విద్యార్థులకు మంచి స్ఫూర్తి, ప్రేరణ కలిగే అవకాశాలు అధికంగా ఉంటాయనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పిల్లలకు తొలి గురువు తల్లిదండ్రులని, అనంతరం పాఠశాలల్లోని ఉపాధ్యాయులేనన్నారు. మహాత్ముడు నడిచిన మార్గాన్ని, ఆచరించిన విధానాలను , సత్యం, ధర్మం, అహింసల ప్రాసస్త్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యా యులు తెలియజెప్పడం ద్వారా బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. నైతిక విలువ లు, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు.

మహాత్మాగాంధీ ప్రవచించినట్లు చదువులో ఆనందం పొందితేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటామన్న విషయాన్ని విద్యార్థులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. దీని వల్ల ప్రతీ విద్యార్థి కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకునేలా



వారిని ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, విఎమ్ఆర్‌డిఏ కమిషనర్ బసంత్ కుమార్, ఆంధ్రాయూనివర్సిటి ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎమ్.ముత్యాలనాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వరరెడ్డి, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సన్యాశిరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సువూరు 287 గాంధీ విగ్రహాలను పంపిణీ చేశారు.

జైళ్ళ భద్రతకు నిఘా నేత్రాలు

- రూ.10 కోట్లతో సీసీ కెమెరాల ఏర్పాటు
- ఆర్టీజీఎస్ కేంద్రానికి అనుసంధానం

అమరావతి, ఆంధ్రప్రభ : జైళ్ల భద్రతపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రవ్యాప్తంగా 44 జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 10 కోట్లు మంజూరు చేసింది. జైళ్ల రక్షణతోపాటు, జైళ్లలో సంఘ విద్రోహ కార్యక్రమాలు అరికట్టేందుకు సీసీ కెమేరాలు ఉపయోగపడనున్నాయి. అంతేకాకుండా జైళ్లలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, ఖైదీలు హింసకు గురవుతున్నట్లు పలు స్వచ్ఛంధ సంస్థలు, మానవ హక్కుల సంఘాలు సుప్రీం కోర్టుతోపాటు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో జైళ్లో భద్రతతోపాటు ఖైదీల హక్కులను పరిరక్షించాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో జైళ్లలో సీసీ కెమేరాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. కొన్ని జైళ్లో ఖైదీలు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్ని సమయాల్లో కరడుగట్టిన ఖైదీలు జైలు సిబ్బందిపట్ల అసభ్యంగా ప్రవర్తించడంతోపాటు దాడులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. జైల్లో సిబ్బందిపై దాడికి పాల్పడిన అనంతరం తమపై దాడి జరిగినట్లు ఖైదీలే కోర్టుల్లో ఫిర్యాదులు చేసిన ఘటనలు కూడా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా కుటుంబ సభ్యులతో ములాఖత్ సమయంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతోపాటు జైళ్ల భద్రత లోపాలతో పలుచోట్ల ఖైదీలు పారిపోయిన ఉదంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ నివారించేందుకు నిఘా నేత్రాలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

రాష్ట్రంలోని కడప, రాజమండ్రి కేంద్రీయ కారాగారాలతోపాటు జిల్లా జైళ్లు, ప్రత్యేక జైళ్లు, సబ్ జైళ్లలో సీసీ కెమేరాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. రాష్ట్రంలోని ఏప జైలుకు ఎంతెంత వ్యయం అవుతుందనే దానిని అంచనావేసి అందుకు తగ్గట్టుగా నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో జైళ్లలో కూడా భద్రత, నిర్వహణతోపాటు సిబ్బంది అధికారుల ప్రవర్తనా తీరుపై సీసీ కెమేరాల ఏర్పాటుతో పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. నిఘా నేత్రాల ఏర్పాటుతో ఖైదీలు తప్పించుకోకుండా నివారించే అవకాశం ఉంది.

జైలు ఆవరణతోపాటు బ్యారక్‌ల ముందు సీసీ కేమెరాలు అమర్చనున్నారు. ఇప్పటికే పోలీస్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో సీసీ కేమేరాలు ఏర్పాటుచేసి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రానికి అనుసంధానం చేశారు. దీంతో ఆర్టీజీఎస్ సెంటర్ నుండే రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలను పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జైళ్లలో సీసీ కేమేరాలు అమర్చి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయనున్నారు. తద్వారా జైళ్లలో అక్రమాలు అరికట్టడంతోపాటు భద్రతా చర్యలు కట్టుదిట్టంచేసి పాదర్శకతకు శ్రీకారం చుట్టనున్నారు.

అమరావతిలో గాంధీ, అమరజీవి విగ్రహాలు

- గాంధీ మెమోరియల్ ట్రస్టు వినతి

అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతిలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలు నెలకొల్పాలని, ఈ రెండు విగ్ర హాల ఏర్పాటు నిమిత్తం 20ఎక రాలు కేటాయించాలని, మహాత్మా గాంధీ మెమోరియల్ ట్రస్టు అధ్యక్షుడు, పొట్టి శ్రీరాములు ట్రస్టు ఉపాధ్యక్షుడు బొలిశెట్టి హరిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. పుష్కరాల సమయంలో రోడ్ల విస్తీర్ణంలో భాగంగా విజయవాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని, ప్రకాశం బ్యారేజీ సమీపంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని తొలగించారని, దేశం కోసం, రాష్ట్రం కోసం అహరహం శ్రమించిన మహనీయుల విగ్రహాలను అమరావతిలో నెలకొల్పాలని, ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కూడా లేఖలో హరిబాబు పేర్కొన్నారు.

రాయచోటి మాజీ ఎమ్మెల్యే మండపల్లి నారాయణరెడ్డి మృతి





రాయచోటి, ప్రభన్యూస్ : వైయస్సార్ జిల్లా రాయచోటి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మం డిపల్లి నారాయణరెడ్డి (64) గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై, గురువారం మధ్యాహ్నం చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మండిపల్లి నారాయణ రెడ్డి రాయచోటిలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1990లో శాసనసభ్యులుగా రాయచోటిలో గెలుపొందిన రాయచోటి వైసీపీ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తండ్రి, మండిపల్లి నారాయణరెడ్డి చినాన్న అప్పటి రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి 1992లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ తరువాత 1993లో వచ్చిన ఉప ఎన్నికల్లో రాయచోటిలో కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేసి సుగవాసి పాలకొండ్రాయుడుపై గెలుపొందారు. వెంటనే 1994లో వచ్చిన సాధారణ ఎన్నికల్లో కూడా మళ్లీ రెండోసారి పాలకొండ్రాయుడుపై నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. వరుసగా మూడోసారి కూడా రాయచోటిలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన మండిపల్లి నారాయణరెడ్డి 1999లో ఓటమిపాలయ్యారు. అయితే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి మంచి ఆప్తులుగా మండిపల్లి కుటుంబ సభ్యులు ఉంటూ వచ్చారు. రాజశేఖర్‌రెడ్డి ఎప్పుడు రాయచోటికి వచ్చినా ఖచ్చితంగా నారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనతో కలిసి భోజనం చేసి వెళ్లేవారు. రాయచోటి శాసనసభ్యుడిగా ప్రజలు గుర్తుంచుకునే పలు అభివృద్ధి పనులను రాయచోటిలో నారాయణరెడ్డి చేయడంతో ఇప్పటికీ ప్రజల గుండెల్లో ఆయన నిలిచిపోయారు. 1993, 1999 ఎన్నికల్లో కూడా స్వయంగా వైఎస్ రాయచోటిలో నారాయణరెడ్డి తరపున ఎలక్షన్ జనరల్ ఏజెంట్‌గా పనిచేయడం విశేషం. మండిపల్లి నారాయణరెడ్డికి ఒక కుమారుడు రాహుల్‌రెడ్డి, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి పలువురు నాయకులు, ప్రముఖులు, ఆయన కుటుంబ సభ్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం చిన్నమండెం మండలంలోని దేవగుడిపల్లె వద్ద ఉన్న మాజీ ఎమ్మెల్యే మామిడి తోటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

21న దక్షిణాది రాష్ట్రాల రెవెన్యూ అధికారుల రాక

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర రెవెన్యూశాఖ గత నాలుగేళ్లలో ప్రవేశపెట్టిన పలు సంస్కరణలను అధ్యయనం చేసేందుకు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు ఈనెల 21న రాష్ట్రానికి రానున్నారు. ప్రధానంగా రాష్ట్రంలో చుక్కల భూముల సమస్యను పరిష్కరించ డంతోపాటు రెవెన్యూసేవలను ఆన్‌లైన్ విధానంలోకి మారుస్తూ ప్రభుత్వ సంస్కరణలు చేపట్టిన విషయం తెలిసిందే. వ్యవసాయ భూ యజమానులు తమ భూముల వివరాలను పరిశీలించేందుకు నిర్దేశించిన 'భూధార్'తో రైతులకు కలిగే ప్రయోజనాలపై తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శులతోపాటు ఇతర ఉన్నతాధికారులు, ఆయా రాష్ట్రాలకు చెందిన రైతులు ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 21 నుండి 24వ తేదీ వరకూ పర్యటించే అవకాశాలున్నాయని రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సేవలను ఎంతో సులభతర విధానంలో పరిష్కరించడంతోపాటు ఆన్‌లైన్ సేవలు, ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై దక్షిణాధి రాష్ట్రాల రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు అధ్యయనం చేసే వీలుంది. వీరి పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ-దేవాదాయ) కే.ఈ.కృష్ణ మూర్తితో పాటు ఇతర రెవెన్యూశాఖ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. అనంతరం వెలగపూడిలోని అమరావతి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆర్టీజీఎస్ కేంద్రాన్ని సందర్శించే అవకాశం ఉంది.

వ్యాపారి కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

అమరావతి, ఆంధ్రప్రభ: అప్పు చెల్లించని అపరాల వ్యాపారిని కిడ్నాపు చేసిన నలుగురు నిందితులను నాలుగు గంటల వ్యవధిలోనే విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొల్లి తిరుపతిరావు, యోసూరి సత్యనారాయణ, ఉన్నా నరసింహారావు, కారు డ్రైవర్ అన్నారపు గంగాధర్ ఉన్నారు. పోలీసు కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పివీ సత్యప్రకాష్ ఏడేళ్లుగా ప్రైవేటుగా వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. తెలిసిన వ్యక్తుల నుంచి రూ.రెండు కోట్లు అప్పుగా తీసుకొని, మరో రూ.30లక్షలు కలిపి ఉద్యోగులు, వ్యాపారులకు అధిక వడ్డీలకు ఇచ్చే వాడు. వడ్డీ వ్యాపారంలో నష్టం రావడంతో గతేడాది అక్టోబర్‌లో గురజాల కోర్టులో దివాలా ఫిటీషన్ దాఖలు చేశాడు. దీనికి ఆగ్రహించిన ఓ 15మంది వ్యక్తులు అంతకు ముందు తీసుకున్న ప్రామిసరీ నోట్లతో గురజాల కోర్టులో దావా వేశారు. వీరిలో తిరుపతిరావుకు రూ.15లక్షలు, సత్యన్నారాయణకు రూ.35లక్షలు, నరసింహారావుకు రూ.16లక్షలు ఇవ్వా ల్సి ఉండగా ఒత్తిడి తీసుకొస్తు న్నారు. వీరి ఒత్తిడి భరించలేని స్థితిలో విజయవాడ ఇస్లాంపేటలో ఉంటున్న పెదనాన్న చల్లా మల్లిఖా ర్జునరావు ఇంట్లో తలదా చుకున్నాడు. ఆచూకీ తెలుసు కున్న వీరు ముగ్గురు కారు డ్రైవర్ అన్నారపు గంగాధర్‌తో కలిసి బుధ వారం రాత్రి సత్యప్రకాష్‌ను కిడ్నాపు చేశారు. సమాచారం అందిన వెంటనే విజయవాడ కొత్తపేట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అర్ధరాత్రి సమయంలో అదుపులోకి తీసుకో వడంతో పాటు కిడ్నాప్‌కు ఉపయో గించిన కారును స్వాధీనం చేసుకున్నారు.

రోడ్ ట్యాక్స్‌ను రద్దు చేయండి

అమరావతి, ఆంధ్రప్రభ: ఆటో రిక్షాలకు రోడ్ ట్యాక్స్ ను రద్దు చేయాలని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఆటో యూనియన్ నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి ఉండవల్లిలో ముఖ్యమంత్రిని కలిసిన ఆటో యూనియన్ నేతలు ఈ మేరకు ఆయనకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ఉన్న త్రైమాసిక పన్ను విధానాన్ని రద్దు చేసి 2018 జూన్‌లో లైఫ్ ట్యాక్స్ విధానాన్ని తీసుకురావడం వల్ల ఎంతో మంది ఆటో డ్రైవర్లకు, ఓనర్‌లకు మేలు జరిగిందని వారు ముఖ్యమంత్రికి వివరించారు. నూతనంగా కొనుగోలు చేసిన ప్యాసింజర్ ఆటోలకు 2శాతం పన్ను ఉండగా 3 నుండి 6 సంవత్సరాల లోపు ఆటోలకు 1.5 శాతం పన్ను విధిస్తున్నారని , దీని వల్ల ఓనర్లు, డ్రైవర్లపై రూ. 2 వేల నుండి 4వేల వరకు ఆర్థిక భారం పడుతుందని వివరించారు. ఈ పన్ను విధానాన్ని రద్దుచేసి ఆటో కార్మికు లను ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్య మంత్రి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రొత్సాహంతో ఆటో డ్రైవర్లు ఓనర్లుగా ఎదగాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

ఫిర్యాదు చేస్తే ఖబడ్దార్

- బెదిరిస్తున్న నౌహీరా షేక్ అనుయాయులు
- హీరాగ్రూపు కేసులో బాధితుల పరేషాన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధిక వడ్డీ ఆశ చూపి జనం నెత్తిన టోపీ పెట్టిన హీరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత నౌహీరా షేక్ గురించి పోలీసులకు ఫిర్యాదులు చేసినా, వివరాలు చెప్పినా చంపేస్తామంటూ ఆమె అనుయాయులుగా చెప్పుకుంటున్న కొందరు కిరాయి గూండాలు బాధితులను బెదరిస్తున్నారు. దేశవిదేశాల్లో 15 కంపెనీలను నెలకొల్పి ప్రజల నుంచి ఎనిమిది వేల కోట్ల రూపాయలు దండుకున్న నౌహీరా షేక్ చేతిలో మోసపోయిన చాలామంది ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె వర్గానికి చెందిన కొందరు బెదరింపులకు పాల్పడుతున్నారు. తాజా పరిణామాలు పోలీసుల దృష్టికి వచ్చాయి తమకు వచ్చిన వీడియో బెదరింపులను ఆధా రాలతో సహా బాధితులు పోలీసులకు అందిం చడంతో వారు అప్రమత్తమయ్యారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నౌహీరా సంస్థల్లో ఉగ్రవాదులు పెట్టుబడులున్నా యన్న ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ మోసాలు బయ టపడిన వెంటనే నౌహీరా షేక్‌ను హైదరాబాద్ పోలీసు లు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం బెయిల్‌పై రాగా పూణే పోలీసులు అరెస్టు చేసి రి మాండ్‌కు తరలించారు. ఆ తరువాత పీటీ వారెం ట్‌పై ఏపీ పోలీసులు నౌహీరా షేక్‌ను తీసుకొచ్చి చిత్తూ రు కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. నౌహీరా షేక్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు ఆ రాష్ట్ర పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

ఇదిలా ఉండగా దర్యాప్తు సంస్థలు బాధితులకు ధైర్యానిచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాయి. ఇందు నిమిత్తం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాయి.

సభను కాదని ... రోడ్ల వెంట తిరిగారు!

- జగన్ పాదయాత్ర బూటకం
- మంత్రి ఆనందబాబు ఎద్దేవా



అమరావతి, ఆంధ్రప్రభ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ముగించిన పాదయాత్ర బూటకమని, అది పాదయాత్ర కాదని, విహార యాత్ర అంటూ రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు ఎద్దేవా చేశారు. సచివాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, అధికార దాహంతో సీఎం కావాలని జగన్ కంటున్న కలలు కల్లలుగా మారుతాయన్నారు. పాదయాత్రను మార్నింగ్ వాక్, ఈవెనింగ్ వాక్‌లా చేయడం వల్ల ఆయన ఆరోగ్యంకు ఉపయోగపడటం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పాదయాత్ర అంటే రాష్ట్రంలోని పరిస్థితులను తెలుసుకోవడం, ప్రజలు ఇచ్చిన విజ్ఞప్తులను స్వీకరించి ఆయా శాఖలకు పంపి పరిష్కారానికి ప్రయత్నం చేయాలన్నారు. ఈ విధానాన్ని గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మీకోసం పాదయాత్రలో ఆవలంభించారన్నారు. అయితే, జగన్ పాదయాత్రలో విజ్ఞప్తులు ఇచ్చిన వారే లేరన్నారు. నోటి దురుసు, చంద్రబాబుపై విమర్శలు గుప్పించడానికే పాదయాత్ర చేశారనే విధంగా ఆయన ప్రసంగాలున్నాయన్నారు. పాదయాత్ర సమయంలో జగన్ రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయం గురించి, ప్రధాని మోడీ గురించి నిలదీశారా అంటూ ప్రశ్నించారు. ప్రజా సమస్యలను శాసనసభలో ప్రస్తావించకుండా రోడ్లవెంట తిరిగారని ఆరోపించారు. కేంద్రం సహకరించకపోయి నా చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. అయితే, విపక్ష నేత జగన్ మాత్రం అభివృద్ధికి సహకరించకపోగా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

జగన్ సీఎం అయితే రాక్షస రాజ్యమే..!

- ఏపీసీసీ ఉపాధ్యక్షుడు తులసి రెడ్డి

అమరావతి ఆంధ్రప్రభ : వైకాపా అధినేత జగన్ ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో రౌడీ రాజ్యం, రాక్షస రాజ్యం వస్తాయని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్. తులసిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన అధికారంలోకి వస్తే పేటకో రౌడీ తయారవుతారని అన్నారు. తనకు డబ్బుపై వ్యామోహం లేదని, ఒకసారి అధికారం లోకి వస్తే ముప్పయి ఏళ్ల పాటు ప్రజలకు మంచి చేయాలన్నదే తన ఆశయమంటు జగన్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కాకముందే జగన్ ఆర్థిక సామ్రాజ్యం బెంగుళూరు, కడప, హైద్రాబాద్, పులివెందుల, ఇడుపులుపాయ తదితర చోట్ల విస్తరించిందని తులసిరెడ్డి ఆరోపించారు. ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమన్న బిజెపితో లాలూచీ పడుతు, హోదాకు అడ్డుపడుతున్న కెసిఆర్‌తో చెట్టాపట్టాల్ వేసుకుని తిరగడం జగన్‌కే చెల్లిందని అన్నారు. తెలంగాణా సీఎం కెసిఆర్‌తో కలసి ప్రత్యేక హోదా సాధిస్తానని జగన్ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ స్వాధీనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశీ కరెన్సీ భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడుతోంది. సరైన ఆధారాలు చూపకుండా విదేశీ కరెన్సీని తీసుకెళ్తూ అధికారుల తనిఖీలో పట్టుబడుతున్నారు. బుధవారంనాడు కోటికి పైగా విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్న అధికారులు గురువారం నాడు దుబాయ్‌కి వెళ్తున్న నగరంలోని మెహిదీపట్నానికి చెందిన మహ్మద్ అలీ బేగ్ అనే ప్రయాణీకుడి నుంచి 40 లక్షల విలువైన విదేశీ కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రయాణీకుడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

వారం ముందే ఢిల్లీకి
సంక్రాంతి శోభ

• ఆటపాటలతో అలరించిన అతివలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వారం రోజుల ముందే దేశ రాజధాని ఢిల్లీకి సంక్రాంతి శోభ వచ్చింది. బొమ్మల కొలువు, గొబ్బెమ్మలు, భోగిపళ్లు, ముత్యాల ముగ్గులు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల నాట్యాలు, ఆడపడుచుల ఆటపాటలతో ఆంధ్ర వనితా మండలి కార్యాలయ ప్రాంగణం పచ్చని పల్లెను తలపించింది. ప్రతి ఏడాది వనితా మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలను ఘనంగా జరుపుతుంటారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 4 గంటల వరకు ఐటీవోలోని మండలి ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా చదువుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తెలుగు విద్యార్థులు ఇరవై మందికి ఒకొక్కరికి 5 వేలు, 4 వేలు, 3 వేల రూపాయల చొప్పున స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఉదయాన్నే మహిళలు అందమైన ముగ్గులు వేసి ఆవు పేడతో గొబ్బెమ్మలు పెట్టారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి హారతులిచ్చారు. వనితా మండలి ఉపాధ్యక్షురాలు కుసుమ ఆధ్వర్యంలో కార్యవర్గం, సభ్యులు పాడిన పాటలు, చేసిన నృత్యాలు అందరినీ అలరించారు. భేషజాలు లేకుండా చిన్నా, పెద్దా అందరూ ఎవరికి తగినట్టు వారు పల్లె పడుచులు, ఎంకీ నాయుడు బావ, హరిదాసు, గంగిరెద్దులు, వాటిని ఆడించే వారి వేషధారణలో తమ పాత్రలను పోషించారు. మన సంస్కృతి - సంప్రదాయాలు, పౌరాణిక గాథలను తెలియజెప్పేలా ఏర్పాటు చేసిన అందమైన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. అలాగే మహిళలకు - ముగ్గులకు అవినాభావ సంబంధం ఉంటుంది. పసందైన తెలుగు వంటకాలతో విందు భోజనం అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అపార్ట్‌మెంట్లు, ఇరుకు ఇళ్లలో కళ్లాపి జల్లి ముగ్గులు పెట్టే భాగ్యం లేకుండా పోయిందని వాపోయే మహిళలు, తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకున్నారు. చక్కని చుక్కల ముగ్గులు వేసి మురిసిపోయారు. ఈ పోటీల్లో విజేతలను మార్చి 8న మహిళా దినోత్సవం రోజున ప్రకటిస్తామని వనితా మండలి ఉపాధ్యక్షులు కుసుమ, గిరిజ, ప్రధాన కార్యదర్శి అనసూయ, సంయుక్త కార్యదర్శి పార్వతీరెడ్డి, కోశాధికారి సత్యవతి వెల్లడించారు.

సచివాలయంలో సంక్రాంతి సందడి

• ఉద్యోగుల ఆటల పోటీలు.. సందర్శకుల తాకిడితో కోలాహలం

అమరావతి, ఆంధ్రప్రభ : గత రెండు రోజులుగా వెలగపూడిలోని సచివాలయం, అసెంబ్లీ పరిసరాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఉద్యోగుల ఆటల పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధ, గురువారాల్లో మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నెలకొల్పాయి. వయస్సును, వారి వారి హోదాలను కూడా పక్కకు పెట్టి సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఉదయలక్ష్మి, ఇతర సచివాలయ మహిళా ఉద్యోగిణులు తెనాలి నియోజకవర్గం, కొల్లిపరక మండలం, తూములూరు శ్రీవెంకటేశ్వర ముద్దు ముదళీ కోలాటం బృందంతో కలిసి కోలాటంలో పాల్గొని కళాకారులను ప్రోత్సహించారు. సచివాలయ పరిసర ప్రాంతాల్లో మహిళా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముగ్గులపోటీలోని వివిధ రకాల ముగ్గులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే సచివాలయ ఉద్యోగులతో పాటు రాష్ట్ర అసెంబ్లీ మహిళా ఉద్యోగిణులు కూడా ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్సీ శమంతకమణి పాల్గొని మహిళను అభినందించారు. అసెంబ్లీ మాజీ కార్యదర్శి సత్యనారాయణ ఇత ఉన్నతాధికారులు ఉద్యోగుల ఆటల పోటీలను తిలకించారు. గత మూడు రోజులుగా సచివాలయాన్ని దాదాపుగా 8 వేల మందికిపైగా సందర్శించారు.

ఉద్యోగులకు వరుస సెలవులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి సంబరాలకు వారానికిపైగా సెలవులు వచ్చాయి. అలాగే వారం రోజులపాటు పాఠశాలలకు సెలవులు రావడంతో కుటుంబమంతా సరదాగా గడిపేందుకు మంచి అవకాశం దొరికింది. ఈనెల 12 నుంచి 20వ తేదీవరకు ఉద్యోగులకు వరుస సెలవులు ఇస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొన్న తరుణంలో ఇక ఉద్యోగులు కూడా తమ స్వస్థలాలకు వెళ్ళే అవకాశం రావడంతో పల్లెలన్నీ సంక్రాంతి సంబరాలతో వెలిగిపోను న్నాయి.సంక్రాంతి పండుగకు ఇచ్చే సాధారణ సెలవులకు తోడుగా ప్రభుత్వం అదనంగా మరో రెండు క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో ఉద్యోగులకు 9 రోజులపాటు సెలవులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలో రెండు ఆదివారాలు ఉద్యోగులు విధులు నిర్వహించారు. దీంతో సంక్రాంతి పండుగ రోజు అదనంగా ఒకరోజు సెలవు ఇస్తామని, మరో రెండు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు కాగా, 17, 18 తేదీల్లో ప్రత్యేక సీఎల్స్ మంజూరు చేయాలని నిర్ణయించింది. 19 శనివారం, 20 ఆదివారం కావడంతో మొత్తం 9 రోజులు ఉద్యోగులకు సెలవులు లభిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్రాంతి పండుగను అధికారికంగా నిర్వహించడంతో పాటు 9 రోజులు సెలవులు రావడం ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

జగన్‌కు నలుగురు మంత్రులతో పాటు
19 మంది ఎమ్మెల్యేల లేఖాస్త్రం

అమరావతి, ఆంధ్రప్రభ: రూ.43 వేల కోట్ల అవినీతి కేసుల్లో ఏ1 ముద్దాయిగా కోర్టుల చుట్టూ తిరుగుతున్న వైఎస్ జగన్ అవినీతి చక్రవర్తి అని రాష్ట్ర మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. ఈ మేరకు వైసీపీ నుంచి టీడీపీలో చేరిన రాష్ట్ర మంత్రులు ఆదినారాయణ రెడ్డి, సుజయకృష్ణ రంగారావు, అమర్‌నాథ్ రెడ్డి, భూమా అఖిలప్రియతోపాటు 19 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌కు గురువారం 23 ప్రశ్నలతో కూడిన ఒక బహిరంగలేఖను రాశారు. హోదా, విభజన హామీలను అమలు చేయకుండా కేంద్రం సహాయ నిరాకరణ చేస్తున్నా, నిధులను ఇవ్వకుండా అడ్డుపడుతున్నా మొక్కవోని ధైర్యంతో అభివృద్ధి, సంక్షేమాలే లక్ష్యాలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం శ్రమిస్తూ నవ్యాంధ్రను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కేవలం అధికా రకాంక్షతో రాజకీ య కుట్రలు చేస్తూ గవర్నర్ కార్యాల యం వేదికగా చంద్ర బాబు ప్రభుత్వాన్ని కూల్చివేస్తానని బహిరంగ ప్రకటన చేయడం తమను తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. ప్రజా సేవ చేయాలని రాజకీయాల్లోకి వస్తే జగన్ దుష్ట రాజకీ యాలతో క్రమ క్రమంగా ప్రజలకు దూరమవుతు న్నారన్నారు. దీనితో 23 మంది జగన్ నియంతృత్వ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వైసీపీ నుంచి బయటకు వచ్చామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మోడీని ప్రశ్నించకుండా, ప్రజ సమస్యను పట్టించుకోకుండా, కేవలం స్వార్థ పూరిత వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ పాదయాత్రను చేపట్టినట్లు ప్రజలు భావిస్తున్నారని తెలిపారు.

ఆతిథ్య రంగానికి
మరింత ప్రోత్సాహం

• పర్యాటక సదస్సుకు 50 మందికి పైగా పెట్టుబడిదారుల రాక
• ప్రభుత్వ విధివిధానాలను వివరించిన ఎండీ శుక్లా



అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లోని ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహికులు ముందుకొస్తుండగా.. ఇప్పటికే ఈ రంగంలోని వారు ఏపీలో కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు నిర్ణయించారు. రాష్ట్ర ఆతిథ్య రంగంలో పెట్టుబడి అవకాశాలపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ గురువారం విజయవాడలో సదస్సు నిర్వహించింది. సదస్సుకు ఏపీతో పాటు ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50మందికిపైగా పెట్టుబడిదారులు వచ్చి పలు సందేహాలను అధికారుల నుంచి నివృత్తి చేసుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, ప్రభుత్వ సహకారం వంటి అంశాలను ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా వారికి వివరించారు. రానున్న రోజుల్లో పర్యాటక పరంగా చేపట్టనున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు ప్రైవేటు వ్యక్తులకు ఉన్న అవకాశాలను వివరించారు. రానున్న రోజుల్లో పర్యాటక శాఖ మార్కెటింగ్ పైనే ప్రత్యేక దృష్టిసారించనుందని ఆయన వారికి వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో శుక్లా మాట్లాడుతూ భవిష్యత్ రోజుల్లో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక రంగాన్ని విస్తరించనున్నామన్నారు. హోటల్స్, సాహస క్రీడలు, గ్రామీణ పర్యాటకం వంటి అంశాల్లో ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించనున్నామన్నారు. ఇందులో భాగంగా సదస్సులో ప్రభుత్వపరంగా తాము ఇచ్చే సహకారం, ఆయా వ్యక్తులు, సంస్థలు చేసుకోవాల్సిన ఏర్పాట్లపై సవివరంగా చర్చించామన్నారు. అనేక మంది వద్ద భూములు ఉంటే పెట్టుబడి లేదని, పెట్టుబడి ఉన్న వారికి భూములు లేవని చెప్పారు. రెండూ వున్నా, అనేక మందికి అనుభవం లేక పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలోని విధివిధానాలను వారికి వివరించామన్నారు. గ్రామీణ పర్యాటకం అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని జిల్లా స్థాయిల్లో పెట్టుబడి దారులను గుర్తించి ప్రొత్సహించనున్నామ న్నారు. వి రిసార్ట్స్ సంస్థ ఈ ఏడాది ఐదు రిసార్టులను ప్రారంభించనుందని చెపుతూ వచ్చే ఏడాది వంద రిసార్టులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మినర్వా గ్రాండ్ మరో మూడు పట్టణాలకు తమ హోటల్ సేవలను విస్తరించేందుకు ముందుకు వచ్చిందన్నారు. వి రిసార్ట్స్ సీఈవో అదితి బల్బీర్ ఏపీలో తమ సంస్థ విస్తరణకు చేపట్టనున్న ప్రణాళికలను వివరించారు. మినర్వా గ్రాండ్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ హిమజానీ మాట్లాడుతూ పర్యాటక శాఖతోనే కాక ఇతర ప్రైవేటు భాగస్వాములను కలుపుకొని రాష్ట్రంలో తమ సేవలను విస్తరించనున్నామన్నారు.

నేటి నుంచి ఆహార పండుగలు

తెలుగు వంటకాల ప్రాచుర్యాన్ని పర్యాటకులకు పరిచయం చేసేందుకు శుక్రవారం నుంచి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఆహార పండుగలను నిర్వహించనున్నామని ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఈనెల 11 నుంచి 24 వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో తిరుపతి మానస్ సరోవర్ హోటల్, కాకినాడ వ ుహా ం ద్రా మిఠాయి వాలాలో వారం రోజుల పాటు ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు. అత్యంత పోషకాలతో కూడిన ఆంధ్రా వంటలను పర్యాటకులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. విజయవాడలో జరిగే కార్యక్రమంలో పర్యాటక కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, చైర్మన్ ఆచార్య జయరామిరెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు.

కోటప్పకొండలో హిల్ ఫెస్టివల్

స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో హిల్‌ఫెస్టివల్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర శాసన సభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ తెలియజేశారు. గురువారం గుంటూరులో కలెక్టర్ కోన శశిధర్‌తో కలిసి గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అడవులు, మొక్కలు, కొండల గొప్పదనం చాటిచెప్పేందుకు దేశ చరిత్రలోనే తొలిసారిగా హిల్ ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జనవరి 19వ తేదిన భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొండ పండుగను ప్రారంభిస్తారని, 20న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, 21న ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. ఈ వేడుకల నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, కొండపై చెరువు ఆధునీకరణతోపాటు టూరిజం కాంప్లెక్స్, వ్యూ పాయింట్, ఆక్వేరియం, రోప్ వే, మ్యూజియం, నెమళ్లు, జింకల పార్క్, వన విహారి తదితర అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. వేడుకల సమయంలో పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, జీవరాశులను కాపాడడం, కాలుష్యాన్ని నివారించడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు

సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం

• షెడ్యూల్ వెలువడే లోగా పొత్తులపై నిర్ణయం
• కాంగ్రెస్ వార్ రూమ్ మీటింగ్‌లో ఏపీ, తెలంగాణా నేతలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని అధిష్టానం సూచించిందని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. ఢిల్లీలో కాంగ్రెస్ వార్ రూమ్‌లో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో బూత్ స్థాయి నుంచి అన్ని కమిటీలను వెంటనే పూర్తి చేయాలని అధిష్టానం ఆదేశించిందని సమావేశం అనంతరం రఘువీరారెడ్డి చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోపు మేనిఫెస్టో రూపకల్పన, అభ్యర్థుల ఖరారు కూడా చేయాలని అధిష్ఠానం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఏపీలో తెదేపాతో కాంగ్రెస్ పొత్తు ఉంటుందా లేదా అన్నది తెలుస్తుందని... ఇప్పటివరకైతే పొత్తుపై ఎలాంటి స్పష్టతా లేదని రఘువీరా రెడ్డి వివరించారు.

ఓటమితోకుంగిపోం ...
లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతాం : తెలంగాణా నేతలు

కాంగ్రెస్ కోర్ కమిటీ అన్ని రాష్ట్రాల పీసీసీలతో సార్వత్రిక ఎన్నికలపై చర్చిస్తోందని టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం మళ్లీ చేపట్టి సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని అధిష్టానం సూచించిందని చెప్పారు. బూత్ కమిటీలు, ప్రచార కమిటీలు మళ్లీ వేసుకుని యుద్ధానికి సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపునివ్వాలని పార్టీ పెద్దలు చెప్పారని పొన్నం అన్నారు.

అమరావతి వర్ణచిత్రాలకు
ప్రశంసల వర్షం

• ఆవిష్కరించిన సింగపూర్ హై కమిషనర్



అమరావతి, ఆంధ్రప్రభ : నవాంధ్ర రాజధాని అమరావతి గ్రామాల అందచందాలు, ప్రాకృతిక సౌందర్యాలను బంధించిన వర్ణచిత్రాలు అపురూపంగా ఉన్నాయని భారత్‌లో సింగపూర్ హై కమిషనర్ లింతున్‌కున్ అన్నారు. గురువారం విజయవాడలోని కల్చరల్ సెంటర్ అమరావతిలో ఆర్చస్ స్కెచర్స్ సింగపూర్‌కు చెందిన 26 మంది చిత్రకారులు గీసిన చిత్రాల ప్రదర్శనను లింతున్‌కున్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ జీవన విధానానికి, సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పడుతున్నాయని ప్రశంసించారు. రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాలకు చెందిన 90కి పైగా దృశ్యాలను ఈ చిత్రాల్లో ఇమిడ్చిన చిత్రకారులను ఆయన అభినందించారు. ఈ చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేయడానికి సహకరించిన కల్చరల్ సెంటర్ చైర్మన్ వై.హరిచంద్రప్రసాద్, సీఈవో ఈమని శివనాగిరెడ్డిలను లింతున్‌కున్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖకు చెందిన అమరావతి భాగస్వా సంచాలకులు ఎరిక్‌టన్‌తో పాటు పలువురు చిత్రకారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పంటలతోనే
సంపూర్ణ ఆరోగ్యం

• ఎన్జీ రంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ : నాణ్యమైన ఆహారపు పంటలతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వల్లభనేని దామోదర్ నాయుడు తెలియజేశారు. గురువారం గుంటూరులో నిర్వహించిన పోషణకై సమగ్ర వ్యవసాయం అనేక అంశంపై రాష్ట్రస్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 35 శాతం పిల్లలు, 50 శాతం మహిళలు పోషకాలలేమితో బాధపడుతున్నట్లు ఆరోగ్య నిపుణుల సర్వేలో తెలిందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్, డాక్టర్ నార్మన్ బోర్లాగ్‌లు చేసిన కృషి ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సంవృద్ధిని సాధించగలిగామని గుర్తు చేశారు. కానీ నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహార ధాన్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినపుడే వారి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడగలమన్నారు. దీనికోసం సాగులో విప్లవాత్మకమైన మార్పులు అవసరమని, ఈ దిశగా ఎన్‌జీ రంగా అగ్రి విశ్వవిద్యాలయం అడుగులు వేస్తూ కృషి విజ్ఞాన కేంద్రాలు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, సమగ్ర వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తూ రైతులను చైతన్యవంతం చేయడం జరుగుతోందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను అందించే ప్రకృతి సేద్యం, సేంద్రీయ సేద్యం దిశగా రైతులకు తగిన శిక్షణలను, అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష మేరకు పోషక విలువలతో కూడిన ఆహార పంటలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ దిశగా మార్చేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ ఉన్నతాధికారులు రాంబాబు, వరదరాజుల నాయుడు, ఉమాదేవి, భవానీ, విజయాభినందన, అనురాధ, గోపికృష్ణ, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

10 శాతానికి ఎవరు అర్హులు?

• ఎంతమందికి వార్షికాదాయం రూ.8 లక్షలు ? • వెయ్యి గజాల స్థలం ఉన్న ధనికులెంత మంది ? • పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల కోసం అగ్రవర్ణాల ఆందోళనలు • గతంలో మరాఠాలకు 16 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన మహారాష్ట్ర

న్యూఢిల్లీ: అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించడానికి వీలు కల్పిస్తూ ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుకి అటు లోక్‌సభలో, ఇటు రాజ్యసభలో ఆమోదముద్ర పడింది. ఇక రాష్ట్రపతి సంతకమే తరువాయిగా ఉన్న నేపథ్యంలో ఈ రిజర్వేషన్లకు ఎవరు అర్హులు అవుతారు? ఎవరు కారు అనే వివరాలు ఆసక్తికరంగా మారాయి. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు ఇప్పటికే ఉన్న యాభైశాతం రిజర్వేషన్లకు అదనంగా ఈ అగ్ర వర్ణ పేదలకు కేటాయించిన పది శాతంతో మొత్తం రిజర్వేషన్ల శాతం అరవై శాతానికి చేరుకుంది. ఈ పదిశాతం రిజర్వేషన్లతో హిందువులు, ఇతర మతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు లబ్ధిపొందుతాయి. హిందువుల్లో బ్రాహ్మణులు, రాజపుత్రులు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, వైశ్యులు, పటేళ్లు, గుజ్జర్లు, కాపులు, కమ్మలు, రెడ్డి తదితర సామాజిక వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ పదిశాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

పదిశాతం కోటాకి ప్రామాణికం ఏదీ?

కుటుంబ ఆదాయం, భూమినే కొలమానంగా ఆర్థిక వెనుకబాటుతనాన్ని గుర్తించి ఈ పది శాతం రిజర్వేషన్లను వర్తింప చేయనున్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల కన్నా తక్కువ ఉన్నవారు, వ్యవసాయ భూమి అయిదు ఎకరాలు మించని వారు ఈ రిజర్వేషన్లకు అర్హులవుతారు.

వార్షిక ఆదాయం రూ.8 లక్షలు అంటే నెలకు రూ.66,666 ఆదాయం ఉన్నవారు ఈ రిజర్వేషన్ల పరిధిలోకి వస్తారు. 2011-12 నాటి కుటుంబ వినియోగ వ్యయం సూచీకల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం రూ.4,481, పట్టణ ప్రాంతాల్లో రూ.10,280గా ఉంది. దీని ప్రకారం ఇంట్లో అయిదుగురు ఉండి వారంతా సంపాదిస్తున్నప్పటికీ వార్షిక ఆదాయం రూ.51,405 మించదు. ఇలా అయినప్పటికీ తాజా రిజర్వేషన్లకు ఆదాయ పరిమితి కన్నా ఇంకా తక్కువగానే ఉంటుంది. పైగా 2011 నాటి సాంఘిక, ఆర్థిక, సామాజిక జనాభా గణనలో కూడా గ్రామీణ కుటుంబాల్లో కేవలం 8.25 శాతం మాత్రమే నెలకు రూ.10 వేల ఆదాయం దాటుతోంది. అదే విధంగా 2015-16 వ్యవసాయ గణనలో కూడా దేశంలో అయిదు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్న రైతులు 86 శాతం మంది ఉన్నారు. వీరంతా ఈ పది శాతం రిజర్వేషన్లకు అర్హులవుతారు.



☛ అయితే తాజా బిల్లు ప్రకారం వెయ్యి చదరపు అడుగుల కన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్నవారికి ఈ రిజర్వేషన్లు వర్తించవు. ఇలాంటి వారు దేశ జనాభాలో 20 శాతం కూడా ఉండకపోవచ్చని తెలుస్తోంది.

☛ దేశంలో ఇరవై శాతం సంపన్నుల ఇంటి స్థలం 500 చదరపు అడుగులు మించదని నేషనల్ శాంపిల్ సర్వే నివేదిక వెల్లడిస్తోంది.

☛ ఇదే కాకుండా నోటిఫై చేసిన మున్సిపాలిటీల్లో 100 గజాల కన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్నవారు, నోటిఫై చేయని మున్సిపాలిటీల్లో 200 గజాల కన్నా ఎక్కువ ఇంటి స్థలం ఉన్న వారు ఈ రిజర్వేషన్లకు అర్హులు కారు.

☛ ఇక ఇప్పటికే సామాజిక వెనుకబాటు ఆధారంగా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల లబ్ధి పొందుతున్నవారు కూడా తాజా 10 శాతం రిజర్వేషన్లకు అర్హులు కారు.

ఇక్కడే మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వస్తోంది. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల కారణంగా జనాభాలో అత్యధికులు లబ్ధి పొందుతున్నారు. ఓబీసీల జనాభా 45 శాతం ఉండగా, ఎస్సీ, ఎస్టీల జనాభా 23 శాతం ఉంది. దీని ప్రకారం పది శాతం రిజర్వేషన్లు కేవలం 27 నుంచి 27 శాతం ప్రజలకు మాత్రమే అందుబాటులోకి వస్తాయి.

పదిశాతం రిజర్వేషన్ బిల్లు ఏం చెబుతోంది?

దేశంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఉన్నత విద్యకు, ప్రభుత్వ ఉద్యోగాలకు దూరంగా ఉంటున్నారని బిల్లులో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 124వ అధికరణకు చేసిన సవరణల ప్రకారం రాజ్యాంగం కల్పించిన సమాన అవకాశాలకు ఈ వర్గాలు దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అందుకనే పేదలు కూడా జీవితంలో మంచి అవకాశాలు పొందాలనే రాజ్యాంగ సవరణ చేస్తున్నట్లు ఆ బిల్లులో పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మరాఠాలు, జాట్లు, రాజపుత్రులు వంటి పలుబడి ఉన్న సామాజిక వర్గాలు రిజర్వేషన్ల కోసం వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహించాయి. రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం కోసం హింసాత్మక ఘటనలకు కారణమయ్యారు. వీరి డిమాండ్లు నెరవేర్చడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీల్లో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాయి. అయితే రాష్ట్ర అసంబ్లె తీర్మానాలు కోర్టుల్లో వీగిపోతూ వచ్చాయి. గతంలో ఇంద్ర శైని కేసులో రిజర్వేషన్లు యాభై శాతం మించరాదని సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పు అగ్ర వర్ణాల్లో పేదల ఆకాంక్షలకు అడ్డుగా నిలిచింది. గత ఏడాది నవంబర్‌లో మహరాష్ట్ర ప్రభుత్వం మాత్రం మరాఠాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వారిగా గుర్తించి 16 శాతం రిజర్వేషన్లను ప్రకటించింది.

క్రీడాప్రభ

పాండ్యా, రాహుల్‌లపై నిషేధం నీడలు



న్యూఢిల్లీ: కాఫీ విత్ కరణ్ టీవీ ప్రదర్శ నలో వివాదాస్పద వ్యాఖ్యలతో బీసీసీఐ షోకాజ్ నోటీసులను అందుకున్న భారత క్రికెటర్లు హార్దిక్ పాండ్యా, రాహుల్‌లు రెండు వన్డేల నిషేధాన్ని విధించా లని సీవోఏ ఛైర్మన్ వినోద్ రాయ్ సూచించాడు. కాగా సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ వీరిపై విచారణ జరపాలని బీసీసీఐ లీగల్ సెల్‌కు సిఫారసు చేసింది. ఒకవేళ నిషేధాన్ని విధిస్తే.. ఆస్ట్రేలియాతో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో రెండు వన్డేలు వీరు మిస్సవుతారు. శనివారం సిడ్నీలో తొలి వన్డే మ్యాచ్ జరుగనుంది. పాండ్యా వివరణతో నేను సంతృప్తి పడలేదు. వీరిద్దరిపై రెండు మ్యాచుల నిషేధాన్ని విధించాలని సిఫార సు చేస్తున్నాను. అయితే తుది నిర్ణయం కమిటీ సభ్యురాలు డయానా ఎడుల్జీ అంగీకరిస్తేనే ఈ నిషేధం అమల్లోకి వస్తుంది అని వినోద్ రాయ్ గురువారం మీడియాకు తెలిపాడు. ప్రముఖ చిత్ర నిర్మాత కరణ్ జోహార్ హోస్ట్‌గా వ్యవహరించే కాఫీ విత్ కరణ్ టీవీ షోలో 25 ఏళ్ల ఆల్ రౌండర్ పాండ్యా, బ్యాట్స్‌మన్ కెఎల్ రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండ్యా మహిళలతో తన వ్యక్తిగత సంబంధాలు, తన శృంగార వాంఛలు తీర్చుకు న్న సందర్భాలను వివరించా డు. అనంతరం పాండ్యా వైఖరిపై విమర్శలు రావడంతో.. క్షమాపణలు కోరుతూ.. కాఫీ విత్ కరణ్ షోలో నా వ్యాఖ్యల వల్ల బాధపడిన వారం దరిని క్షమించమని కోరుతున్నాను. అని ట్వీట్ చేశాడు. ఈ ఇంట ర్వ్యూలో రాహుల్ దూరంగా ఉన్నా డు. బీసీసీఐ ఇచ్చిన షోకా జ్ నోటీసులకు 24గంటలు గడువున్నప్పటికి.. వీరు వెంటన్ స్పందించారు. చాట్ షో లో నా వ్యాఖ్యలు వీక్ష కుల మనోభా వాలను దెబ్బతీ స్తాయ నుకో లేదు. దీనికి నేను మనస్ఫూర్తిగా విచారాన్ని వ్యక్తం చేస్తున్నాను అని బీసీసీఐ కిచ్చిన వివరణలో తెలిపాడు. ఆ వ్యాఖ్యలు చేయడం వెనక ఎలాంటి దుర ద్దేశం లేదు. ఎవరి మనోభా వాలను కించపర్చా లను కోలేదు. ఇటు వంటి ఘటనలు మళ్లీ పునరావృతం కావని మీకు హామీఇస్తున్నానని తెలిపాడు. డయానా లీగల్ అభిప్రాయాన్ని కోరింది. ఆమె ఆమోదిస్తేనే వీరిపై నిషేధం అమలవుతుంది. నా మటుకు ఈవి ధంగా హీనం గా మాట్లాడటం తప్పుగా అనుకుం టున్నాను అని వినోద్ రాయ్ చెప్పాడు. డయానా బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా, తాత్కాలిక కార్య దర్శి అమితాబ్ చౌదరీ, ట్రెజరర్ అనురుద్ చౌద రీల అభిప్రా యాన్ని కోరింది. అనిరుద్ ఈ విషయంపై స్పందిస్తూ.. పాం డ్యా, రాహుల్‌లను వెంటనే నిషేధిం చాల న్నాడు. ఒక వినోద కార్యాక్రమంలో బీసీసీఐ కాంట్రా క్టు నిబం ధనలు ఉల్లంఘించి పాల్గొ నటంపై దర్యాప్తు జర పాలని డిమాండ్ చేశాడు. ఆటగాళ్లు మహిళలతో సంబంధాలు వెల్లడించడంతో మ్యాచ్ ఫిక్సర్లు, బుకీలు ఇటువం టివారిని తేలిక గా తమకు అను కూలంగా మార్చుకుం టారన్నాడు.





వరల్డ్ నెం.1 మేరీకోమ్

ఏఐబీఏ తాజా ర్యాంకులు వెల్లడి

న్యూఢిల్లీ: మహిళా బాక్సింగ్ దిగ్గజం ఎంసి మేరీకోమ్ అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఏఐబీఏ) తాజా ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నెంబర్ వన్‌గా నిలిచింది. గురువారం ఏఐబీఏ ప్రపంచ బాక్సర్ల తాజా ర్యాంకులను విడుదల చేసింది. 2018 నవంబర్ న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ చాంపియ న్‌షిప్స్‌లో మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్ 48 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి ఈ పోటీల్లో వరుస గా ఆరు సార్లు గెలిచిన తొలి మహిళా బాక్సర్‌గా నిలిచింది. ఏఐబీఏ తాజా ర్యాంకిగుల్లో మేరీ 1700 పాయింట్లతో అగ్రభాగాన నిలిచింది. 36 ఏళ్ల మేరీకోమ్ 2020 ఒలింపిక్స్‌లో 48 కిలోల విభాగాన్ని చేర్చకపో వడంతో 51 కిలోల విభాగం లో బరిలోకి దిగనుం ది. ముగ్గురు పి ల్లల తల్లి మేరీకోమ్ 2018 ఏడాదిని అద్భుత ప్రదర్శనతో ముగిం చింది. కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకంతోపాటు పోలండ్ లో జరి గిన పోటీల్లో కూడా బంగారు పతకాన్ని గెలుచు కుంది. బల్గేరి యాలో జరిగిన స్ట్రాండ్జా మెమోరి యల్ టోర్నీ లో మేరీ రజతాన్ని అందు కుంది. ఏఐబీఏ ర్యాం కుల్లో భార త్‌కు చెందిన పింకి జాంగ్రా 51 కిలోల విభాగం ర్యాం కుల్లో 8వ ర్యాంకులో ఉండగా, ఆసియా క్రీడల్లో రజత పతక విజేత మనీషా మౌన్ 54 కిలోల విభాగంలో 8వ ర్యాంకులోనే ఉంది. 2016 వరల్డ్ చాంపియ న్‌షిప్స్‌లో రజత పతక విజేత సోనియా లాథెర్ 2018లో అంతగా రాణించనప్పటికి 57 కిలోల విభాగంలో రెండో స్థానంలో ఉంది. ఆసియా క్రీడల్లో కూడా సోనియాకు పతకం రాలేదు. 2018 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో 64 కిలోల విభాగంలో కాంస్యం గెలిచిన సిమ్రన్‌జిత్ కౌర్ తన విభాగంలో నాలుగో స్థానంలో ఉంది. సిమ్రన్ కొన్ని రోజుల క్రితం జరిగిన జాతీయ బాక్సింగ్‌లో చాంపియ న్‌గా నిలిచింది. సరితాదేవి 16వ స్థానంలో ఉంది. లవ్‌లీనా బోర్గోహెయిన్ 69 కిలోల విభాగంలో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల బాక్సింగ్ ర్యాంకులను ఏఐబీఏ అప్‌డేట్ చేయలేదు.





భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటన

బెంగళూరు వేదికగా తొలి టీ20 మ్యాచ్

న్యూఢిల్లీ: భారత్‌లో ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 24న ఆడే తొలి టీ20 మ్యాచ్‌కు బెంగళూరు వేదిక కానుంది. రెండో టీ 20 విశాఖపట్టణంలో ఫిబ్రవరి 27న జరు గనుంది. భారత పర్యటనలో ఆస్ట్రేలి యా రెండు టీ20 లు, ఐదు వన్డేలు ఆడనుంది. గురువారం ఆసీస్ పర్యటన వివరా లను బీసీసీఐ మీడియాకు వెల్లడించింది. మార్చి 2న జరిగే తొలి వన్డే హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జా తీ య స్టేడియం ఆతిథ్య మివ్వ నుండగా, మార్చి 5న రెడో వన్డే నాగపూర్‌లో, మార్చి 8న మూడో వన్డే రాంచిలో, మార్చి 10న నాలుగో వన్డే మొహాలీలో. మార్చి 13న ఐదో వన్డే న్యూఢిల్లీలో జరుగనుంది. టీ20 మ్యాచ్‌లు నైట్ మ్యాచ్‌లుగా సాగుతాయి. ఇవి రాత్రి 7గంటలకు ప్రారంభమవుతాయి. వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లుగా సాగుతాయి. ఇవి మధ్యాహ్నం 1.30గంటలకు ప్రారంభమ వుతాయని బీసీసీఐ తన ప్రకటనలో తెలిపింది. ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాకు ఇది చివరి పర్యటన. ప్రపంచకప్ మే 30న ప్రారంభం కానుంది. కాగా భారతదేశం ప్రపంచకప్‌కు ముందు దేశంలో జింబాబ్వేతో.. అనంతరం ఐపీఎల్‌ను ఆడనుంది.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
L ively
I nteraction
F or
E ver
లైఫ్
శుక్రవారం 11 జనవరి 2019



సంక్రాంతి వర్ణ శోభితవై..!

సంక్రాంతి పాడిపంటలతో వస్తుంది....

ఇంటింటికీ కొత్తకళ తెస్తుంది...

రంగవల్లులతో, హరిదాసు కీర్తనలతో, గంగిరెద్దుల నాట్యంతో...

నేనొచ్చానంటూ తన ఉనికిని చాటుతుంది...

సంక్రాంతి వర్ణశోభితంగా అందంగా వస్తుంది...

అవును...సంక్రాంతి రోజుల్లో ప్రత్యేకంగా కనిపించే రంగులు...చాలా ఉంటాయి.

సంక్రాంతిలక్ష్మి ధరించి వచ్చే వర్ణాలివే...

వీటిని ఎంపిక చేసుకుంటే...మనం పండుగ ముస్తాబు చేసుకున్నట్టుగా కాదు...

పండుగకే మనం ముస్తాబు చేసినట్టుగా ఉంటుంది మరి

- వి. దుర్గాంబ

జీవమొలికే ఆకుపచ్చ జీవితాన్నిచ్చే రంగు... పంటరంగు చీరతో ఇల్లంతా పచ్చని తోరణాలు కడదాం సంక్రాంతి లక్ష్మికి స్వాగతం చెబుదాం

పులుపు తీపి కలయికల రేగిపళ్లు పిల్లల తలపై మురిపెంగా జారతాయి భోగిపళ్లుగా.. అదేరంగుని ధరించి....ఆశీస్సులిద్దాం కుటుంబంలో ఆప్యాయతని రంగరిద్దాం

రంగులొలికిన ముగ్గు రమణీయత కంటికి ఇంపు ఇంటికి సొంపు ఎన్నెన్నో వర్ణాల మేళవింపైన మల్టీ రంగుల చీరలో భిన్న నైపుణ్యాలు చాటుదాం

సుకుమారమైన బంతిపూల సొగసు గుమ్మాలకు కడితే మాలలు అక్కడే ఊగుతుంది మన మనసు బంతి వర్ణం చీరతో గడపకు పసుపు రాద్దాం

మెలికల ముగ్గువేయనిదే సంక్రాంతికి స్వాగతం చెప్పినట్టు కాదు జీవితం మలుపుల్లాగే ఉన్న ఆ ముగ్గులేసిన చీర కట్టి చెబుదాం...గట్టివాళ్లమని

పాలుపొంగినట్టే సిరులు పొంగుతాయని... తెలుపురంగు చీరలో ధవళ వర్ణ శోభితలై... పండుగ స్వచ్ఛతకు, పాపల పోషణకు అంకితమవుదాం

చెరుకుగడల తీపి పైకి కఠినమైనా లోలోపల రుచులూరు రసాలు చెరుకు మెరుపు రంగుల్లో మంచి మనసుతో మెరిసి మురిసిపోదాం

* రంగవల్లిక *



11 చుక్కలు 6 వచ్చేవరకు మధ్యచుక్క

మీరూ ముగ్గులు పంపొచ్చు



డి. కల్యాణి, జనగాం

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75,
రోడ్ నెం:9, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-28
lifepage2012@gmail.com

ఇదే మేటి ప్రపంచ యాత్ర!



టీ వ్యాపారంతో 23 దేశాలు చుట్టివచ్చిన దంపతులు

వీళ్లే కోటీశ్వరులు అన్న మహీంద్రా గ్రూప్ చైర్మన్

ఆశయం బలంగా ఉంటే...దానిముందు ఎలాంటి ఆటంకాలు పనిచేయవు. కేరళలోని కొచ్చికి చెందిన విజయన్ దంపతులకు ఇది బాగా వర్తిస్తుంది. పెద్దకలలు కనండి...వాటిని సాకారం చేసుకోండి... అనేమాట వీరికి బాగా వర్తిస్తుంది. 'మనమా విదేశీ ప్రయాణమా...ఎలా చేయగలం...' అని పెదవి విరిచే సగటు మధ్యతరగతి మనుషులు విజయన్ దంపతులను గురించి తెలుసుకుని తీరాలి. వీరిద్దరూ ఇప్పటివరకు 23దేశాలు తిరిగి వచ్చారు. ఎలా సాధ్యమైంది...అనేది చాలా విచిత్రమే. అలాంటి ఆశ్చర్యాన్నే వ్యక్తం చేసిన...మహీంద్రా గ్రూపు ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా...వారి సంపద అంతా...వారు జీవితాన్ని చూసే విధానమే ఉందన్నారు. ఈసారి కొచ్చికి వెళ్లినప్పుడు తప్పకుండా విజయన్ టీస్టాల్‌కి వెళతానని...టీ తాగి... విదేశీ ప్రయాణాల్లో వారు సేకరించి...షాపులో ఉంచిన బిల్లులు వగైరాలను చూస్తానని ఆయన ట్విట్టర్లో పేర్కొన్నారు. ఫోర్బ్స్ పత్రిక పేర్కొనే అత్యంత ధనవంతుల లిస్టులో ఉన్నవారు ధనవంతులు కాదని, తన దృష్టిలో వీరే ధనవంతులంటూ ఆనంద్ మహీంద్రా తన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఒక ట్రావెల్ బ్లాగర్ రూపొందించిన విజయన్ దంపతుల వీడియోని... తిరిగి ట్వీట్ చేస్తూ...ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు.

జీవితమంటే పెద్ద భవంతులు, బ్యాంక్ బ్యాలన్సులు, విలాసాలు...లాంటి మూసధోరణే కాదని...మనకు నచ్చినట్టుగా జీవితాన్ని డిజైన్ చేసుకోవచ్చని విజయన్ దంపతులు నిరూపించారు. వీరు ప్రతిసారీ ప్రయాణం ప్లాన్ చేసుకున్నపుడు బ్యాంకునుండి రుణం తీసుకుంటారు. తిరిగి వచ్చాక దాదాపు మూడేళ్లపాటు కష్టపడి బ్యాంకు అప్పుని తీరుస్తుంటారు. అన్నిదేశాలకు సంబంధించిన పోస్టర్లను తమ స్టాల్లో గోడలకు తగిస్తుంటారు. అన్ని దేశాలకు సంబంధించిన బిల్లులను కూడా ప్రదర్శనకు ఉంచుతున్నారు.

మనపై మనకున్న జాలే ఆపుతుంది

విజయన్, మోహన ఇద్దరి వయసు ఇప్పుడు దాదాపు 70ఏళ్లు. 45ఏళ్ల క్రితం వారి వివాహం అయింది. విజయన్ భార్య మోహన పెళ్లికాకముందు ఆమె సొంతఊరు ఎర్నాకులంని కూడా దాటి ఎరుగదు. తరువాత భర్తతో కలిసి లండన్, ఈజిప్టు, జోర్డాన్, ప్యారిస్, స్విట్జర్లాండ్, వెనిస్, సింగపూర్ తదితరదేశాలు ప్రయాణించింది. 'విదేశాలను చూసిరావాలంటే ఒక తోడు అవసరం..అంతేకాదు ఆ వ్యక్తికి మన మనసు అర్థమై ఉండాలి...నా భార్య నాకు అలాంటి తోడుగా నిలిచింది... ఆమే నా శక్తికి మూలం' అంటారు విజయన్. వివిధ దేశాలు తిరిగి రావాలనే ఆశ ఉన్నా...మనకంత శక్తిలేదు కదా...అనే స్వీయజాలితో చాలామంది ఆ ప్రయత్నం చేయలేరంటారు ఆయన. ప్రయాణాల్లో ఇతరులు వంద అయిదువందల డాలర్ల నోట్లను మార్చుకుంటూ ఉంటే...తాను ఐదు పది డాలర్ల నోట్లను మారుస్తుంటానంటారు విజయన్.

రోజుకి 300రూ.ల పొదుపుతో...

విజయన్‌కి చిన్నప్పటినుండీ జీవితంలో ఉన్న ఏకైక కోరిక ప్రపంచమంతా చూడాలని. కానీ ఇది చిన్న కోరికకాదని ఆయనకూ తెలుసు. ఎందుకంటే ప్రపంచమంతా విలాసంగా ప్రయాణం చేయాలంటే కోరిక మాత్రమే ఉంటే చాలదు. బాగా ధనవంతులై ఉండాలి. కానీ విజయన్ చేస్తున్నది టీ వ్యాపారం. కొచ్చిలో సెంటర్‌లో శ్రీ బాలాజీ కాఫీ హౌస్‌ని నడుపుతున్నారు ఈ దంపతులు. రోజంతా కష్టపడితే వారు రోజుకి మొత్తం ఖర్చులు పోను 300 వందల రూపాయల చొప్పున పొదుపు చేయగలుగుతారు. మరి ఇంత చిన్న సంపాదన మీద అంత పెద్ద కలని ఎలా నిజం చేసుకోగలుతున్నారు...వీరి షాపులో ఇతర పనివాళ్లంటూ ఉండరు. వాళ్లే మొత్తం పనులు చేస్తారు. తమ ఖర్చులను చాలా వరకు తగ్గించుకుని బతకటం అలవాటు చేసుకున్నారు.

అనుకుంటే...అవుతుంది

అందరూ మిమ్మల్ని పిచ్చివాళ్లుగా భావించడం లేదా...అంటే అవునంటూనే...అందరికీ ఏదోఒక పిచ్చి ఉంటుందంటారు. నిరంతరం ఎగసిపడే సముద్రపు అలల్లాగే జీవితంలో ఏవీ ఆగవని చెబుతారు. ఇప్పటివరకు ప్రయాణంపై ఖర్చుపెట్టిన 10-15 లక్షల డబ్బుతో ఎన్నో ఆస్తులు కొనుక్కుని ఉండవచ్చు కదా...అంటే...తనకు తన ప్రయాణ అనుభవాలు, ప్రయాణాల ద్వారా పొందిన విజ్ఞానమే ఆస్తులు అంటున్నారు విజయన్. 'ఏదైతే మనం నిరంతరం మనకు మనం చెప్పుకుంటూ ఉంటామో...అది సాధ్యమై తీరుతుంది'...అంటూ తమ విజయరహస్యం వెల్లడించారు.

సనాతన వాఙ్మయంలో అనర్ఘ రత్నం


ఎన్ని కంఠాలు పఠించినా, ఎన్ని కలాలు వ్యాఖ్యానం చిందించినా, ఎన్ని ప్రవచనాలు ప్రవహించినా, ఎన్ని భాష్యాలు వినిపించినా, గంగ వలె, గోవు వలె, అతి పవిత్ర గీత భగవద్గీత! సమస్త ప్రపంచానికి శ్రీకృష్ణుడందించిన శాస్త్ర సర్వస్వం భగవద్గీత! అధ్యాత్మ సాధకుడికది కరదీపిక. చదువుతున్న కొద్దీ నూతన కోణాలను ఆవిష్కరించే జ్ఞాన భాండాగారం. వస్తుంది.

దేహమే 'అసలు నీవు' కానపుడు, నీవు కర్తవూ కాదు, నీకు కర్తృ త్వమూ లేదు. జరుగుతున్న అనేక విషయాలలో నీ ప్రమేయం నిజానికి శూన్యం. ఉన్నదంతా అనుకోవటంలోనే ఉన్నది, అటువంటి భావనే కర్మ యోగం. కర్మలన్నిటికీ నీవు కర్తవు కాదు. కర్మలు జరుగుతూనే వుంటయ్. కనుక, ఆత్మకు చూడటం అంటూ లేదు. ఉండటమే! అదీ సాక్షిగా.

'నేను చేస్తున్నాను' అనే కర్తృత్వభావం ఉన్నంతకాలం, అది కర్మే!

ఆ భావం నశించి కర్మలు జరుగుతుంటే అదే కర్మయోగం.

భగవంతుని పట్ల ఉండే తీవ్ర ఆవేశము, ఉద్విగ్నము, తాదాత్మ్యము కలిస్తే అది భక్తి. నిర్మలము, నిశ్చలము, అరుణము, నికామము కలిగిన భక్తి భావమే భక్తియోగం.



ఆత్మానుభవంతో జీవన్ముక్తుడై, సహజ స్థితిలో స్వాత్మానందుడై, జ్ఞానమే సాకారమైన వ్యక్తి భగవద్గీతను అరచేతిలో ఆమలకంగా అందిస్తే? అందుకోగలిగిన వాడికి అది, ఒక అపురూప ఫలం! అదొక రమణీయ గీతం! ఆ పాత మధుర సంగీతం!

'జననమరణాలు, భూత భవిష్యత్ వర్తమానాలు అనే విభజన మనం చేసుకున్నదే. కాలం అఖండం!

నీవు, నేను అన్న ద్వైతం, మనం అనుకుంటున్నదే!

అపరిణామము, కాలాద్యవిచ్ఛిన్నమైన సత్యమే శాశ్వతం. అది మార్పెరగనిది.

బంధము, బంధన, ముక్తి దేహానికేగాని ఆత్మకు లేవు.

అభ్యాసం ఒక నిరంతర ప్రక్రియ.

వైరాగ్యం ఒక అంతరంగ భావన.

ఇవన్నీ సహజ స్థితులే.

ప్రపంచమంతా పరమాత్మ రూపమే.

నీవు విస్తృతమవుతున్న కొద్దీ పరిపూర్ణత అనుభవంలోకి నీ సాధనతోనే సమాధానం పొందాలి.

మనసును నియంత్రించుకోవటం, అలోచనలను క్రమబద్ధీకరిం చుకోవటం, అభ్యాసం! నిరంతరాభ్యాసం భౌతిక వస్తువుల పరిమితిని తెలియజెప్పి, అవి అందించే సుఖ సంతోషాలు తాత్కాలికమని బోధి స్తుంది. ఒక అనుభవాన్ని కలిగిస్తుంది. అది వివేకాన్ని ప్రసాదిస్తుంది. దానితో వైరాగ్యం లభిస్తుంది. ఇకపై మిగిలినదంతా శాంతే. శాంతి లోపలే ఉన్న దని, ఎవరో యిచ్చేది కాదని, మనంతట మనమే పొందాలని అనుభవమౌతుంది.

నువ్వున్నావన్న వాస్తవమే, దైవమున్నాడనటానికి తిరుగులేని సాక్ష్యం.

పరమాత్మ ప్రకాశాన్ని దర్శించలేక పోవటానికి కారణం, కన్ను భౌతిక స్థితిలో ఉండటమే. అది పని చేయటానికి మూలమైన కార ణాన్ని, వస్తువును, శక్తిని తెలుసుకోగలిగితే, ఆ శక్తే అత్మ అని తెలుస్తుంది. మూడో కన్ను అంటే ఆత్మే! తాను చూడటానికి తన కంటె భిన్నమైన వస్తువేది ప్రత్యేకంగా లేదు

అహం నశించి, మనసు హృదయంలో లీనమై, ఆత్మ విచారంలో నిలకడ చెందితే అది జ్ఞాన యోగం.

నీలో నీవు ఉంటేనే, నీవు ధ్యానివి!

నీతో నీవు వుంటేనే, నీవు యోగివి!

వాస్తవంలో జీవించమని, వాస్త వాన్ని గ్రహించమని, ఆత్మే వాస్తవ మని భగవద్గీత బోధిస్తుంది.



అనుభవజ్ఞానమే అసలు విద్య
అనుభవమే గురువు
అనుభవమే ఆత్మ
సర్వ ప్రాణుల హృదయాలలో
ఉన్న 'నేను'
ఆత్మే!

- వి.యస్.ఆర్. మూర్తి
9440603499

చింతన

సమాధినిష్టులకు బాధలు తెలియవు

అన్ని జీవాలలోనూ పరమాత్మనే చూసే వారికి కొన్ని అలౌకికమైన చర్యల వల్ల వచ్చే బాధలు తెలియవు. అలాగే సమాధి స్థితిలోనికి వెళ్లి చుట్టూ ఏమి జరుగుతున్నదో తెలియనివారు ఎందరో. అటువంటివారు మన వాఙ్మయంలో ఎంతో మంది కనిపిస్తారు. శరీరం చుట్టూ పుట్టలు వెలసినా తెలియని వాల్మీకి,


సదాశివబ్రహ్మేంద్రుడు


చ్యవనుల విషయం తెలిసిందే. పరీక్షిత్తు వేటలో అలసిపోయి శమీకుని ఆశ్రమానికి వచ్చి నీరు అడిగితే ఆయనకు పరీక్షిత్తు ఏమి అడిగాడో తెలియలేదు. కోపంలో వివేకం నశించి పరీక్షిత్తు ఆయన మెడలో చచ్చిన పామును వేసినా అదీ ఆయనకు తెలియలేదు. అది చూచిన ఆయన కుమారుడు శృంగి మాత్రం పరీక్షిత్తును శపించాడు. సమాధి స్థితిలో ఉండగా సర్వం మరచిన వారు ఆ రోజుల్లోనూ ఉన్నారు. ఆధునిక కాలంలోనూ ఉన్నారు. 17 - 18 శతాబ్దాలకు చెందినవానిగా భావిస్తున్న సదాశివ బ్రహ్మేంద్ర యోగి నదుల నీట మునిగి లోపల తపస్సమాధిలో నెలల తరబడి ఉండేవారని చెబుతారు. ఇక గజానన్ మహరాజ్ విషయానికి వస్తే ఆయన ఒకసారి తన భక్తులు బంకట్ లాల్, పీతాంబరుడు, భాస్కరుడు మొదలైనవారితో పొలానికి వెళ్లారు. అక్కడ ఏపుగా పెరిగి జొన్న చేను కనిపించింది. అందరూ జొన్న కంకులను కాల్చుకుని తిందామనే నిర్ణయానికి వచ్చారు. జొన్న కంకులను కాల్చటం మొద లుపెట్టారు. అకస్మాత్తుగా అక్కడి తేనెపట్టు నుంచి తేనెటీగలు చెల్లాచెదరై వీరి వైపు రాసాగాయి. తేనెటీగలు కుడితే బాధ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల అందరూ వాటి బారిన పడకుండా ఉండేందుకు తలోదారి పరుగెత్తారు. గజానన్ మహారాజ్ మాత్రం అక్కడే ఉండిపోయారు. తేనెటీగలు ఆయనను కుట్టనారంభించాయి. 'ఈ తేనెటీగలు నేనే, అగ్నిని నేనే, కాల్చడానికి వచ్చినది నేనే, నేనే సర్వము, నేనే సర్వస్వరూపుడను' అనే భావంతో తాదాత్మ్యం చెందారు. దేహ స్పృహలేని ఆయనకు బాధ ఏముంటుంది? గజానన్ పరుగెత్తడం బంకట్‌లాల్ చూడలేదు. అందువల్ల ఆయన అక్కడే ఒంటరిగా ఉండిపోయారేమోననే అనుమానం ఆయనకు వచ్చింది. వెంటనే ఆయన పరుగు పరుగున గజానన్ సన్నిధికి చేరారు. అప్పటికి తేనెటీగలు శాంతించి పట్టుకు చేరాయి. బంకట్‌లాల్ ఒక మంగలిని పిలిపించి గజానన్ శరీరంలో ఉన్న తేనెటీగ ముండ్లను తీయించసాగాడు. ఆ ముండ్లన్నీ బయటకు రాక గజానన్ శరీరంలోనే విరిగిపోయాయి. 'ఇదంతా వ్యర్థ ప్రయత్నం. ముండ్లను వెలికితీసే ఉపాయం చెబుతాను' అని గజానన్ వాయువును కుంభించారు. ముండ్లన్ని వాటంతట అవే బయటకు రావడం ఆ ప్రాంతంలో ఉన్న భక్తులందరు చూచారు. ముండ్లన్ని శరీరంలో ఉన్నా గజానన్‌కు బాధ ఏమీ ఉండదు. అయితే భక్తుల అభీష్టం నిమిత్తం ముండ్లను బయటకు తెప్పించారు గజాననులు. తరువాత అందరూ మళ్లీ పొలానికి వెళ్లి జొన్న కంకులను కాల్చుకు తిన్నారు.

కీటకాల కాట్లకు వెరువని రమణులు

కొన్నాళ్లు బ్రాహ్మణ స్వామిగా, చిన్న స్వామిగా పిలువబడిన రమణ మహర్షి పాతాళ గంగ గుహలో కొన్నాళ్లు ఉన్నారు. ఆత్మనిష్టకు అనువైన ప్రదేశంగా ఆయన దానిని భావించారు. ఆ మాళిగలో బొత్తిగా వెలుతురు ఉండేది కాదు. అనారోగ్యకరమైన తేమ ఎప్పుడూ ఉండేది. ఆయన సమాధి స్థితిలోనికి వెళ్లినప్పుడు

మహనీయుల జీవకారుణ్యం

అక్కడే చిరకాల వాసం చేస్తున్న కీటకాలు, దోమలు, తేళ్లు మొదలైనవి ఆయన రక్తాన్ని తాగేవి. ఆయన కాళ్లు, తొడల అడుగు భాగాలు పుండ్లతో, చీము నెత్తురుతో నిం డిపోయేవి. అయినా ఆ బాధ తెలియలేదు రమణులకు. కాని ఆయన స్థితిని చూసి ఇతరులకు సానుభూతి కలిగేది. అదీ ఆయనకు అక్కరలేదు. శుద్ధ చైతన్యంలో లీనమవటమే ఆయనకు కావలసింది. అది నెరవేరింది. అంతటి తీవ్రమైన సమాధి అవస్థ బాధను పూర్తిగా తొలగించింది మనసు నుంచి.


గజానన్ మహరాజ్

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్


కాళికాదేవి

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

(గత సంచిక తరువాయిభాగం)

"అదే, నేను అందరినీ అడిగాను. అమ్మో! వాళ్లేం ప్రయోగం చేస్తారో అని భయపడతారేమిటి? ఆశ్రమ సమీ పంలో అందరూ ఇళ్లు కట్టుకొని వున్న తరువాత జనపదం లో ఇవి జరపరాదన్న శాసనం గూడా వున్నది. ఆపుచేద్దాం అంటే రారు. పోనీ! నేనే వాళ్లనడిగి చూస్తాను. భగవాన్ అనుజ్ఞ యిస్తే చాలును" అన్నాను. "అడగటం మంచిది, ఊ-ఊ- వింటారేమో చూద్దాం. భయమెందుకు?" అన్నారు భగవాన్. నాకు ఏనుగంత బలం వచ్చింది.

వెంటనే తిరిగి వచ్చి ఆ రాత్రికే కాళికాదేవిని ప్రార్థిస్తూ ఏడెనిమిది పద్యాలు వ్రాశాను. భావం ఏమంటె- ఓ తల్లీ! ఇది నీ పుత్రుడైన రమణుని ఆశ్రమ ప్రాంతం గదా! ఇక్కడ నీవు సాత్త్వికాకృతితో నుండక ఈ రాజస తామస ప్రకృతిని దాల్చితివేల? నీకంత మాంసమే ప్రియమైతే నా శిరస్సే బలి గొనరాదా? నోరులేని జంతువుల బలిగొనుట నీకు భావ్యమా? నీవాకలి గొన్నచో భక్షించుటకు టెంకాయలున్నవి,పళ్లున్నవి,, భక్ష్యములున్నవి, పొంగలి వున్నది. నా ప్రార్థన నాలించి ఆ సాత్త్వికాహారముతో తృప్తిజెంది ఈ రాజస తామస భావమును పరిత్యజింపుము. నేనేగాక నీ పుత్రుడైన రమణుడును ఈ జంతువుల ఆక్రందనము విని తల్లడిల్లిపోతున్నాడమ్మా" అంటూ ఇల్లాంటి భావం గల పద్యాలే కొన్ని వ్రాసి వుంచి, తెల్లవారిన వెనుక నేనున్న ఇంటి యజమాని రాజు సెట్టితో పై సమాచారమూ భగవానుని అనుజ్ఞ చెప్పి వారి ద్వారానే ఆ అర్చకులను పిలిపించి "అయ్యా! ఇది నిర్జన ప్రదేశంగా వున్న పుడు మీరేం చేసినా చెల్లిందిగాని, ఇపుడు చెల్లదు. భగవాను గూడా చాలా బాధపడ్డారు. ఇంతటితో ఇది విరమించి సాత్త్విక బలులీయండి" అని సౌమ్యంగానే చెప్పాను. ముందు వారేవో అభ్యంతరాలు చెప్పారు. అల్లాగైతే ఆశ్రమానికిపుడు కలెక్టరు వగైరా ఉద్యోగస్థులంతా వస్తున్నారు. వారితో చెపుతానన్నాను. జనపదంలో ఇవి జరుగరాదన్న 'లా' వున్న సంగతి వారు గ్రహించో, భగవాన్ ఆజ్ఞగదా అన్న గౌరవంతోనో ఆ నాటి నుండీ బలులు విరమించారు. ఖర్చు నేను భరించి బోర్డు తెప్పించి దాన్ని కట్టించి, భగవాన్‌తో జరిగిన సంగతి వివరిం చాను. భగవాన్ ఆమోద దృష్టితో చూచి "మంచిదయింది. ఎన్నాళ్లనుంచో ఇది జరుగుతున్నది. ఎవరూ కల్పించుకోలేదు. రాను రాను మరీ ఘోరంగా పరిణమించింది. ఏం జేస్తాం? ఇప్పటికైనా ఆపుదల జరిగింది"అని సెలవిచ్చారు.



నాటి నుండీ నేటి వరకూ అక్కడ జంతుబలులు మాని సాత్త్విక బలులతోటే పూజలు జరుపుతున్నారు. భగవదనుగ్రహ బలమే నాచేత ఆ పని చేయించింది గాని మరొకటి కాదని అంతా ఆశ్చర్యపడ్డారు.

ఓర్పులో భాగం

1976 ఫిబ్రవరిలో నాకు ఆపరేషన్ మద్రాసులోనే జరగటం, విశ్రాంతి నిమిత్తం ముందు బెంగళూరు, తరువాత బొంబాయికి వెళ్లటం ఇత్యాదులు ఈ పుస్తకం ఆదిలో విశద పరిచే వున్నాను. బాగా తేలిక యిచ్చినట్లే వుండి, 1977 జనవరిలో అకస్మాత్తుగా ఎడమభుజానికి వెనక ప్రక్కన విపరీతమైన దురదపుట్టి క్రమంగా మెడనొప్పి ప్రారంభమైనది. ఏదో వాతపు నొప్పేమోనని అన్నారంతాను. నాకేమో సందేహమే!

మా అక్క కొడుకు జి.రవీంద్రనాథశాస్త్రి బరోడాలో వున్న ఇండియన్ పెట్రో కెమికల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ వుండి నన్నక్కడికి రమ్మని ఆహ్వానిస్తే ఆ నొప్పితోనే అక్కడకు వెళ్లాను. ఒక్కనెల అల్లా, అల్లా గడిచింది.. ఆ వెనుక ఆటు, పోటు మంటలతో ఆ నొప్పి అధికమై,లోగడ ఆప రేషన్ చేసినదానికి పై భాగంలో గడ్డకట్టుట కారంభమైనది. అక్కడ డాక్టరు చూచి "కోబాల్డు వైద్యము వలన వచ్చిందే గాని కాన్సరు కాదని 15రోజులలో ఏవో మందులు, ఇంజ క్షన్‌లు ఇచ్చాడు. అంతకంతకూ బాధ అధికమేగానీ తగ్గుకానక ఏప్రియల్ 5 కల్లా బొంబాయి చేరవలసి వచ్చింది. క్రమంగా ఆ గడ్డ ఎదిగి అధికమైన బాధతో వేధిస్తూ వుంటే పెద్ద పెద్ద డాక్టర్లకు చూపిం చారు. వాళ్లు చేయవలసిన పరీక్షలన్నీ చేసి కాన్సరేనని తేల్చారు. ఆపరేషనుకు వీలులేదని పదిరోజులు కోబాల్డు చికిత్స చేశారు. అంతటితో అది ఎఱ్ఱపుండయి భగవాన్ సెలవిచ్చినట్లు సూర్యకాంతి మణిలాగా మారింది. ఇక చేసేదేమీ లేదని వాళ్లు వదిలేశారు. భరించరాని బాధతో కష్టపడుతూ మే మొదటి వారంలో ఈ బాధను సహించే శక్తిని ప్రసాదించమని, భగవానుని ప్రార్థిస్తూ నాల్గు పద్యాలు వ్రాశాను అవి ఏమంటే?

1. అరుణాచల రమణా నీ
దరిజేరిన దాది దేహతాపంబులకై
శరణన్నదాన గాదిపు
డరుదెంచెను అట్టి తరుణమార్త శరణ్యా॥

2. క్యాన్సరనుచు వచ్చి కడు వేదనలతోడ
చంపకుండ నన్ను జంపుచుండె
దీనబాధ నోర్వ దిట్టమౌ గుండె నా
కీగదయ్య శరణమీవె రమణ॥

3. ఎట్టులోర్చుకొంటివేమో నీ చేతిపై
పుట్టినట్టి పుట్టపుండు బాధ
అట్టి దిట్టతనమునందు భాగం బిచ్చి
పట్టినగుట శాంతి బరచుమయ్య॥

4. అల్లనాడు నీబాధకే నాగలేక
భాగమడిగితి నేటికాపగిది వచ్చె
ఇప్పుడడిగెద నోర్పునాకిమ్మటంచు
జాగుసేయక వరమిమ్ము యోగివంద్య॥

అని పై పద్యములు వ్రాసి ఓర్పునీయమని వేడుకుంటూ వుండటం కంటె చేసేదేమి లేక ఉదాసీన భావంతో వుండిపో యాను. బాధ అంతకంతకూ అధికమై ఇంచుమించు తిరగలేని స్థితి సంక్రమిస్తూ వచ్చింది.

(తరువాయి భాగం వచ్చేసంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

తిరుప్పావై


పాశురం 27

కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పఱైకొణ్డు యామ్ పెఱు శమ్మానమ్
నాడు పుగళుమ్ పరిశినాల్ నన్ఱాక
చ్చూడగమే, తోళ్ వళైయే, తోడే,శెవిప్పూవే,
పాడగమే,యెన్ఱనైయ పల్ కలనుమ్ యామణివోమ్,
ఆడైయుడుప్పోమ్; ఆదన్‌పిన్నే పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్‌దు ముళఙ్గై వళివార
క్కూడి యిరున్దు కుళిర్‌న్దేలో రెమ్బావాయ్.

తాత్పర్యం

తన ఉనికిని సహించలేనట్టి శత్రువులైనట్టి వారిని జయించెడి కల్యాణ గుణములు కల గోవిందుడా! నిన్నే కీర్తించి పఱై అను వాయిద్యమును పొంది నీచే పొందింపబడు పెద్ద సమ్మానమును లోకులందరునూ ప్రశంసించురీతిలో చేతి కంకణములు, భుజముల ధరించు కర్ణాభరణములు, కర్ణ పుష్పములు, పాదముల ధరించు అందియలు యివేగాక మాకు తెలియని యింకనూ అనేక ఆభరణములను మేము నీచే ధరింపజేయబడవలయును. పట్టు వస్త్రములను ధరింతుము. ఆపైన క్షీరాన్నము మునుగునట్లు పోసిన నేతిని, మోచేయిగుండా జారుచుండగ నీతో కలసి కూర్చొని హాయిగ చల్లగ ఆరగింపజేయ బడవలయును. ఇదే మా వ్రత ఫలము.





- జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సౌజన్యంతో

దిన ఫలాలు

మేష రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ప్రయాణాల విషయంలో అనుకూలత ఉంటుంది. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. వ్యాపార కార్యాలలో ఆనందకర సంఘటనలు చోటుచేసుకొంటాయి. గృహవిషయాల్లో ఇబ్బందులు పరిష్కరింపబడతాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రత్యర్థులు బలహీనపడతారు. ఆదాయంలో అనువైన మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ప్రతికూలతను కలిగిస్తాయి. ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాల ద్వారా ప్రయోజనాలు పొందుతారు. శారీరక రుగ్మతలు ఉంటాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగ వ్యవహారాల్లో చిరుసమస్యలను ఎదుర్కొంటారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధికప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి: శత్రుభీతి పోతుంది. ఆర్థికలావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగు తాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో అయోమయ పరిసితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి.వ్యయం నియంత్రించగలుగుతారు. పనులలో వేగం తగ్గుతుంది. ఆరోగ్యంలో, ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్లు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.

వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: శ్రమ అధికమవుతుంది. గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభరాశి: ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ప్రయాణాలు అనుకూలం. శుభవార్తలు వింటారు. ఆదాయం పర్వాలేదు.

మీనరాశి: నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి కాబట్టి జాగ్రత్తలు తప్పనిసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

Business సరిగమలు


సమయం వచ్చేస్తోంది!

పన్ను మినహాయింపు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకోండి

మీ కంపెనీ ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ మిమ్మల్ని ఇన్‌కమ్‌టాక్స్ సేవింగ్ ప్రూఫ్‌లను సమర్పించమని అడిగే సమయం(జనవరి కాబట్టి)మొదలైంది. దానికి సంబంధించిన కాగితాలను తయారుగా పెట్టుకోవాల్సిన తరుణం వచ్చింది. పోయిన ఏడాది ఏప్రిల్ నుంచి మీరు అంతకుముందు సమర్పించిన కాగితాల ఆధారంగా మీ జీతం మీద ఎంత పన్ను పడుతుందో లెక్కిస్తుంది. ఆదాయపు పన్ను చట్టం, 1961 లో సెక్షన్ 192 కింద పన్నుల మినహాయింపు జరుగుతుంది. ఉద్యోగికి జీతాలు చెల్లించేటప్పుడు ఆ మినహాయింపులు చేసి జీతం చెల్లిస్తారు. అంతకుముందు మీరు కంపెనీకి తెలిపినట్లుగా ఏమేం పెట్టుబడులు పెట్టారో వాటికి సంబంధించిన రుజువులు కంపెనీకి చూపించాల్సి ఉంటుంది. మీరు పన్ను ఆదా జరిగే పెట్టుబడులు పెట్టారా లేక ఇతర విధాలైన పెట్టుబడులు పెట్టారా అనేది కేవలం మీరు ఇచ్చే ఆధారాలబట్టే ఉంటుంది. సరైన డాక్యుమెంట్లు సమర్పించకుంటే అవేవీ పరిగణనలోకి రావు. డాక్యుమెంట్లు సమర్పించే ఆఖరు తేదీ సంస్థను బట్టి వివిధరకాలుగా ఉండవచ్చు. అయితే సాధారణంగా మార్చి 10వ తేదీలోపు సమర్పించవలసి ఉంటుంది. జనవరి నుంచే సమర్పించమని అడుగుతుంటారు. ఎందుకంటే పన్ను మినహాయింపుకు సంబంధించి లెక్కలు వేసుకోవాల్సి వస్తుంది కాబట్టి వారికి ఆ మాత్రం సమయం పడుతుంది. ఒకవేళ పన్ను మినహాయింపులు ఎక్కువైనా, తక్కువైనా అవి ఆర్థిక సంవత్సరం ఆఖరి మూడునెలల్లోనే జరుగుతుంది. మూడు నెలల సమయం ఉంది కదా అని తేలిగ్గా తీసుకుని మార్చి వరకు ఆగి అప్పుడు డాక్యుమెంట్లు సమర్పిద్దాంలే అనుకుంటే అనవసరంగా పన్ను భారం నెత్తిన పడుతుంది. మీ దగ్గర నుంచి డాక్యుమెంట్లు సేకరించిన కంపెనీ, వాటిని ఆదాయపు పన్ను విభాగానికి ఫైలింగ్ కోసం ప్రత్యక్షంగా పంపించదు. కంపెనీనే మన డాక్యుమెంట్ల ఆధారంగా పన్ను మినహాయింపులు, లెక్కలు చూసి ఆదాయపు పన్ను శాఖకు పంపిస్తుంది.ఒకసారి పన్ను ఆదా చేసే పెట్టుబడులు, ఖర్చులు లెక్కలోకి తీసుకున్నాక కంపెనీ యజమాని ఒకసారి పన్ను మినహాయింపులు చేసిన తర్వాత మళ్లీ తర్వాత నెలలో వాటి మీద అడ్జస్ట్‌మెంట్‌లు చేయడం కుదరదు. అటువంటప్పుడు ఫామ్ 16 లో అదనంగా కట్టిన పన్నును టిడిఎస్ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. మీరు ఫైల్ చేసినదాన్నిబట్టి ఐటి విభాగం సరైన ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్ చేస్తుంది. ఇంతకీ మీరు మీ కంపెనీకి సమర్పించాల్సిన పన్ను ఆదా పెట్టుబడి లేదా ఖర్చుల రుజువులు తెలిపే డాక్యుమెంట్లు ఇవి.

80 సెక్షన్ కింద చేసిన పెట్టుబడులు

మ్యూచ్యువల్ ఫండ్స్‌లో ఈక్విటీ లింక్‌డ్ సేవింగ్స్ స్కీమ్, జీవిత బీమా, ఇఎల్ ఎస్ ఎస్ ఫండ్ స్టేట్‌మెంట్, ప్రీమియం కట్టిన రసీదులు, ఇవన్నీ ఇవ్వాలి. అదే కనుక పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పిపిఎఫ్) గురించి అయితే అది పోస్టాఫీస్ లేదా బ్యాంకు ద్వారా నిర్వహణ జరుగుతుంది. దానికి జరిగిన లావాదేవీలన్నిటికీ సంబంధించిన పాస్‌బుక్ ఫొటోకాపీలను సమర్పించాలి. ఒకవేళ మీరు ఆన్‌లైన్‌లో పిపిఎఫ ఎకౌంట్ నిర్వహిస్తే కనుక ఎలక్ట్రానిక్(ఈ)రసీదుల ప్రింటవుట్ తీసుకోవాలి. దానివలన ఎకౌంట్, ఇంకా ట్రాన్సాక్షన్ వివరాలు తెలుస్తాయి. సుకన్య సమృద్ధి పథకం, ఇంకా పన్ను ఆదా చేసే ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, డిపాజిట్ రసీదులు సమర్పించాలి. పిల్లల చదువుకు కట్టిన ట్యూషన్ ఫీజు రసీదులు ఇవ్వాలి. అందులో ఆ స్కూల్ సీల్, ఫీజు అందుకున్నవారి సంతకం ఉండాలి.



మొదటిసారి ఇల్లు కొనుక్కునేవారు

ఏప్రిల్ 1, 2016 నుంచి మార్చి 31, 2017 లోపు సెక్షన్ 80ఈఈ కింద రుణం మంజూరు అయినవారు, మొదటిసారి రుణం తీసుకుని ఇల్లు కొనుక్కుంటున్నవారు ఇంటిరుణం వడ్డీ మీద లబ్దిని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆదాయపు పన్ను చట్టం కింద, సెక్షన్ 24 ప్రకారం రెండు లక్షలు, అంతకంటే ఎక్కువ మినహాయింపు ఉండవచ్చు. వాటికి సంబంధించిన హార్డ్‌కాపీలను సమర్పించాలి. ఆర్థిక సంవత్సరం 2016-17 లోపు అయితే ఏడాదికి 50,000 రూపాయల మినహాయింపు ఉంటుంది, తర్వాతి సంవత్సరాలలో అయితే రుణం చెల్లింపు పూర్తయేవరకు వర్తిస్తుంది.

ఇంటి అద్దె అలవెన్స్ మినహాయింపు

హెచ్‌ఆర్‌ఎ మినహాయింపు క్లెయిమ్ చేసుకునేవారికి ఆ స్థల యజమాని పాన్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. ఈ మినహాయింపు పొందాలంటే ఏడాదికి లక్ష రూపాయలు అంటే నెలకి 8,333 రూపాయలు అద్దెకు మించకూడదు. లీజ్ రెంట్ అగ్రిమెంట్ కాపీ ఒకటి, మీరు అద్దెకి ఉంటున్న ఇంటి యజమాని ఓనర్‌షిప్ ప్రూఫ్, అంటే ఇంటిపన్ను రసీదు లేదా సరి కొత్త ఎలక్ట్రిసిటీ బిల్ లేదా ఒకవేళ కోఆపరేటివ్ సొసైటీ అయితే షేర్ సర్టిఫికేట్ లేదా కొత్త ఎలక్ట్రిసిటీ బిల్లు సమర్పించాలి. ఏప్రిల్ 2018 వరకు ఒరిజినల్ రెంట్ రసీదులు ఇవ్వాలి.



ఇంటిరుణం రీపేమెంట్ (అసలు)

ఏప్రిల్ 2018 నుంచి 2019 మార్చి వరకు ఎంత అసలు కట్టారో తెలియచేసే సర్టిఫికేట్ సమర్పించాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఒక రెండు మూడు నెలల ముందు వరకు లెక్కవేసి ఇంకా ఎంత డబ్బు చెల్లించాలో తెలిపే డాక్యుమెంట్ ఇవ్వమని సంస్థని అడగాలి.

సొంత ఇంటి ఆస్తి నష్టం-ఇంటి రుణం మీద వడ్డీ

ఆ ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల నుంచి వడ్డీ సర్టిఫికేట్‌లో ఎంతెంత వడ్డీ పడింది అనే వివరాలతో సర్టిఫికేట్ అవసరం. ఇల్లు కడుతున్నట్లు నిర్మాణ సర్టిఫికేట్ కాని సొంతం చేసుకున్న సర్టిఫికేట్ కాని ఇవ్వాలి. ఇంకా రుణం ఎప్పుడు తీసుకున్నారు అనే వివరాలు కూడా పన్ను లబ్ది పొందడానికి అవసరం.

సొంత ఇంటి ఆస్తి వల్ల నష్టం-హౌసింగ్ లోన్

రుణంతో కట్టుకున్న ఇల్లు అద్దెకి ఇస్తే అదే విషయాన్ని బ్యాంకుకు తెలియచేయాలి. అందులో ఏప్రిల్ 2018 నుంచి 2019 మార్చి వరకు ఆ ఆర్థిక సంవత్సరానికి అసలు, వడ్డీ ఎంత అయింది అనే వివరాలున్న సర్టిఫికేట్ కావాలి.

కొత్త పెన్షన్ స్కీమ్

ఎన్‌పిఎస్‌లో పెట్టుబడుల గురించిన ఎటువంటి ప్రూఫ్‌లు అవసరం లేదు. ఒకవేళ మీరు మీ సొంతం గా ఎన్‌పిఎస్‌లో 50,000 రూపాయల కంటే తక్కువ పెట్టుబడి పెడితే అది ఔట్‌సైడ్ శాలరీ కింద లెక్కి స్తారు. కాబట్టి పర్మనెంట్ రిటైర్మెంట్ ఎకౌంట్ నంబర్ ఎకౌంట్ కార్డు కాపీలను, టైర్ వన్ ఎకౌంట్ కోసం ఎన్‌పిఎస్ ట్రాన్సాక్షన్ స్టేట్‌మెంట్ సమర్పించాలి.

మెడిక్లెయిమ్ ప్రీమియం

మీ ఇన్సూరర్‌ని పిలిచి సెక్షన్ 80డి కింద టాక్స్ స్టేట్‌మెంట్ పంపించమని అడగండి. ప్రీమియంను క్యాష్ రూపంలో కట్టిఉండకూడదు. చెక్ లేదా డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసి ఉండాలి.



విల్లు రాస్తూ వీడియో!

లక్ష్మి ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆమె భర్త చనిపోయారు. భర్త చనిపోయాక తమ ఆస్తిని తన చిన్న కొడుకు పేరు మీద బదిలీ చేస్తున్నట్లు విల్లు రాయాలనుకున్నారు. ఉండటానికి ఇద్దరు కొడుకులున్నా పెద్ద కొడుకుతో ఆమెకు గత పదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. చిన్న కొడుక్కి మాత్రమే ఆస్తిని రాయడం గురించి పెద్ద కొడుకు గొడవ చేస్తాడని తెలుసు. కోర్టు మెట్లు ఎక్కే అవకాశం ఉందని కూడా తెలుసు. అందుకే ఆమె లీగల్ అడ్వైజర్ ఆమెకు ఒక సలహా ఇచ్చారు. మీరు విల్లు రాస్తుండంగా వీడియో తీసి పెట్టుకోండి. అది మీ అంతట మీరే ఇష్టపూర్వకంగా రాశారని మీకు సాక్ష్యం అనుభవించాలనుకుంటే విల్లు రాయాల్సిన అవసరం ఉంది. వేరే వ్యక్తులు చనిపోయిన వ్యక్తి రాసినట్లుగా దొంగ విల్లులు తయారు చేసే వీలుంటుంది. అందుకే విల్లు రాసేటప్పుడు వీడియో రికార్డింగ్ తప్పనిసరిగా ఉండాలని నిపుణులు తెలుపుతున్నారు. చట్టప్రకారం ఇది ఏవిధంగానూ నియమం కాదు. కేవలం వ్యక్తిగతంగా తీసుకునే జాగ్రత్త మాత్రమే. ఒకవేళ ముున్ముందు విల్లు నిజాయితీ మీద కోర్టులో కేసు పడితే ఇది సాక్ష్యంగా మాత్రమే ఉపయోగపడగలుగుతుంది. స్మార్ట్‌ఫోన్‌లో కాని లేదా కెమెరాలో కాని ఈ రికార్డింగ్ చేయవచ్చు. లేదా 2 లేదా 5 వేలిచ్చి రికార్డు చేయించుకోవచ్చు. వీడియో తీయించుకోవడం వలన ప్రొబేట్ తేలిక అవుతుంది. ప్రొబేట్ అంటే అధికారికంగా కోర్టు చట్టం కింద ధృవీకరణ జరిగినట్లు విల్లు కాపీ దొరుకుతుంది. అయితే వీడియో తీసుకునేటప్పుడు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలి. విల్లు రాస్తున్న మీరు ఆరోగ్యంగా ఉన్నారని కెమెరాకు చెప్పాలి. ఉదాహరణకు, మీ పేరు, మీరు విల్లు రాస్తున్న తేదీ, మీరు ఉంటున్న నగర, ఇది రికార్డు చేస్తున్న సమయం అన్నీ చెప్పాలి. దాంతోపాటు మీరు విల్లు మీ ఇష్టప్రకారం రాస్తున్నట్లు కూడా తెలపాలి. దాన్నిబట్టి విల్లురాసే వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గి రాయడం లేదని అర్థం అవుతుంది. అంతేకాదు. మీరు విల్లులో రాసిన మొదటి పేరాను చదివి వినిపించాలి. అయితే అందులో ఏ ఆస్తి ఎవరికి చెందుతుంది లాటి వివరాలు చెప్పనక్కర్లేదు. అవి రహస్యంగానే ఉంచాలి. విల్లు రాసిన వ్యక్తి, ఇంకా సాక్షి సంతకం దారుడు ఇద్దరూ అందులో కనిపించాలి. మీరు ఆరోగ్యంగానే ఉన్నారని ధృవీకరించి చెప్పే డాక్టర్ కూడా వీడియోలో మాట్లాడితే మంచిది. దాని వలన సాక్ష్యం మరింత బలంగా ఉంటుంది. వీడియో రికార్డింగ్ చేసేటప్పుడు గుర్తుంచుకోవలసిన విషయాలు ఇంకొన్ని ఉన్నాయి. అన్ని వయసుల వారు ఈ విల్లు రాయవచ్చు. సాధారణంగా కోర్టులో చాలా ముసలివారు రాసే విల్లును భయపెట్టి బలవంతంగా రాయించారని నమ్ముతారు. అదే కనుక వీడియో తీస్తే విల్లు రాసిన వ్యక్తి వృద్ధులైనా పూర్తి మానసిక ఆరోగ్యంతో వారి చేత్తో విల్లు మీద సంతకం చేయడం వలన దాని మీద పూర్తి నమ్మకం కలుగుతుంది. అయితే విల్లు డాక్యుమెంట్‌కి ఆ వీడియో ప్రత్యామ్నాయం కాదు. విల్లు రాయడంతో, వీడియో రికార్డింగ్ చేయడంతో అంకం పూర్తవలేదు. వాటిని చాలా జాగ్రత్తగా పదిలపరచుకోవాలి.

ఉంటుంది. తర్వాత ఉపయోగపడుతుంది. విల్లు అంటే ఆ వ్యక్తి తాను చనిపోయిన తర్వాత తనకు సంబంధించిన ఆస్తులను తమ వారసులకు, లేదా నచ్చినవారికి అందాలని తెలియచేసే డాక్యుమెంట్. ఆస్తిపాస్తులున్న ఏ వ్యక్తి అయినా తనకు సంబంధించిన ఆస్తి ఎవరికి చెందాలి అనేది విల్లు రూపంలో రాయడం ముఖ్యం అని చాలామంది ఆర్థిక ప్రణాళికా నిపుణుల అభిప్రాయం. ఒకసారి రాసిన విల్లు అలానే ఉండాలనే నిబంధన ఏం లేదు. దాన్ని ఎన్నిసార్లయినా మార్చి రాసుకోవచ్చు. అన్నిటికంటే ఆఖరున రాసిన విల్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. చాలామంది విల్లు రాయరు. కొంతమంది అవసరమైన ప్రక్రియలు అనుసరించరు. ఇంకొంతమంది విల్లుని టైమ్‌కి అప్‌డేట్ చేయరు. విల్లు రాయడాన్ని సెంటిమెంట్‌గా భావించేవారు కూడా ఉంటారు. చచ్చిపోయేముందు విల్లు రాస్తారు అన్న విషయం బాగా బుర్రలో నాటుకుని పోయింది. చాలా సినిమాల్లో విల్లు రాసే సీన్లు చనిపోయే ముందే జరుగుతుంటాయి. ఇంకో నమ్మకం ఏంటంటే, విల్లు రాయడం అనేది డబ్బున్నవారికి సంబంధించిన విషయం అనుకుంటారు. కాని దానికి పేద, ధనిక తేడాలుండవు. మనిషి చనిపోయిన తర్వాత వారి ఆస్తులు విచ్ఛిన్నం కాకుండా, వారు ఇష్టపడే మనుషులు మాత్రమే వారి ఆస్తిని



క్రెడిట్ కార్డు వినియోగం తెలివిగా

డిజిటల్ మనీ వాడకం పెరిగింది. దానిలో భాగంగా క్రెడిట్ కార్డు వినియోగం కూడా ఎక్కువైంది. క్రెడిట్ కార్డు తీసుకోమని కూడా బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలు వెంటపడుతుంటాయి. మరి క్రెడిట్ కార్డుల మీద బ్యాంకులు ఎంత లాభపడుతున్నాయో మీకు తెలాసా? ఒక బ్యాంకు కార్డు ఇచ్చిందంటే అది దాని మీద వార్షిక రుసుము , ప్రతి లావాదేవీ మీద ఇంటర్‌ఛేంజ్ ఫీజు సంపాదిస్తుంది. కార్డుహోల్డర్ సమయానికి సరిగా చెల్లించకున్నా, పాక్షికంగా చెల్లించినా మిగిలిన డబ్బు మీద వడ్డీ, లేట్ పేమెంట్ ఫీజు చార్జి వేస్తుంది. కార్డు మీద బ్యాంకు సంపాదించే సొమ్ము నుంచి కొంత రివార్డు పాయింట్ల రూపంలో కార్డుహోల్డర్‌కి ఇస్తుంది. కార్డు ఇచ్చినవారు వేసే ఇంటర్‌ఛేంజ్ ఫీజ్ ఆ కార్డు ఏ విభాగానికి చెందింది అన్నదాన్నిబట్టి ఉంటుంది. గోల్డ్, టిటానియమ్, ప్లాటినమ్, వరల్డ్, సిగ్నేచర్, ఇన్‌ఫైనట్ ఇలా దాని విభాగం బట్టి ఉంటుంది. పెద్ద కార్డులైన ఇన్‌ఫైనెట్, సిగ్నేచర్ లేదా వరల్డ్‌లు మిగిలిన ప్లాటినమ్, గోల్డ్ కార్డులతో పోలిస్తే వాటికి ఎక్కువ రివార్డు పాయింట్లు దొరుకుతాయి. మరి అటువంటి రివార్డు పాయింట్లు గెలుచుకోవాలంటే ఏం చేయాలి? ప్రతి లావాదేవీకి కార్డుకు పాయింట్లు చేరతాయి. కార్డు ఇచ్చిన బ్యాంకుతో టైఅప్ అయిన దుకాణం నుంచి కొనుగోళ్లు చేస్తే మరిన్ని పాయింట్లు చేరతాయి. సీజన్ అమ్మకాలు, వారాంతపు అమ్మకాలు లాటి సందర్భాలలో అటువంటి ఆఫర్లు అందుతాయి. ఆ పాయింట్లతో ఆన్‌లైన్‌లో కొనుగోల్లు చేసుకోవచ్చు. లేదా సినిమా టికెట్లు, ఎయిర్‌లైన్ టికెట్లు, హోటల్ బుకింగ్‌లు చేసుకోవచ్చు.వినియోగదారుల అవసరాలను బట్టి కార్డు ఇచ్చే సంస్థలు వివిధ ప్రోగ్రామ్‌లు అందచేస్తుంటారు. కేవలం అత్యవసరాలకు అంటే ఉదాహరణకు, ఫర్నిచర్ కొనడానికి, షాపింగ్ చేయడానికి, ప్రయాణాలకు మాత్రమే వాడేవారికి అటువంటి ప్రత్యేక ఆఫర్లు ఉండవు. క్రెడిట్ కార్డును తెలివిగా ఉపయోగించుకుంటే ఎక్కువ లబ్ది పొందవచ్చు.



ఎఫ్‌డిలపై టిడిఎస్ తప్పించుకునే మార్గాలు


పెద్దమొత్తాన్ని కొన్నేళ్ల కోసం బ్యాంకులోనో లేక బ్యాంకేతర ఆర్థిక సంస్థల్లో పెట్టుబడి పెట్టడం(ఫిక్స్‌డ్ డిపాజిట్) సంప్రదాయ పద్ధతి. ఆ నియమిత కాలపరిమితికి దానికి వడ్డీ వస్తుంది. వాస్తవానికి సాధారణ సేవింగ్ ఎకౌంట్‌తో పోలిస్తే ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఎక్కువ వడ్డీ వస్తుంది. కాబట్టి ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడాన్ని ఇష్టపడతారు. కాని అనుకున్న కాలపరిమితి కంటే ముందుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకుంటే జరిమానా పడుతుంది. అది తెలుసుకునే పెట్టుబడి పెట్టాలి.

ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద పన్ను

సేవింగ్ బ్యాంక్ ఎకౌంట్ లో 10,000 రూపాయల వరకు వడ్డీ పొందితే దానికి సెక్షన్ 80టిటిఎ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. కాని అదే ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వచ్చే వడ్డీ మీద పూర్తి పన్ను కట్టాలి. అయితే సీనియర్ సిటిజన్‌కు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వచ్చే వడ్డీకి 50,000 రూపాయల వరకు సెక్షన్ 80టిటిబి కిందమినహాయింపు పొందవచ్చు. అది బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద, బ్యాంకింగ్ బిజినెస్ చేసే కోఆపరేటివ్ సొసైటీలు, పోస్టాఫీసుల మీద దేని మీద వచ్చే వడ్డీకైనా ఇది వర్తిస్తుంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద పన్ను మినహాయింపు

ఫిక్స్‌డ్ డిపాజిట్ మెచ్యూర్ అయాక వచ్చే డబ్బు మీద కాని, అప్పుడు చెల్లించే వడ్డీ మీద కాని మినహాయింపు ఉండదు. ఆ ఆర్థిక సంవత్సరంలో అన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి ఉత్పన్నమయ్యే వడ్డీ పది వేల రూపాయలు దాటినప్పుడు పదిశాతం పన్ను పడుతుంది. అదే కనుక బ్యాంకులో ఉన్న సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వచ్చే వడ్డీ ఆదాయం 50,000 కంటే మించితే పన్ను పడుతుంది. అలాగే బ్యాంకుకు పాన్ సమర్పించకపోతే 20 శాతం పన్ను కట్టవలసి వస్తుంది.



ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద పన్ను మినహాయింపు ఎప్పుడు ఉండదు?

మూడు సందర్భాలలో పన్ను పడకుండా చూసుకోవచ్చు. మొదటగా, ఎవరికైతే ఆర్థిక సంవత్సరానికి 250000 రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉంటుందో(60 ఏళ్లకు పైబడినవారికి 30,000, 80 ఏళ్లకు పైబడినవారికి 5,00000)వారు నాన్ డిడక్షన్ ఆఫ్ టాక్స్ డిక్లరేషన్ ఫైల్ చేసుకోవచ్చు. ఈ డిక్లరేషన్‌ను ప్రతి ఆర్థిక సంవత్సరం మొదట్లో ఫామ్ 15జి లేక ఫామ్ 15హెచ్(సీనియర్ సిటిజన్)ద్వారా బ్యాంకర్లకు సమర్పించాలి. దానివలన టాక్స్ పడకుండా ఉంటుంది. రెండోది, కొంతమంది వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తుంటారు. అయినా కూడా కొన్ని సందర్భాలలో అన్ని బ్యాంకుల నుంచి వచ్చే వడ్డీ కలిపినా కూడా ఆ ఆర్థిక సంవత్సరానికి 10,000 కంటే ఎక్కువ అవకూడదు. అలా జరిగితే టాక్స్ పడదు. మూడవది, పెట్టుబడి పెట్టిన ఆర్థిక సంవత్సరంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ మీద వడ్డీ 10,000 కంటే తగ్గితే, అంటే ఉదాహరణకు ఆనంద్ అనే వ్యక్తి 36 నెలల కాలపరిమితి కోసం రెండు లక్షల రూపాయలు 8 శాతం వడ్డీకి అక్టోబర్ 1వ తేదీన డిపాజిట్ చేస్తే 2018-19 కి వచ్చే వడ్డీ 8,000 వస్తుంది. అందుకే అది 2018-19 ఆర్థిక సంవత్సరానికి దానికి పన్నుపడదు.

కొంతమంది కుటుంబ సభ్యుల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తారు. అటువంటప్పుడు వారి కుటుంబ సభ్యుల ఆదాయం కనీస మినహాయింపు పరిమితి కంటే తక్కువ ఉంటే వారు 15జి /హెచ్ నాన్ డిడక్షన్ ఆఫ్ టాక్స్ కింద ఫైల్ చేసుకోవచ్చు. కొంత పరిమితి దాటినప్పుడు బ్యాంకులు 10 శాతం పన్నువేస్తాయి. అయితే అది వ్యక్తుల వ్యక్తిగత పన్ను చెల్లింపు స్థాయిని బట్టి ఉంటుంది. ఒకవేళ 20,30 టాక్స్ బ్రాకెట్ దాటిన వారయితే అదనంగా పన్నులు చెల్లించవలసి ఉంటుంది. మొత్తం మీద వడ్డీ ఆదాయం 10,000, సీనియర్ సిటిజన్ అయితే 50,000 రూపాయల వరకు ఉంటే బ్యాంకులు పన్ను వేయవు. ఫామ్ 15జి /హెచ్ ఫైల్ చేయక్కరలేదు. అందుకే ఏడాది మొదట్లోనే ఎంత వడ్డీ ఆదాయం వస్తుందో లెక్క చూసుకోవాలి. ఒకవేళ అవసరం అయితే అదనపు పన్ను చెల్లించండి. తర్వాత టాక్స్ రిటర్న్ ఫైల్ చేసుకోండి.

రామ్‌చరణ్ అభిమానిగా సినిమా చేశా...

- దర్శకుడు బోయపాటి శ్రీను



మాస్ సినిమాల దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకత తెచ్చుకున్నారు బోయపాటి శ్రీనివాస్. రామ్ చరణ్ కథానాయకుడిగా ఆయన రూపొందిస్తున్న కొత్త చిత్రం వినయ విధేయ రామ. అన్ని వాణిజ్య విలువలతో పాటు కుటుంబ కథా చిత్రంగా వినయ విధేయ రామ సినిమా తెరకెక్కింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై దానయ్య నిర్మించిన ఈ సినిమా ఇవాళ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా వినయ విధేయ రామ గురించి దర్శకుడు బోయపాటి శ్రీనివాస్ చెప్పిన విశేషాలు చూస్తే..

✦ రామ్ చరణ్ కథను చిరంజీవి గారికి చెప్పమన్నారు. వారం పది రోజులు సమయం తీసుకుని పూర్తి కథను ఆయనకు వినిపించాను. కథ విన్నాక చిరంజీవి గారు బాగుంది చేయండి అన్నారు. నువ్వెలా సినిమా చేస్తావో తెలుసు అని చెప్పి తన పూర్తి సహకారం అందించారు.

✦ నాలుగేళ్ల కిందటే రామ్ చరణ్‌కు చెప్పిన కథ ఇది. అప్పటికి ఈ కథకు కావాల్సిన పరిపక్వత చరణ్‌లో లేదనిపించింది. ఇప్పుడు సరిగ్గా ఈ పాత్రకు సరిపోయాడు. సినిమా ప్రారంభించాం. కథలో అన్ని వాణిజ్య అంశాలుంటాయి. కుటుంబ కథతో తెరకెక్కించాం.

✦ సంక్రాంతికి రావాల్సిన సినిమా ఇది. అందుకే ఎనిమిది నెలల కిందటే ఈ సినిమా పండక్కి రావాలని ప్రణాళిక వేసుకున్నాం. సంక్రాంతి మూడు రోజుల పండగ భోజనం, ఆటపాటలు, కోడి పందేలు ఆడుతుంటారు. అలా ఈ సినిమాలో ఆటపాటలు, కుటుంబ అనుబంధాలు, పోరాటాలు అన్నీ ఉన్నాయి.

> చిరంజీవి గారికి తగిన వారసుడు రామ్ చరణ్. నాకింత పెద్ద కుటుంబం ఉంది, పేరుంది అనుకోకుండా నిత్యం శ్రమిస్తుంటారు. ఆయనొక యుద్ధ ట్యాంక్. యుద్ధం చేసేందుకే, గెలిచేందుకే పుట్టారు. రామ్ చరణ్ ఏ కథకైనా న్యాయం చేసేలా నటించగల సమర్థుడైన నటుడు.

✦ దానయ్య గారి దగ్గర రామ్ చరణ్ డేట్స్ ఉన్నాయి. నిర్మాత ఎవరు అనుకుంటున్న సమయంలో దానయ్య గారి పేరు చరణ్ చెప్పారు. ఆయన మంచి నిర్మాత. జ్యూస్ నాది అయితే గ్లాస్ నిర్మాతది. మేమేం చేయాలనుకున్నా నిర్మాత అండగా నిలవక పోతే కుదరదు.

✦ నా అన్ని చిత్రాల్లో నాయికకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. ఈ సినిమాలో కైరా అద్వానీ మంచి క్యారెక్టర్ చేసింది. ఆమెకు తల్లిగా నటించిన హేమది కీలకమైన పాత్ర. సామాజిక కార్యక్రమాలు చేసే హేమ పాత్ర ఓ పెద్ద సమస్యను మనకు వివరిస్తుంది. ఇవాళ సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్య అది. వీళ్లిద్దరి పాత్రలు నవ్విస్తూ నవ్విస్తూ చివరకు ఆలోచింపజేసేలా సాగుతుంటాయి.

✦ నేను ఏ సినిమా చేసిన ఆ కథానాయకుడి అభిమానిగా భావిస్తూ సినిమా రూపొందిస్తుంటాను. ఈ చిత్రంలో చరణ్ అభిమానిగా ఆలోచించుకుంటూ సినిమా చేశాను. నాకు కథానాయకులంతా ఒక్కటే. అందరితోనూ సినిమాలు చేయాలనుకుంటున్నాను.

✦ నేను చేస్తున్న సినిమాలో అన్ని అంశాలుంటాయి. అయితే రౌద్రం అనేది ఎక్కువగా గుర్తుండిపోతుంది. ఎందుకంటే లక్షలాది అభిమానులు, ప్రేక్షకులు సినిమా చూసేందుకు వచ్చినప్పుడు వాళ్లకు కావాల్సిన అన్ని అంశాలు ఉండేలా సినిమా చేయాలి. అందులో భాగంగానే పోరాట దృశ్యాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంటాం.

✦ వివేక్ ఒబెరాయ్ ముందు సినిమా చేయనన్నాను. తన పాత్ర గురించి విన్నాక అంగీకరించారు. ఆయన పాత్ర కొత్తగా ఉంటుంది. స్నేహ సహనం ఉన్న వదిన పాత్రలో నటించింది. మొత్తం అన్ని పాత్రలు ఏదో ఒక సందర్భంలో కీలకంగా వస్తుంటాయి.

✦ మాతో పాటు పండక్కి వస్తున్న అన్ని చిత్రాలు జనాదరణ పొందాలని కోరుకుంటున్నాను.

ప్రభాస్ బీస్ జాన్



వర్కింగ్ టైటిల్స్ సినిమా పేర్లుగా మారడం చూస్తూనే ఉన్నాం. ప్రచారంలో ఉన్న రెబల్‌స్టార్ ప్రభాస్ 20వ చిత్రం జాన్‌కూ ఇలాంటి ప్రచారమే జరిగింది. తాజాగా తెలిసిన సమాచారం ప్రకారం ఇదే పేరును చిత్ర బృందం ఖరారు చేసుకుంది. సినిమాకు వీఎఫ్ఎక్స్ అందిస్తున్న కమల్ కన్నన్ తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా తాను చేస్తున్న కొత్త సినిమాల వివరాలు తెలిపారు. ఇందులో ప్రభాస్ జాన్ సినిమాలో వీఎఫ్ఎక్స్ పనులు ప్రారంభమయ్యాయని, నాణ్యమైన విజువల్ గ్రాఫిక్స్ జాన్‌లో రూపకల్పన చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు సాహో, చిరంజీవి సైరా సినిమాకు అద్భుతమైన వీఎఫ్ఎక్స్ అందిస్తున్నట్లు చెప్పారు. సైరా చాలా భారీస్థాయిలో గొప్ప చిత్రంగా వస్తోం దని ఈ సందర్భంగా తెలిపారు. సాహో ప్రపంచ స్థాయి నాణ్యత ఉందన్నారు. చిత్ర బృందంలోని ఓ కీలక వ్యక్తి చెప్పినట్లు ప్రభాస్ బీస్ మూవీ పేరు జాన్‌గా నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ సినిమాను గోపీకృష్ణా మూవీస్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జిల్ చిత్ర దర్శకుడు రాధాకృష్ణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. పూజా హెగ్డే నాయికగా నటిస్తోంది. రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కథలో చాలా రోజుల తర్వాత ప్రభాస్‌ను చూపించబోతోంది జాన్. ఈ ఏడాది చివరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశాలున్నాయి.

ప్రియుడితో విహారానికి వెళ్తే...!


నర్గీస్ ఫక్రి

భయానక చిత్రాల్లో నటించడమంటే ఇష్టమని చెబుతోంది బాలీవుడ్ సుందరి నర్గీస్ ఫక్రి. ఆమె హారర్ చిత్రంలో నటించడమిదే తొలిసారి. సచిన్ జోషి కథానాయకుడిగా నటిస్తున్నారు. సినిమా పేరు అమవాస్. చిత్రీకరణ పూర్తి చేసుకున్న అమవాస్ సినిమా ఫిబ్రవరి 1న విడుదలకు సిద్ధమవుతోంది. గతంలో 1920 ఈవిల్ రిటర్న్, రాగినీ ఎంఎంఎస్ 2, అలోన్ లాంటి భయానక చిత్రాలను రూపొందించిన దర్శకుడు పటేల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా గురించి నర్గీస్ ఫక్రి మాట్లాడుతూ...అతీంద్రియ శక్తుల నేపథ్యమున్న చిత్రాలు చూడటం నాకిష్టం. ఎందుకంటే అవి భయపెడతాయి. ఆ కథలు మనల్ని ఆ సంఘటనలు జరిగే చోటుకి తీసుకెళ్తాయి. హారర్ చిత్రాలు చూస్తుంటే ఒక ఉద్వేగానికి లోనవుతుంటాం. అది క్రమంగా అలవాటుగా మారుతుంది. ఆరేళ్లుగా ఇలాంటి కథల కోసం ఎదురుచూస్తున్నాను. ఇక అమవాస్ చిత్రంలో ప్రేమలో పడిన ఓ యువతిగా కనిపిస్తాను. ప్రేమికుడిని విహారం కోసం ఒక కోట దగ్గరకు తీసుకెళ్తాను. ఆ కోటలో నమ్మలేని సంఘటనలు జరుగుతుంటాయి. అని చెప్పింది. తాను అదృశ్య శక్తులు ఉంటాయని నమ్మనని అయితే హారర్ చిత్రాల్లో నటించడం మాత్రం ఇష్టమని తెలిపింది నర్గీస్.

ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ కొత్త చిత్రం

పాత్రికేయుడు మహేష్ కోనేరు నిర్మాతగా మారి నిర్మిస్తున్న మూడో చిత్రం ఇవాళ లాంఛనంగా ప్రారంభమైంది. నాయిక కీర్తి సురేష్ ఈ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. నరేంద్ర ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, హీరో కళ్యాణ్ రామ్, దర్శకులు



వెంకీ అట్లూరి, హరీష్ శంకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ... తెలుగులో మహానటి తర్వాత నేను చేస్తున్న చిత్రమిది. నాయిక ప్రధానంగా సాగుతుంది. ప్రతి అమ్మాయికీ నచ్చే సినిమా అవుతుంది. ఎక్కువ భాగం అమెరికాలో చిత్రీకరణ జరుగుతుంది. దర్శకుడు నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు. నాకు మరింత పేరు తీసుకొచ్చే సినిమా అవుతుందని నమ్మకముంది. అన్నారు. దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ...మూడేళ్లుగా ఈ కథపై కసరత్తులు చేస్తున్నాను. అన్ని భావోద్వేగాలు కలిసి కథ ఇది. కీర్తి సురేష్ తప్ప ఈ కథకు మరే నాయికా సరిపోరు. ఒక భాగం మన దేశంలో, మూడొంతులు అమెరికాలో చిత్రీకరణ జరుపుతాం. ఏప్రిల్ నుంచి అమెరికా షెడ్యూల్ ఉంటుంది. ఫిబ్రవరిలో రెగ్యులర్ చిత్రీకరణ మొదలుపెడతాం. అన్నారు. నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ...మహానటి చిత్రంతో తెలుగు ప్రేక్షకుల్లో కీర్తి సురేష్ గొప్ప స్థానం సంపాదించుకున్నారు. ఇది మహిళా ప్రధాన చిత్రం. ప్రతి అమ్మాయి ఎక్కడో ఒక చోట ఈ చిత్రంలోని సందర్భాలను తన జీవితంలో చూసుకుంటుంది.అన్నారు. ఈ చిత్రానికి కళ్యాణ్ కోడూరి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు.

ప్రేమికుల రోజున దేవ్ ఆగమనం

కార్తీక్, రకుల్‌ప్రీత్‌సింగ్ జటంగా నటిస్తున్న చిత్రం దేవ్. రజత్ రవిశంకర్ దర్శకుడు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఎస్.లక్ష్మణ్ కుమార్, ఠాగూర్ మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాగా ఈ చిత్రం ఆడియోను ఈ నెల 14న, సినిమాను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ఫస్ట్‌లుక్, పాటలకు మంచి స్పందన లభించిందని వారు చెప్పారు. యాక్షన్, ఫ్యామిలీ డ్రామా కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు ఎంతోబాగా మలుస్తున్నారని తెలిపారు. రమ్యకృష్ణ ఓ కీలక పాత్రలోనూ, నిక్కీగిర్లాని రెండో హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి సంగీతాన్ని హేరీష్ జైరాజ్, ఛాయాగ్రహణాన్ని వేల్రాజ్ అందించారు.


కార్తీక్
రకుల్ ప్రీత్‌సింగ్